అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంగళవారం 27-2-2018

సంపుటి : 4 సంచిక : 60 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00



డెత్ మిస్టరీ

శ్రీదేవి మృతిపై వీడని అనుమానాలెన్నో..

- గంట..గంటకు మారుతున్న నాటకీయ పరిణామాలు
- మద్యం సేవించి ఉండటంతో బాత్రూమ్ టబ్‌లో మృతి అంటూ పోస్టుమార్టం రిపోర్టు
- బోనికపూర్ ఇంటరాగేషన్‌లో వాస్తవాలే చెప్పాడా..!
- కాల్‌డేటాతో డెత్ మిస్టరీ వీడేనా?
- గల్ఫ్‌దేశంలో మట్టుబెడితే.. మ్యానేజ్ చేయవచ్చని అనుకున్నారా..!

వివరాలు 2లో



నేడే ఎంసెట్ నోటిఫికేషన్

4 నుంచి దరఖాస్తుల స్వీకరణ

- ఏప్రిల్ 4వరకూ దరఖాస్తుకు అవకాశం
- మే 2 నుంచి 7వరకు ఆన్‌లైన్‌లో ఎంసెట్
- భారీగా పెరిగిన పరీక్షా ఫీజు : వివరాలు వెల్లడించిన ఉన్నతవిద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డి
- ఈసెట్, పీజీఈసెట్ షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, ఫారెస్ట్రీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంసెట్ పరీక్ష మే 2 నుంచి 7వరకు జరగనున్నది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను అధికారులు మంగళవారం విడుదల చేయనున్నారు. మార్చి 4 నుంచి ఏప్రిల్ 4 వరకూ నెల రోజుల పాటు 9లో



కౌలు రైతులకు పెట్టుబడి ఇవ్వం


70లక్షల మంది రైతులకు బీమా

- మద్దతు ధరపై కేంద్రంతో లడాయి
- రైతాంగ ఆత్మహత్యల పాపం కాంగ్రెస్, బీజేపీలదే
- వ్యవసాయంలో చైనా ఆదర్శం
- 'గోదావరి-కావేరి' అనుసంధానంపై బీజేపీ నాటకం : రైతు సమన్వయ సమితి సదస్సులో సీఎం కేసీఆర్

వివరాలు 3లో

సీఎం పర్యటనలో పోలీసుల ఓవరాక్షన్

3



సీఎం ఇంట్లో సీసీటీవీ ట్యాంపరింగ్

- ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన పోలీసులు
- ఫోరెన్సిక్ పరీక్షకు పంపుతున్నామని వెల్లడి

వివరాలు 2లో

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో ముగ్గురు..
- ఉప్పల్‌లో మరో ముగ్గురు మృతి

వివరాలు 6లో

చరిత్ర సృష్టిస్తాం

ఎక్కడలేని అవినీతి ఇక్కడే

- ఇది కాదు కలలుకన్న తెలంగాణ పాలన
- ఎన్నికలెప్పుడొచ్చినా మాదే అధికారం
- కాళేశ్వరం ప్రాజెక్టును రీ డిజైన్ చేస్తాం : పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- చేవెళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ బస్సుయాత్ర ప్రారంభం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'రాష్ట్రంలో ఈ ప్రజా చైతన్య యాత్ర ఒక చరిత్ర సష్టించనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇక్కడినుండే పాదయాత్ర చేసి చరిత్ర సష్టించారు. తెలంగాణ ప్రజలు కలలుకన్న తెలంగాణ ఇది కాదు. ఎన్నికల ముందు కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చడం లేదు. దళితులు, గిరిజనులను టీఆర్‌ఎస్‌పార్టీ ప్రభుత్వం మోసం చేసింది. భారతదేశంలో ఎక్కడ జరగని అవినీతి తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో 9లో

బస్సుయాత్ర అర్థరహితం

- విపక్ష చూపడంలో కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే : భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

వివరాలు 9లో



భూసేకరణపై సుప్రీం విచారణ

- పరిహారం చెల్లింపులపై భిన్నమైన తీర్పులివ్వడంతో..
- ఉత్తర్వులువచ్చే వరకూ ఆగండి : హైకోర్టులకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం

వివరాలు 12లో

ఈ-గవర్నెన్స్‌తో సేవలు మరింత సులభం

- తొలి ప్రాధాన్యత దానికే
- అనేక అద్భుతాలు సృష్టించాం
- ఒకే యాప్ ద్వారా త్వరలో 180 ప్రభుత్వ సేవలు : ఈ-గవర్నెన్స్ 21వ జాతీయ సదస్సులో మంత్రి కేటీఆర్

వివరాలు 3లో

మింగేస్తున్న అప్పులు

ఉరేసుకున్న యువరైతు.. తట్టుకోలేక తండ్రీ ఆత్మహత్య

- కరీంనగర్‌లో హృదయవిదారక ఘటన
- జనగామ, వరంగల్, కామారెడ్డి జిల్లాల్లో మరో ముగ్గురు రైతులు..

వివరాలు 9లో

సాగు కోసం చేసిన అప్పులు అన్నదాతల్ని మింగేస్తున్నాయి. పంటలెండిపోతుంటే తట్టుకోలేక.. అప్పులతో తాళలేక యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకే పోయాక..వృద్ధాప్యంలో ఎవరు పోషిస్తారన్న బెంగతో తండ్రీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ హృదయవిదారక ఘటన కరీంనగర్ జిలాల సైదాపూర్ మండలం బొమ్మకల్‌లో సోమవారం జరిగింది. అప్పలబాధతోనే వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలంలో మరో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. జనగామ జిల్లాలో పంటకు గిట్టుబాట ధర రాక, మరోవైపు అప్పలు బెంగతో లోలోన కుమిలి ఓ రైతు గుండెపోటుతో చనిపోయాడు. కామారెడ్డి జిల్లాలో బోరుబావుల కోసం చేసిన అప్ప ఎలా తీర్చాలో అర్థం కాక రైతు ఉరేసుకున్నాడు.



(ఫైల్)

అమెరికా చదువుకు దూరం

- డొనాల్డ్ ట్రంప్, నోట్లరద్దు దెబ్బ
- నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికా పాలసీ అధ్యయనం

వివరాలు 2లో

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

నలుగురు మావోయిస్టుల మృతి..వారిలో ఇద్దరు మహిళలు

వివరాలు 2లో





రాష్ట్రం ఉలుకదు.. కేంద్రం పలుకదు..

పూర్తి స్థాయి ప్రతిపాదనలే లేవు : కేంద్ర జలవనరుల శాఖ

- ముఖ్యమంత్రి లేఖలు రాశారంటున్న నీటిపారుదల శాఖ
- కాళేశ్వరం జాతీయ హోదాపై దోబూచులాట



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు జాతీ య హోదా ఇవ్వాలంటూ అధికార టీఆర్‌ఎస్ నేతలు మీడియా ముందుకు రావటం మినహా కేంద్రంపై ఎటువంటి ఒత్తిడి చేయక పోవటం విశేషం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఏపీలోని పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వటానికి కేంద్రం అంగీకరించటమే కాక పునర్విభజన చట్టంలో దీనిని పొందుప రచటం ద్వారా చట్టబద్ధత కల్పించింది. తెలంగాణ లోని ఏదో ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలంటూ టీఆర్‌ఎస్ నేతలు కేంద్రాన్ని కోరారు. వెనుకబడిన ప్రాంతానికి తాగు, సాగునీరందించే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోరాలని మొదట ముఖ్యమంత్రి భావించారు. ఆ తర్వాత రీడిజైన్ పేరుతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 80 వేల కోట్లకు దాటి పోవటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖర్చును 9లో

చంద్రుడిపై ఇండ్లు!

సాంకేతిక పరిజ్ఞానం సిద్ధం చేశాం : ఇస్రో

- 60 టన్నుల అంతరిక్ష పదార్థాలతో 'ఇగ్లూస్' నిర్మాణం



వివరాలు 9లో

త్రిసభ్య ధర్మాసనాల మధ్య ఘర్షణ పరిష్కారానికి

విస్తృత ధర్మాసనం

న్యూఢిల్లీ : రెండు త్రిసభ్య ధర్మాసనాల మధ్య నెలకొన్న ఘర్షణలను పరిష్కరించేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఏర్పాటు చేశారు. ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును మరో త్రిసభ్య ధర్మాసనం ఎలా కొట్టివేస్తుందని జస్టిస్ కురియన్ జోసెఫ్ ప్రశ్నించడంతో సమస్య మొదలైంది. తన సహచర న్యాయమూర్తులు న్యాయవ్యవస్థకు సంబంధించిన క్రమశిక్షణను ఉల్లంఘించారని ఆందోళన వ్యక్తం చేశారు. 2014 నాటి తీర్పును కొట్టివేస్తూ ఈ నెల 8న జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎ.కె.గోయల్, జస్టిస్ ఎం.ఎం.శంతన్‌గౌడర్‌లతో కూడిన బెంచ్ తీర్పు ఇవ్వడంపై జస్టిస్ కురియన్ తీవ్రంగా స్పందించారు. భూ సేకరణకు నష్టపరిహారం కేసులో విచారణ జరుగుతుండగా అడ్వకేట్ జనరల్ ముకుల్ రోహత్గీ మాట్లాడుతూ ఈ రెండు తీర్పుల్లో వెలువడిన భిన్నాభిప్రాయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. దీంతో కురియన్ వ్యాఖ్యలు వెలువడిన మరుసటి రోజు జస్టిస్ మిశ్రా, జస్టిస్ గోయల్‌లు భూసేకరణ కేసులను ప్రధాన న్యాయమూర్తికి నివేదించారు. ఈ కేసులను విస్తృత ధర్మాసనంలో విచారించాల్సిందిగా వారు ప్రధాన న్యాయమూర్తిని కోరారు.

బీహార్ రోడ్డు యాక్సిడెంట్ కేసులో

బీజేపీ నేతపై ఎఫ్ఐఆర్



పాట్నా: తొమ్మిది మంది విద్యార్థులను పొట్టనబెట్టుకున్న బీహార్‌లోని ముజ ఫర్‌పుర్ రోడ్డు యాక్సి డెంట్ ఘటనలో బీజేపీ నేత మనోజ్ బైతాపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శనివారం నాడు విద్యార్థులపైకి బొలెరో కారు దూసుకెళ్లినప్పుడు మనోజ్ బైతానే డ్రైవింగ్ చేస్తున్నాడని, ఆ కారూ ఆయన పేరు మీదే రిజిస్టరై ఉన్నదని పోలీసులు తెలిపారు. దర్యాప్తు ప్రారంభించామని, నిందితుడిని అరెస్టు చేసే ప్రక్రియను ముమ్మరం చేస్తున్నామని చెప్పారు. కారులో ఉన్న మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ప్రమాద స్థలానికి 35 కిలోమీటర్ల దూరంలోని టోల్‌టాక్స్ వద్దనున్న సీసీటీవీలో మనోజ్ బైతా కారు నడుపుతున్నట్టు రికార్డ్ అయిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆర్జేడీ నాయకులు రాష్ట్ర అసెంబ్లీ బయట ధర్నా చేశారు. నిందితుడు ఏ పార్టీకి చెందినవాడైనా ఉపేక్షించబోమని బీహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ మోడీ సోమవారం స్పష్టం చేశారు. అయితే మనోజ్ బైతాను రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. దోషిని కఠినంగా శిక్షిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నితిష్ కుమార్ ఆదివారం వెల్లడించిన విషయం తెలిసిందే.

సీఎం ఇంట్లో సీసీటీవీ ట్యాంపరింగ్

ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన పోలీసులు

ఫోరెన్సిక్ పరీక్షకు పంపుతున్నామని వెల్లడి

న్యూఢిల్లీ : గతవారం ఢిల్లీ సీఎస్ అన్షు ప్రకాశ్‌పై జరిగిన దాడి కేసులో కీలకంగా భావిస్తున్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇంటి నుంచి సేకరించిన సీసీటీవి దృశ్యాలు ట్యాంపరింగ్ జరిగినట్టు తెలుస్తున్నదని ఢిల్లీ హైకోర్టుకు పోలీసులు తెలిపారు. వాటిని పరీక్షించేందుకు ఫోరెన్సిక్ ల్యాబరేటరీకి పంపనున్నట్టు చెప్పారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వాల్ బెయిల్ పిటిషన్‌పై అంజు బజాజ్ చందన సోమవారం విచారణ చేపట్టారు. సీఎస్ కేజ్రీవాల్ నివాసానికి ఢిల్లీ సీఎస్ అన్షు ప్రకాశ్ వెళ్లాడని చెబుతున్న సమయానికి, సీసీటీవీలో నమోదైన సమయానికి మధ్య వ్యత్యాసం ఉందని పోలీసులు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు బెయిల్ పిటిషన్‌పై తీర్పును మంగళవారానికి వాయిదావేసింది.

ఉత్తర ప్రదేశ్‌లో రైలు ఢీకొని ఆరుగురు టీనేజర్లు మృతి

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లోని హపూర్‌లో ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో ఆరుగురు టీనేజర్లు మృతి చెందారు. మరొకరు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. హపూర్ పిల్‌ఖువా సమీపంలోని సాడిక్‌పూర్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. వారు రైల్వే ట్రాక్‌పై నడుస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదానికి గురైన ఏడుగురు 14-16 సంవత్సరాల మధ్య వయస్సువారని, రోజువారి వేతన కార్మికులుగా పనిచేస్తుంటారని, వారందరూ స్నేహితులని స్థానికులు తెలిపారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

రాంచీ: భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులున్నారు. జార్ఖండ్‌లో పలాము జిల్లాలోని లాలాఘాటీ-నౌదియా ప్రదేశంలో సోమవారం ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు అధికారులు వెల్లడించారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)కు చెందిన 134వ బెటాలియన్, జార్ఖండ్ రాష్ట్ర పోలీసుల బృందాలు సంయుక్తంగా యాంటీ మావోయిస్టు ఆపరేషన్(కూంబింగ్) నిర్వహిస్తుండగా ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు వివరించారు. మృతిచెందిన మావోయిస్టులు రాకేశ్ భుయాన్, లల్లూ యాదవ్, రింకీ, రూబీలుగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. ఈ నలుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఘటనాస్థలంలో రెండు రైఫిళ్లు లభ్యమైనట్టు తెలిపారు.

గుజరాతీలో 'మహా' గవర్నర్ ప్రసంగ అనువాదం

- మహారాష్ట్ర అసెంబ్లీలో ఘటన

ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ ప్రభుత్వానికి సోమవారం తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. రాష్ట్ర బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ సి. విద్యాసాగర్‌రావు ప్రసంగం గుజరాతీలో అనువాదం కావడం దుమారం రేపింది. బడ్జెట్ సెషన్‌లో భాగంగా సోమవారం ఉభయసభల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గవర్నర్ ఇంగ్లీషులో ప్రసంగించగా చట్టసభ్యుల హెడ్‌ఫోన్స్‌లో గుజరాతీ అనువాదం వినబడింది. దీంతో ప్రతిపక్ష కాంగ్రెస్, ఎన్సీపీలు సభలో పెద్ద పెట్టున అరుపులతో రచ్చ చేశాయి. తక్షణమే మరాఠీ అనువాదం అందించాలని డిమాండ్ చేశాయి. ఇది చాలా తీవ్రమైన అంశమని, విషయాన్ని తేలికగా తీసుకోవద్దని అసెంబ్లీలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ నాయకుడు రాధాకృష్ణ విఖెపాటిల్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఎన్సీపీ విమర్శించింది. తర్వాత రెండు పార్టీల నాయకులు గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించారు. సాంకేతిక లోపం వల్లనే ఈ పొరపాటు చోటుచేసుకుందని మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి వినోద్ తావ్డే తెలిపారు. ఈ ఘటన పై అసెంబ్లీలో బేషరతు క్షమాపణలు తెలిపిన సీఎం దేవేంద్రఫడ్నవీస్.. ఘటనకు కారణమైన వారి పై వీలైనంత త్వరగా కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ హరిభావ్ బగాడేకి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మరాఠీ భాష దినోత్సవం కాగా ఒక్క రోజుముందే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం కొసమెరుపు.

మతపరమైన విద్య బోధిస్తున్న వ్యక్తి అరెస్టు

తిరువనంతపురం : శాంతి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంఎం అక్బర్‌ను హైదరాబాద్‌లోని విమానాశ్రయంలో ఆదివారం అరెస్టు చేసినట్టు కేరళ పోలీసులు తెలిపారు. పాఠశాలలో మతపరమైన అంశాలను బోధిస్తున్నన్నారని, అందుకు అవసరమైన పాఠ్యపుస్తకాల కోసం ఆయన హైదరాబాద్‌కు వచ్చినట్టు పేర్కొన్నారు. మతపరమైన అంశాలను బోధిస్తున్నట్టు పోలీసులు కేసు నమోదు చేయడంతో 2016 అక్టోబర్‌లో శాంతి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వెలుగులోకి వచ్చింది. పాఠశాల బోధ నాంశాలలో మతానికి సంబంధించిన అంశాలు ఉండ టంతో ఆ సంస్థపై నిఘా వేసినట్టు పోలీసులు తెలిపారు. 2016లో ఇస్లామిక్ స్టేట్‌లో చేరినప్పటి నుండి ముగ్గురు పాఠశాల సిబ్బందితో కలిపి మొత్తం 21మంది ఇప్పటివరకూ వారి ఇండ్లకు వెళ్లలేదని తెలిపారు. ఎర్నాకులమ్ బ్రాంచ్‌కు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ముంబైలోని ముద్రణా సంస్థకు చెందిన సభ్యులు ముగ్గురిని కూడా కొచ్చి పోలీసులు అరెస్టుచేశారు.

డెత్ మిస్టరీ?





అబుదాబి : లేడీ సూపర్‌స్టార్ శ్రీదేవి కన్నుమూసి మూడు రోజులైనా ఆమె డెత్ మిస్టరీ వీడటంలేదు. గంట గంటకు మారుతున్న పరిణామాలతో.. చనిపోయిందా? లేక ఆస్తి కోసం ఆమెను మట్టుబెట్టారా? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. పోస్టుమార్టం రిపోర్టుకన్నా ముందు హార్ట్ఎటాక్ అని ప్రచారం.. ఇపుడు మద్యం సేవించి బాత్ టబ్‌లో పడిపోవటం వల్ల చనిపోయిందని తాజా నివేదికలతో.. ఆ మృతికి సంబంధించిన సందేహాలకు సమాధానం చిక్కటంలేదు. మరోవైపు శ్రీదేవి భౌతికకాయం దుబాయ్ నుంచి భారత్‌కు ఎప్పుడు తీసుకొస్తారన్న ఉత్కంఠకు కూడా తెరపడటంలేదు.

ఈ హైడ్రామా నడిపిస్తున్నదెవరు..!

శ్రీదేవి మరణం వెనుక ఎలాంటి కుట్ర లేదని, గుండెపోటుతోనే ఆమె చనిపోయారని అందరూ అనుకున్నారు. ఇంతలో మా వదినకు గుండెపోటు రాలేదని మరిది సంజయ్‌కపూర్ స్టేట్‌మెంట్ ఇచ్చాడు. మరి శ్రీదేవి డెత్‌కు కారకులెవరు..? బోనికపూర్ ఎంతో ఇష్టపడి చేసుకున్న భార్యను దుబాయ్‌లో వదిలిపెట్టి... అర్ధంతరంగా ముంబయికి ఎందుకు వచ్చాడు. అంతా కానిచ్చేసి సైలెంట్‌గా భారత్‌కు వచ్చేశాడా..? బోనికపూర్ మాట ఎలా మార్చాడు.మొదట..తన స్నేహితుడితో కలిసి శ్రీదేవి రూమ్‌లో మాట్లాడి..మళ్లీ లోనికివెళ్లాక బాత్‌టబ్‌లో గుర్తించానని చెప్పాడు.ఇపుడు సర్‌ప్రైజ్ ఇవ్వటానికి ఇండియా నుంచి దుబాయ్‌లో ఉన్న శ్రీదేవి గదికి వెళ్లానని బోని అంటున్నాడు. ఇలాంటి సస్పెన్స్ నడుమ శ్రీదేవి భర్తను ఇంటరాగేట్ చేసిన పోలీసులు...తమ విచారణ పూర్తయ్యేదాక దుబాయ్ నుంచి వెళ్లొద్దని హుకూం జారీచేసినట్టు సమాచారం.అతని పాస్‌పోర్టు,వీసాను కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

పోస్టుమార్టం నివేదిక జాప్యమెందుకు..?

20న దుబాయ్‌లో పెండికివెళ్తే..శ్రీదేవి 24వ తేది వరకు అక్కడే ఎందుకున్నారు. శ్రీదేవి గుండెపోటుతో చనిపోతే.. పోస్టుమార్టం నివేదిక ఇవ్వడానికి రెండు రోజులు ఆలస్యం ఎందకయ్యిందని సోషల్ మీడియాలో అభిమానులు అడుగుతున్న ప్రశ్న. ఫోరెన్సిక్ రిపోర్టులో దొర్లిన అచ్చుతప్పులపై కూడా పలు అనుమానాలకు తావిస్తున్నది. కాగా శ్రీదేవి మృతివెనుక ఎలాంటి కుట్రలేదని యూఏఈ ఆరోగ్య శాఖ అంటున్నది. కుట్రలేకపోతే.. బోనికపూర్‌ను మూడు గంటలకుపైగా దుబాయ్ పోలీసులు ఎందుకు విచారించారు. మరోవైపు శ్రీదేవి భౌతికకాయాన్ని ఇవ్వడానికి పబ్లిక్ ప్రాసిక్యూషన్ నిరాకరిస్తుండటంతో.. ఆమె మరణం వెనుక ఏదో రహస్యం దాగి ఉన్నదన్న అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి.

ఆస్తి గొడవలే శ్రీదేవిని మట్టుబెట్టాయా..?

బోనికపూర్‌కు నిర్మాతగా మంచి పేరు ఉన్నది. పలు సినిమాలు తీసి నష్టపోయాడని బాలీవుడ్ వర్గాల్లో టాక్. శ్రీదేవి తన నటనావైభవంతో కాస్తో కూస్తో ఆస్తి కూడబెట్టుకున్నదనటంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు. పైగా కుమార్తె జాహ్నవిని వెండితెరపైకి తీసుకొద్దామనుకున్న తన కల నెరవేరేలోపు శ్రీదేవికి నూరేండ్లు నిండాయి. అయితే ఆ జంట మధ్య ఆస్తిగొడవలతో ఆమెను గల్ఫ్‌దేశంలో చాలా సైలెంట్‌గా మట్టుబెట్టి.. మ్యానెజ్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ హోటల్‌లోని సీసీపుటేజ్‌లో ఏమున్నది..?

శ్రీదేవి చనిపోయిన హోటల్ గదిలో ఏం జరిగింది..? ఎవరెవరు ఆమె గదిలోకి వెళ్లారు..? రెండు రోజులపాటు హోటల్ రూమ్‌లోనుంచి ఆమె రాకపోతే.. కుమార్తె జాహ్నవి అక్కడే ఉండి కూడా తల్లివద్దకు ఎందుకు వెళ్లలేదు. దుబాయ్‌లో ఉన్న బోనికపూర్ బంధువులంతా జాహ్నవిని బలవంతంగా ఉంచారా..? భార్యకు తెలియకుండా ఇండియాకు వచ్చాననీ... ఆమెకు సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు మళ్లీ దుబాయ్ వెళ్ళానని బోనికపూర్ చెబుతున్నారు. హోటల్ గదిని బలవంతంగా తెరిచి చూశానని అంటున్నాడు. పైగా ఆమె బాత్‌రూమ్‌లో అచేతనస్థితిలో పడిఉంటే రషీద్ ఆస్పత్రికి తరలించానని బోనికపూర్ అంటున్నాడు. కదల్లేనిస్థితిలో ఉంటే.. హోటల్ యాజమాన్యం.. అంటే రిసెప్షన్‌లోనైనా చెప్పే శ్రీదేవిని ఆస్పత్రికి తరలించాడా? ముందుగా దుబాయ్ పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు? అన్న కోణంలో బోనికపూర్‌తో సహ మరో ముగ్గురిని పోలీసులు విచారించారు. వారితో పాటు శవపరీక్ష నిర్వహించిన ఇద్దరు డాక్టర్లు సహ మరో ఐదుగురు సహాయకులను ఇంటరాగేట్ చేశారు. దీంతో కచ్చితంగా ఇది మర్డర్ మిస్టరీనే అన్న వాదనలు బలపడుతున్నాయి.

శ్రీదేవి కాల్‌డేటాలో లాస్ట్ కాల్ ఎవరిది..?

క్షుణ్ణంగా పరిశీలించటం... ఏ చిన్న క్లూ దొరికినా వదిలిపెట్టకూడదన్నట్టుగా గల్ఫ్ పోలీసుల తీరు ఉంటుంది. కానీ శ్రీదేవి మరణంలో ఎందుకింత సస్పెన్స్ కొనసాగుతున్నదో ఎవరికీ అంతుచిక్కటంలేదు. శ్రీదేవి ఫోన్ కాల్‌డేటాలో లాస్ట్ కాల్ ఎవరికి చేశారు.? అవతలి వ్యక్తి వాయిస్ రికార్డ్‌లో ఏమున్నది..? ఈ వివరాలు బయటకు వచ్చినా.. డెత్ మిస్టరీ బయటకు వచ్చే చాన్స్ ఉన్నదని ఫోరెన్సిక్ నిపుణులు అంటున్నారు.

ఇటు భారత్, అటు దుబాయ్‌లోనే కాదు ఆ మహానటిని ఆరాధించే అభిమానులంతా డెత్ మిస్టరీ ఏ మలుపుతిరుగుతుందోనని ఎదురుచూస్తున్నారు. ఆమె పార్థివదేహం భారత్‌కు ఎప్పుడొస్తుందోనని ఎదురుచూస్తున్నారు. శ్రీదేవి మరణం వెనుక ఏదో దాగి ఉన్నదనే అనుమానాలకు మాత్రం దుబాయ్‌లో బ్రేక్ పడటంలేదు.

మేఘాలయ, నాగాలాండ్‌లో నేడు పోలింగ్

రంగం సిద్ధంచేసిన ఈసీ



షిల్లాంగ్ / కొహిమా: ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయ, నాగాలాండ్‌లో మంగళవారం జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రెండు రాష్ట్రాల్లోనూ 60 అసెంబ్లీ స్థానాలుండగా 59 నిజయోకవర్గాల్లో పోలింగ్ జరుగనున్నది. నాగాలాండ్‌లోని కొన్ని సమస్యాత్మక ప్రాంతాలు మినహా అన్ని జిల్లాల్లో పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలవరకూ జరుగుతుందని ఎన్నికల అధికారి ప్రకటించారు. నాగాలాండ్‌లో ఉత్తర అంగామి-2 నియోజకవర్గంలో ఎన్‌డీపీపీ చీఫ్ నిఫియూ రియో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మేఘాలయలోని ఈస్ట్ గారో హిల్స్ జిల్లా విలియమ్‌నగర్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న ఎన్‌సీపీ అభ్యర్థి జోనథోన్ ఎన్ సంగ్మా ఈ నెల 18న బాంబు పేలుడు ఘటనలో మృతిచెందడంతో ఇక్కడ ఎన్నిక రద్దయింది. రెండు రాష్ట్రాల్లో ఉత్కంఠ భరింతంగా సాగిన ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది.

మేఘాలయ

మేఘాలయలో గత 10 ఏండ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈ ఎన్నికలను ప్రతష్టాత్మకంగా భావిస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ పోటీపోటీ ప్రచారాన్ని నిర్వహించాయి. మొత్తం 59 స్థానాలకుగాను 370 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇందులో 32 మంది మహిళా అభ్యర్థులున్నారు. 3,083 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేయగా, 18.4 లక్షల మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా 67 మహిళా పోలింగ్ స్టేషన్లు, 61 మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేసినట్టు ఎన్నికల అధికారి ఎఫ్ఆర్ కర్‌కోంగర్ తెలిపారు.

నాగాలాండ్

నాగాలాండ్‌లో నేషనల్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)తో బీజేపీ పొత్తుపెట్టుకుంది. ఎన్‌డీపీపీ 40 స్థానాల్లో పోటీచేస్తుండగా, బీజేపీ 20 స్థానాల్లో పోటీలో ఉంది. 1963లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ ముగ్గురు ముఖ్యమంత్రులను అందించిన కాంగ్రెస్ ప్రస్తుతం కేవలం 18 స్థానాల్లోనే పోటీ చేస్తున్నది. రాష్ట్రంలో 11,91,513 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకుగాను 2,156 పోలింగ్ కేంద్రాలను ఈసీ ఏర్పాటుచేసింది. 25 నియోజకవర్గాల్లో 177 మహిళా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేసినట్టు ఈసీ తెలిపింది. ఎన్నికల ఫలితాలు మార్చి 3న వెలువడనున్నాయి. కాగా, ఫిబ్రవరి 18న జరిగిన త్రిపుర ఎన్నికల ఫలితాలు కూడా అదేరోజు వెలువడనున్నాయి.

రాహుల్, అమిత్‌షా ముమ్మర ప్రచారం

న్యూఢిల్లీ : త్వరలో కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాలు ఆ రాష్ట్రంలో హోరాహోరీగా ప్రచారాన్ని సాగిస్తున్నారు. కర్నాటకలో రెండో విడత ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన రాహుల్ తన పర్యటనలో మూడోరోజైన సోమవారం బెల్గామ్ రామ్‌దుర్గ్ జిల్లాలోని గొడ్చి ఆలయాన్ని సందర్శించిన అనంతరం బహిరంగ సభలో పాల్గొన్నారు. అలాగే మండలూర్, కప్పా ఇన్మాగోవన్, హూలి గ్రామాలను పర్యటించిన అనంతరం శ్రీ ఎల్లమ్మ రేణుకా దేవి ఆలయాన్ని కూడా సందర్శిస్తారని అఖిల భారత కాంగ్రెస్ కమిటి ప్రకటించింది. బెల్గామ్ జిల్లాలోని సౌందత్తిలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం, హుబ్లీలోని నెహ్రూ స్టేడియమ్‌లో సాయంత్రం ప్రసంగిస్తారని ప్రకటించింది. అమిత్ షా కూడా బహిరంగసభలతో పాటు ఇతర కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.

నేషనల్ న్యూట్రిషన్ మిషన్

మహిళా దినోత్సవం రోజు ప్రారంభించనున్న మోడీ

న్యూఢిల్లీ: మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున రాజస్థాన్‌లోని ఝున్‌ఝున్‌లో నేషనల్ న్యూట్రీషన్ మిషన్‌ను ప్రధాని మోడీ ప్రారంభించనున్నారు. ఈ పర్యలనలో బేటీ బచావో బేటీ పడావో ప్రచారం పై కూడా ఆయన దృష్టి సారించనున్నారు. డిసెంబర్‌లో ఎన్నికలు జరగనున్న రాజస్థాన్‌లో ప్రధాని మోడీకి ఈ ఏడాదిలో రెండో పర్యటన. గతనెల రాష్ట్రంలో పర్యటించిన మోడీ.. బర్మార్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. మోడీ పర్యటన కోసం రాజస్థాన్ సీఎం వసుంధర రాజే తగు ఏర్పాట్లను చేస్తున్నారు. గత రెండు నెలలుగా ఝున్‌ఝున్‌లోని ఎనిమిది నియోజకవర్గాలు సందర్శించి అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. శెకావతి ప్రాంతంలో ముఖ్యప్రాంతమైన ఝున్‌ఝున్‌లో చురు, శికార్ జిల్లాలున్నాయి. రాజ్‌పూత్, జాట్ ల ప్రాబల్యం ఎక్కువ ఉన్న ఈ ప్రాంతం ప్రతి పార్టీకీ ఓ కఠిన పరీక్ష వంటిది. ప్రధాని పర్యటన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర అధికారులు సమావేశాలు నిర్వహించి ఏర్పాట్ల పై సమీక్షలు చేస్తున్నారు.

హిందువులంతా ఐక్యంగా ఉండాలి

దేశ బాధ్యత మన పైనే

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

మీరట్: దేశ బాధ్యత మన పై ఉన్నందున హిందువులంతా ఐక్యంగా ఉండాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరుగుతున్న 25వ స్వయం సేవక్ సమాగం సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రాచీన కాలం నుంచి ఇది(భారత్) మన ఇల్లు వంటిది. ప్రపంచంలో వేరెక్కడా మనకు(హిందువులకు) చోటు లేదు. ఒక వేళ దేశం వల్ల ఏదైన తప్పు జరిగితే దానికి మనం బాధ్యత వహించాలి' అని ఆయన అన్నారు. భారతదేశ పూర్వీకులు హిందువులేనని సంస్కృతి, గుర్తింపు లేకుంటే దేశం ప్రగతిని సాధించలేదన్నారు. కులాలకతీతంగా హిందువులంతా అన్నదమ్ములేనన్నారు. హిందువులమన్న విషయమే తెలియనివారు దేశంలో ఉన్నారన్నారు. 'నిజం, అహింస అనేవి హిందుత్వ ఎజెండా. హిందువులెప్పుడూ వైవిధ్యాన్ని జరుపుకుంటారు. కఠినంగా మారితే వైవిధ్యాన్ని మరింత ఘనంగా జరుపుకుంటారు' అని అన్నారు. అధికారం వెనుక ఉన్నప్పుడే మంచి విషయాలను ప్రపంచం వింటుందన్నది గమనించాలని నొక్కి చెప్పారు. 'మనం బలపడాల్సిన అవసరం ఉంది. కేవలం సమూహంగా గుమికూడటమే బలం కాదు. ఒకవేళ బలం ఉంటే అదే ప్రదర్శితమవుతుంది' అని తన ప్రసంగంలో పేర్కొన్నారు. భారతదేశం సంస్కృతి సంపద కోసం పాకులాడేది కాదని, ధనవంతులైన రాజుల చరిత్రలను కాకుండా తండ్రి మాట పై గౌరవంతో సంపదలను వదులుకొన్న రాముడిలాంటి రాజులను అనుసరించాలన్నారు. జీవితం అనే భావన మీద భారత్ ఏర్పడిందని అది ఎప్పటికీ అంతరించిపోదని ప్రసంగంలో వివరించారు.

'వందేమాతరం అననివారు పాకిస్తానీయులే'

లక్నో: ఈ దేశంలో ఉంటూ 'భారత్ మాతా కీ జై, వందేమాతరం అననివారు పాకిస్తానీయులే. వారు ఇక్కడ ఉండటానికి అనర్హులు' అంటూ.. ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే సురేంద్ర సింగ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని రత్సాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఉంటూ దేశభక్తి లేనివారు ఖచ్చితంగా పాకిస్తానీయులేనన్నారు. వారిని రాజకీయాల్లోకి అనుమతించకూడదని తెలిపారు. ఇసుక అక్రమ మైనింగ్‌ను పోలీసులు అడ్డుకుంటున్నారనే దానిపై స్పందిస్తూ.. 'మీ (ప్రజలు) ఇంటి అవసరాల కోసం ఇసుకను తరలిస్తుంటే పోలీసులు పట్టుకున్నా.. అవమానించినా వారి చెంపలపై రెండు దెబ్బలు కొట్టండి' అని హితబోధ చేశారు. భారతదేశం 2024 నాటికి హిందూ దేశంగా అవతరిస్తుందని సురేంద్ర సింగ్ గత నెలలో వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

జేఎన్‌యూ

పేదల పట్ల సానుభూతిని నేర్పింది

పూర్వ విద్యార్థుల సంఘం

వార్షికోత్సవంలో గుజరాత్ చీఫ్ సెక్రెటరి



అహ్మదాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం (జేఎన్‌యూ) పూర్వ విద్యార్థిగా తాను ఎంతో గర్వ పడుతున్నానని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జేఎన్ సింగ్ అన్నారు. జేఎన్‌యూ మేథో స్వేచ్ఛనిస్తోందని తెలిపారు. ఆ స్వేచ్ఛ లెఫ్ట్, రైట్ సిద్ధాంతాలకు సంబంధించినది కాదని, పేదల పట్ల సానుభూతి కలిగి ఉండటాన్ని జేఎన్‌యూ బోధిస్తున్నదని, ఏ ప్రభుత్వమైనా ఇష్టపడేది అదేనని అన్నారు. జేఎన్‌యూ పూర్వ విద్యార్థుల సంఘం(ఏఏజే), గుజరాత్ చాప్టర్ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. జేఎన్‌యూలో తాను 1979-1982 మధ్యకాలంలో ఇంటర్నేషనల్ స్టడీస్‌ను అభ్యసించినట్టు ఆయన చెప్పారు. జేఎన్‌యూ మేథోపరంగాను, అంతర్గతంగాను ఎన్నో అవకాశాలను కల్పిస్తోందన్నారు. అందువల్లే మానవ వనరుల మంత్రిత్వ శాఖ (హెచ్‌ఆర్‌డీ) జేఎన్‌యూకు దేశంలో రెండో ర్యాంక్ ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా నేషనల్ ఎస్సెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) జేఎన్‌యూకు ఎ++ ర్యాంక్ ఇవ్వడాన్ని ఆయన ప్రస్తావించారు. అడిషనల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ ప్రసాద్ మాట్లాడుతూ తాను కూడా జేఎన్‌యూ పూర్వ విద్యార్థినేనని చెప్పారు. ప్రశ్నించడాన్ని, హేతుబద్ధంగా ఆలోచించడాన్ని విశ్వవిద్యాలయం తనకు నేర్పిందన్నారు. జేఎన్‌యూలో విద్యనభ్యసించడం తన జీవితంలో చేసిన మంచి పని అని డిజిపి మోహన్ ఝా అన్నారు. ఇక్కడ విద్యనభ్యసించడం వల్ల తన మేధస్సు వికసించిందని అన్నారు. రెండేళ్ళ కాలంలో రెండు సార్లు నిర్వహించిన పూర్వ విద్యార్థుల సంఘం వార్షికోత్సవంలో 25 మంది పాల్గొన్నారు. గుజరాత్ సెంట్రల్‌యూనివర్సిటీ (సీయూజీ), పీడీపీయూ, గుజరాత్ యూనివర్సిటికి చెందిన పలువురు ప్రొఫెసర్లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించాలని గుజరాత్ కేడర్‌కుచెందిన ఐపీఎస్ అధికారి కె.కె. ఓఝా తెలిపారు. ప్రస్తుతం ఆయన అడిషనల్ డీజీపీగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు సంబంధించి కొత్త కమిటీని ఎన్నుకున్నారు. రెవెన్యూ సర్వీసెస్‌కు చెందిన ముంద్రా, డవలప్‌మెంట్ కమిషనర్ అమియా చంద్రా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అడిషనల్ చీఫ్ సెక్రటరి సంగీతా సింగ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

అమిత్‌షాకు చుక్కెదురు

రైతుల ప్రశ్నలకు

బీజేపీ చీఫ్ ఉక్కిరిబిక్కిరి



బెంగళూరు : కర్నాటక ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్ర పర్యటనలో ఉన్న అమిత్‌షాకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. ఆత్మహత్యలు చేసుకున్న పలు రైతు కుటుంబాలను పరామర్శించడంతో పాటు, హుమ్నాబాద్‌ని కలబురగిలో రైతులతో ఓ సమావేశాన్ని నిర్వహించారు. ఇది ఇంటరాక్టివ్ భేటీ అని... రైతులడిగే ప్రశ్నలకు అమిత్‌షా సమాధానం చెబుతారని ప్రచారం చేశారు. దాదాపు వెయ్యి మంది సమావేశానికి హాజరుకాగా, కేవలం ఐదుగురికి మాత్రమే ప్రశ్నలడిగేందుకు అనుమతిచ్చారు. వారడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అమిషాకు చెమటలు పట్టాయి. కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే దాటవేసే ప్రయత్నం చేశారు. వ్యవసాయ సంక్షోభం, దానిని పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రకు సంబంధించిన ప్రత్యక్ష ప్రశ్నలను ఆ సమావేశంలో రైతు నాయకులు అమిత్‌షాకు సంధించారు.

"రూ. 17,15,000 కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేయడానికి మీ వద్ద తగిన నగదు ఉంది. కానీ, 12,60,000 కోట్ల రైతు రుణాలను మాఫీ చేసేందుకు మాత్రం మీ దగ్గర నిధులులేవు. మిమ్మల్ని అధికార పీఠం ఎక్కించింది పారిశ్రామికవేత్తలు మాత్రమే కాదని మీరు తెలుసుకోవాలి" అని అమిషాత్‌ను రైతు నాయకుడు సిద్ధరామప్ప ప్రశించారు. ఏ కార్పొరేట్ రుణాలను కేంద్రం రద్దుచేయాలని అమిత్‌షా వివరణ ఇచ్చారు. "కార్పొరేట్ రుణాలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసిందని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ చెబుతున్నారు. మేం ఏ కార్పొరేట్ రుణాన్ని రద్దుచేయలేదు. పారిశ్రామికవేత్తలకు సహాయం చేసేందుకు పన్ను రేట్లను తగ్గించాం' అని అమిత్‌షా అన్నారు. అయితే రుణమాఫీ చేయాలన్న రైతుల డిమాండ్‌పై మాత్రం ఆయన స్పందించలేదు. 'ప్రతి పంటకు ఉత్పత్తి ఖర్చుకు ఒకటిన్నర రెట్లు కనీసమద్దతు ధర కల్పిస్తామన్నారు... ఎంఎస్ స్వామినాథన్ సిఫారసులను అమలుచేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాన్ని ఎందుకు అమలుచేయడంలేదు.?' అని మరో రైతు నేత ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానాన్ని ఇవ్వకుండా షా దాటవేశారు.

అమెరికా చదువుకు దూరం



న్యూఢిల్లీ: అమెరికాలో ఉన్నత చదువుకు ఎన్నో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక, వీసా, వర్క్ వీసా నిబంధనల్ని కఠినతరం చేయటం భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపింది. కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ కోర్సులు చదవడానికి అమెరికా వెళు న్న భారతీయ విద్యార్థుల సంఖ్య 2016-2017 మధ్యకాలంలో 21శాతం తగ్గిందని నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికా పాలసీ (ఎన్ఎఫ్ఏపీ) చేపట్టిన అధ్యయనంలో వెల్లడైంది. ప్రధాని నరేంద్రమోడీ సర్కార్ తీసుకున్న నోట్లరద్దు నిర్ణయం భారతీయ విద్యార్థుల విదేశీ విద్యావకాశాల్ని దారుణంగా దెబ్బకొట్టిందని అధ్యయనం అభిప్రాయపడింది.

యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అందించిన సమాచారం ఆధారంగా ఎన్ఎఫ్ఏపీ ఈ వివరాలు వెల్లడించింది. ఇతర దేశాల నుంచి అమెరికా విశ్వవిద్యాలయాల్లో చదువుకోవటానికి వచ్చే వారి సంఖ్య కూడా 2016-2017 మధ్యకాలంలో 4శాతం తగ్గిందని తెలిపింది. దీనిలో భారత్ నుంచి వచ్చి కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులే అధికం. భారత్ నుంచి వచ్చే విద్యార్థులే అమెరికా కంపెనీలకు ప్రధాన మానవ వనరులుగా ఉంటున్నారు.

"డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠిన వీసా, వర్క్ నిబంధనలే విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గుదలకు కారణం. పెద్దనోట్ల రద్దు కారణంగా ఏర్పడిన నగదు కొరతా కొంతవరకూ ఈ పరిస్థితికి కారణమే! చదువు తరవాత ఉద్యోగ అవకాశాలు లేకపోవడం ఈ తగ్గుదలకు ప్రధాన కారణం" అని ఎన్ఎఫ్ఏపీ విశ్లేషించింది. భారత విదేశీ మంత్రిత్వశాఖ అంచనా ప్రకారం 2017లో 2,06,708 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ కోసం అమెరికా వెళ్లారు.

కౌలు రైతులకు 'పెట్టుబడి' ఇవ్వం


మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణ-కరీంనగర్ టౌన్

"రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులకు బీమా సౌకర్యం కల్పిస్తాం. కౌలు రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్టుబడి పథకం ఇవ్వబోం. మద్దతు ధర విషయమై కేంద్రంతో లడాయికైనా దిగుతాం" అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్‌తోపాటు సిద్దిపేట జిల్లాల రైతు సమన్వయ సమితులతో ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ... రైతు అనారోగ్యంతోగానీ, అకాల మరణం పొందినా కుటుంబానికి రూ.ఐదు లక్షల పరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని చిట్యాలకు చెందిన మొగిలి సీఎంను కోరగా, ఇది కేంద్రం పరిధిలో ఉందని దాట వేశారు. ఈ విషయమై మార్చి 5 నుంచి నిర్వహించే పార్లమెంటు సమావేశాల్లో తమ పార్టీ ఎంపీలు కొట్లాడుతారని చెప్పారు. రాష్ట్రంలో 97 శాతం రైతులు వారి భూముల్లోనే సాగు చేస్తున్నారని, అసలు కౌలు రైతులెక్కడున్నారని వ్యాఖ్యానించారు. ఎకరాకు రూ.8వేల చొప్పున ఇవ్వనున్న పెట్టుబడిని కౌలు రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమన్నారు. ఈ పథకాన్ని అమలు చేయడం ప్రభుత్వ బిజినెస్ కాదని వ్యాఖ్యానించారు. రైతుల యాజమాన్య హక్కును కాపాడుతామని చెప్పారు. కల్తీ విత్తన వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతామని, వారిపై పీడీయాక్ట్ అమలు చేస్తామని చెప్పారు. ఐదు వేల ఎకరాల సాగుకు రైతు వేదికను ఏర్పాటు చేసి విస్తరణాధికారి పర్యవేక్షిస్తారని తెలిపారు. ఇలా 2,638 వేదికలకు రూ.12 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సంవత్సరం డిసెంబర్ వరకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మధ్యమానేరు, ఇతర ప్రాజెక్టుల ద్వారా చెరువులు, కుంటలు నింపుతామని వివరించారు.

రైతాంగ ఆత్మహత్యల పాపం వారిదే..

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశాన్ని కాంగ్రెస్, బీజేపీలే పాలిస్తున్నాయని, అవి అవలంబించిన రైతు వ్యతిరేక విధానాల వల్లే రైతాంగ ఆత్మహత్యల ఖర్మ పట్టిందని సీఎం కేసీఆర్ అన్నారు. ఇప్పటికే కేంద్రంపై రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం రైతులు కేంద్రంపై తిరుగుబాటు చేస్తారని, ఇందుకు రైతు సమన్వయ సమితులు నాయకత్వం వహిస్తాయని అన్నారు. మన దేశంలో కంటే తక్కువ సాగు భూములున్న చైనా వ్యవ సాయ రంగంలో స్వావలంభన సాధించి విదేశాలకు ఆహార ఉత్పత్తులు ఎగుమతి చేస్తోందని గుర్తు చేశారు. 70 ఏండ్ల పాటు కాంగ్రెస్, బీజేపీలు అసమర్థ, అవివేక, రైతు వ్యతిరేక పాలన సాగిస్తూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీలో వ్యవసా యాన్ని అను సంధానిం చాలని 20 మార్లు ప్రధా నికి చెప్పామని గుర్తు చేశారు. ప్రస్తుతం దీనిపైనా రైతు సమ న్వయ సమితి సభ్యుల సదస్సు వేదికగా తీర్మా నించి కేంద్రానికి నివేదిస్తు న్నట్టు ప్రకటించారు. పార్ల మెంట్ సమావేశాల్లో ఈ విషయ మై నిలదీ యాలని ఎంపీలకు సూచించారు. కర్నాటక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గోదావరి- కావేరి నదుల అనుసం ధానం పేరుతో బీజేపీ ప్రభుత్వం నాటక మాడు తోందని విమర్శిం చారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసా యానికి రూ.రెండు లక్ష లు కేటా యించేందుకు చేతు లు రావడం లేదని అన్నా రు. సదస్సులో రాష్ట్ర మంత్రు లు, ఉత్తర తెలం గాణ ప్రాంత ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు, రైతు సమ న్వయ సమితి అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల ఓవరాక్షన్

- సీఎం పర్యటన నేపథ్యంలో సీఐటీయూ కార్యాలయంలో అర్ధరాత్రి సోదాలు
- ఎవరూ బయటకు రాకుండా నిర్బంధం : సాయంత్రం వరకు అక్కడే గస్తీ



నవతెలంగాణ-కరీంనగర్ టౌన్

సీఎం కేసీఆర్ సోమవారం కరీంనగర్ పర్యటన సంద ర్భంగా పోలీసులు అతిగా ప్రవర్తించారు. స్థానిక ముకుం దలాల్ మిశ్రా (సీఐటీయూ) భవన్‌లో ఆదివారం అర్ధరాత్రి నుంచి తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి గేటుకు తాళాలుంటే తీయాలని కార్యాలయ సిబ్బందిని బెదిరింపులకు గురిచేసినట్టు కార్యకర్తలు చెప్పారు. తెల్లవార ఝామున టాస్క్‌ఫోర్స్ పోలీసులు వివిధ ప్రజాసంఘాల కార్యాల యాలను తనఖీ చేశారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు హాలులో చదువుకుంటుండగా వారిని అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. హాలు తాళాలు తీయాలని బెది రింపులకు గురిచేసినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రజనీ కాంత్ తెలి పారు. సీఎం కార్యక్రమం ముగిసే వరకు విద్యా ర్థులు బయటికి రాకుం డా నిర్బంధించారు. ఆదివారం అర్ధ రాత్రి నుంచి సోమవారం సాయం త్రం సీఎం సదస్సు ముగిసే వరకు పోలీసులు కార్యాలయం వద్ద గస్తీ నిర్వహించారు

ఈ-గవర్నెన్స్‌తో సేవలు మరింత సులభం

- రాష్ట్రంలో తొలి ప్రాధాన్యత దానికే
- అనేక అద్భుతాలు సృష్టించాం
- ఒకే యాప్ ద్వారా త్వరలో 180 ప్రభుత్వ సేవలు : ఈ-గవర్నెన్స్ 21వ జాతీయ సదస్సులో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈ-గవర్నెన్స్ ద్వారా సామాన్య ప్రజలకు సేవల్ని మరింత సులభతరంగా అందించ వచ్చని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖల మంత్రి కె తారకరామారావు అన్నారు. ఈ సేవలకు రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, ఆచరణలో ఇప్పటికే అనేక అద్భుతాలు సృష్టించి, దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే ఈ-గవర్నెన్స్ 21వ జాతీయ సదస్సు సోమవారంనాడిక్కడి హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో ప్రారంభమైంది. కేంద్ర పౌర సరఫరాలు మరియు కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ శాఖ మంత్రి సీఆర్ చౌదరితో కలిసి కేటీఆర్ ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, దానిలో భాగంగానే టీ-హబ్ ఏర్పాటు చేశామని చెప్పారు. పౌరసేవల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 4,500 మీ-సేవా కేంద్రాల ద్వారా ఏటా 10 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయని వివరించారు. ఆన్‌లైన్ లావాదేవీల కోసం టీ-వ్యాలెట్, రవాణాశాఖ సేవల కోసం ఎమ్-వ్యాలెట్ వంటివి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. వీటికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని చెప్పారు. పౌరసరఫరాల శాఖలో టెక్నాలజీని వినియోగించడం ద్వారా రూ.200 కోట్ల ప్రజాధన దుర్వినియోగాన్ని నిరోధించగలిగామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉన్నదని, హైదరాబాద్ నగరం అన్ని రకాల వ్యాపారాలకు అనుకూలమైన ప్రాంతమని చెప్పారు. టీఎస్ ఐపాస్ ద్వారా 15 రోజుల్లోనే నూతన పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నామని, గడువులోపు ఇవ్వకుంటే ఇచ్చినట్టే భావించాలని ధైర్యంగా ప్రకటించిన ప్రభుత్వం తెలంగాణ మాత్రమేనని చెప్పారు. భవన నిర్మాణ అనుమతులు కూడా 21 రోజుల్లో ఇచ్చేయాలని, లేనిపక్షంలో ఇచ్చినట్టే భావించి నిర్మాణాలు కొనసాగించుకోవచ్చని ప్రకటించామన్నారు. మిషన్ భగీరథ పైపులైన్లకు అనుసంధానంగా కమ్యూనికేషన్ కేబుల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తూ, ప్రతి ఇంటికి టెక్నాలజీని అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. 86 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో భూరికార్డుల ప్రక్షాళన చేపట్టామని తెలిపారు. ఒకే మొబైల్ యాప్ ద్వారా 180 ప్రభుత్వ సేవల్ని త్వరలో ప్రజలకు అందించనున్నామని చెప్పారు. కేంద్రమంత్రి సీఆర్ చౌదరి మాట్లాడుతూ 1997 నుంచి దేశంలో సాంకేతిక విప్లవం ప్రారంభమైందని, ప్రజలకు మెరుగైన సత్వర సేవల్ని అందిస్తోందని అన్నారు. ఆధార్ ద్వారా నిజమైన లబ్దిదారులకు ప్రయోజనం లభిస్తోందన్నారు. మొబైల్ ఫోన్ల వాడకంలో ప్రపంచంలో భారతదేశం రెండో స్థానంలో ఉందని చెప్పారు. దేశంలో 23.3 రేషన్‌కార్డులు ఉంటే..ఆధార్ అనుసంధానం తర్వాత వాటిలో 2.95 కోట్లు డూప్లికేట్ అని తేలిందని వివరించారు. భవిష్యత్‌లో కాగితం లేని ప్రభుత్వ కార్యాలయాలను చూడవచ్చని తెలిపారు. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదంతో కేంద్రప్రభుత్వం సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నదని అన్నారు. ఆధార్ సీఈఓ అజయ్ భూషణ్ పాండే మాట్లాడుతూ దేశంలో ఆధార్ కార్డుల జారీ 99 శాతం పూర్తయ్యిందని చెప్పారు. ఆధార్ అనుసంధానం వల్ల ప్రభుత్వ ధన దుర్వినియోగం తగ్గడంతోపాటు ప్రజల్లో జవాబుదారీతనం పెరిగిందని వివరించారు. ఆధార్ డాటా పూర్తిగా సురక్షితమని, దీనివల్ల అర్హులకు మాత్రమే ప్రభుత్వ ప్రయోజనాలు అందుతున్నాయని చెప్పారు. ఆధార్ అనుసంధానం వల్ల ఎవరి హక్కులు వారికే చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషితో పాటు పలు ప్రభుత్వ, ప్రయివేటు రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛకార్మికుల యూనియన్ నూతన కమిటీ ఎన్నిక


సీహెచ్ జగదీశ్


ఎస్ రమ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛకార్మికుల యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా సీహెచ్ జగదీశ్ (ఆదిలాబాద్), ప్రధాన కార్యదర్శిగా ఎస్ రమ (రాష్ట్రకేంద్రం) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె లక్ష్మీనారాయణ(కామారెడ్డి), శ్రావణ్ (నిర్మల్), ముంజం శ్రీనివాస్, కార్యదర్శులుగా సుంకెట మహేశ్, జె మాధవ్, దుంపల రాజు, కోశాధికారిగా నాగారపు ఎల్లయ్యతో పాటు మరో 21 మందితో రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛకార్మికులు, అటెండర్లు, నైట్ వాచ్‌మెన్స్ తదితర కేటగిరిల్లో పనిచేస్తున్న కార్మికుల రాష్ట్ర సదస్సు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ వివరాలను సోమవారం మీడియాకు విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలనీ, పనిభద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని సదస్సులో పలు తీర్మానాలు చేశారు.

చర్మ ఆరోగ్యానికి.. కేశ సంరక్షణకు... లా బ్లిస్ స్పా

- దిల్‌సుఖ్‌నగర్‌లో ప్రారంభం



దిల్‌సుఖ్‌నగర్: నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మహిళలు తమ చర్మ ఆరోగ్యానికి, కేశ సంరక్షణకు తగిన సమయం కేటాయించకపోవడం వల్లే చర్మం నిగారింపు కోల్పోయి నిర్జీవంగా మారుతోందని లా బ్లిస్ స్పా నిర్వాహకురాలు ఉషా కొండవీటి అన్నారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్ నగర్‌లో లా బ్లిస్ స్పా సంస్థను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అతివల అందాన్ని ద్విగుణీకృతం చేసి వారిలో తరగని ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకే లా బ్లిస్ స్కిన్ అండ్ హెయిర్‌కేర్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. తమ సంస్థలో అంతర్జాతీయ సౌకర్యాలతో పాటు అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామని అన్నారు. మధ్య తరగతి మహిళలకు సైతం అందుబాటులో ధరల్లో సేవలు అందించనున్నట్టు పేర్కొన్నారు. సంస్థ ప్రారంభోత్సవం సందర్భంగా మొదట పేర్లను నమోదు చేసుకున్న 100 మంది కస్టమర్లకు ఆరు నెలల వరకు 50శాతం డిస్కౌంట్ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సంస్థకు వచ్చే లాభాల్లో 50 శాతం నగదును స్వచ్ఛంద సంస్థ ద్వారా పేద బాలికల చదువుకు వినియోగించనున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సంపాదకీయం


దిగ్భ్రాంతికరం



అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న నటి శ్రీదేవి హఠాన్మరణం కేవలం సినీ ప్రేక్షకులకే కాక యావత్ దేశం, ఆ మాటకొస్తే ప్రపంచానికి దిగ్భ్రాంతికరం. సమీప బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు దుబాయ్ వెళ్లిన శ్రీదేవి శనివారం పొద్దుపోయాక తాను బస చేసిన హోటల్లోని స్నానపుగదిలో విగతజీవి అయ్యారన్న వార్త ఆమెతో కలిసి చిత్ర పరిశ్రమలో పనిచేసిన వారినే కాక దక్షిణాది ఉత్తరాది అనే భేదం లేకుండా కళలు, సాంస్కృతిక రంగాలతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ విషాదంలో ముంచింది. తమిళం, తెలుగు, హిందీ, కన్నడం, మలయాళం, హిందీ ఐదు భాషల్లో ఐదు దశాబ్దాలపాటు వెండితెరను ఏలిన శ్రీదేవి చరిత్రకు చిరునామా. సినీ వినీలాకాశంలో చెరగని సంతకం. అందం, ఆహార్యం, అభినయం కలబోతగా సినీ విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు పొందడం ఒక్క శ్రీదేవికే సాధ్యమైంది. తమిళనాడులోని శివకాశీలో 1963లో పుట్టిన శ్రీదేవి నాలుగేండ్ల ప్రాయంలోనే అరంగేట్రం చేసి ఇక వెనక్కి చూడకుండా యాభై ఏండ్లపాటు సినీరంగంలో అగ్రపథాన్ని అధిరోహించడం అసాధారణం. మామూలుగా సినీ పరిశ్రమలో పురుషాధిక్యం రాజ్యమేలుతుంది. కథానాయకులకే పెద్దపీట. ఆ ఆనవాయితీ శ్రీదేవి విషయంలో ఎంత మాత్రం పని చేయలేదు. శ్రీదేవి హీరోయిన్ అయితే చాలు తమ వ్యాపారానికి ఢోకా లేదనే విధంగా నిర్మాతలు, దర్శకులను తన కాల్‌షీట్ల కోసం క్యూ కట్టించారామె. శ్రీదేవి లేని సినిమాను వెలితిగా భావించేవారు ప్రేక్షకులు. అదీ ఆమె స్టార్‌డమ్. అందుకే 1980వ దశకం శ్రీదేవికి స్వర్ణయుగం. లేడీ సూపర్‌స్టార్‌గా ఎదిగిన ఆమె రెమ్యునరేషన్ అగ్ర హీరోలతో సరిసమానంగా ఉండేదంటారు. అందుకే భారతదేశ వెండితెర చరిత్రను ఎవరైనా లిఖించదలిస్తే శ్రీదేవికి కచ్చితంగా ఒక అధ్యాయం కేటాయించాల్సిందే. శ్రీదేవి కోలీవుడ్‌లో తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించి బాలీవుడ్‌లో స్థిరపడినప్పటికీ ఆమె వంశ మూలాల దగ్గర నుంచి సినిమాల వరకు తెలుగు ప్రాంతం, ఇక్కడి ప్రజలతోనే అనుబంధం ఎక్కువ. శ్రీదేవి తాత తిరుపతికి చెందినవారు. తర్వాత వ్యాపారం కోసం తమిళనాడుకు మకాం మార్చారు. శ్రీదేవి బాల్యం తిరుపతిలోనే గడిచింది. ఆమె నటించిన 300 సినిమాల్లో తెలుగు చిత్రాలే ఎక్కువ. ఆమెతో అత్యధిక చిత్రాలు నిర్మించిన దర్శకుడు కూడా తెలుగువారే. కాబట్టి శ్రీదేవి అగ్రతారగా వెలుగొందడానికి తెలుగు గడ్డపైనే బలమైన బీజాలు పడ్డాయనడంలో సందేహం లేదు. తెలుగులో అగ్ర నటులు ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, వెంకటేష్, నాగార్జున తదితరుల సరసన శ్రీదేవి నటించారు. హీరోల్లో రెండు తరాల వారితో హీరోయిన్‌గా నటించింది ఆమె ఒక్కరే. అందుకే తెలుగు ప్రజల హృదయాల్లో నాటికీ నేటికీ 'దేవత'గా గూడుకట్టుకున్నారు. ఒక్క తెలుగులోనే కాదు, తమిళంలో రజనీకాంత్, కమల్‌హాసన్, హిందీలో అమితాబ్, అనిల్‌కపూర్, రాజేశ్‌ఖన్నా, జితేంద్ర, వంటి యోధానుయోధులతో నటించడం శ్రీదేవికే సాధ్యమైంది. ఆమెను ఎంతగా పాత్రలు వెతుక్కుంటూ వచ్చాయో అవార్డులు, రివార్డులూ అంతే. భారత ప్రభుత్వం ప్రదానం చేసిన పద్మశ్రీ, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఉత్తమ నటి, ఫిలింఫేర్ ఇత్యాది ఎన్నో అవార్డులు, సత్కారాలు శ్రీదేవి సొంతమయ్యాయి. బోనీకపూర్‌తో వివాహం అయ్యాక 1997 నుంచి దశాబ్దంన్నరపాటు నటనకు దూరమైనా అభిమానులు శ్రీదేవిని మర్చిపోలేదనడానికి నిదర్శనం అనంతరం ఆమె నటించిన ఒకటి రెండు సినిమాల ఘన విజయాలు. సినిమారంగంలో సత్తా చూపి వివాదాలకు దూరంగా ఉన్న శ్రీదేవి మృతి చెందారన్న వార్త అభిమానులను శోకసంద్రంలో ముంచగా ఆమె మరణంపై గంటకో తీరుగా అనుమానాలు రేకెత్తించడంతో మరింత కలత చెందుతున్నారు. శనివారం అర్ధరాత్రి దాటాక తీవ్రమైన గుండెపోటుతో దుబాయ్‌లో తాను బస చేసిన హోటల్‌లోని బాత్‌రూంలో శ్రీదేవి కుప్పకూలగా ఆస్పత్రికి తరలించేలోపు ప్రాణాలు విడిచారని తొలుత వెల్లడైంది. ఆదివారం సాయంత్రానికే ప్రత్యేక విమానంలో మృత దేహాన్ని ముంబయికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. శవ పరీక్ష పూర్తయినప్పటికీ ఫోరెన్సిక్ నివేదిక రానందున మృతదేహం తరలింపు సోమవారం ఉంటుందన్నారు. ఇప్పుడేమో శ్రీదేవి గుండెపోటుతో కాదనీ, ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో పడి చనిపోయారని దుబాయ్ ఫోరెన్సిక్ డిపార్టుమెంట్ పేర్కొందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆమె మృతిలో కుట్ర, నేర పూరిత కోణం లేదంటూనే పోలీసులు తదుపరి విచారణను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు బదిలీ చేశారు. ఆమె శరీరంలో మద్యం నమూనాలు ఉన్నాయంటున్నారు. మృతదేహం తరలింపులో జాప్యం కారణంగా సర్వత్రా ఆందోళన అధికమైంది. మితిమీరిన స్థాయిలో సౌందర్య సాధనాల వాడకం, శస్త్ర చికిత్సలు, మానసిక ఒత్తిళ్లు 54 ఏండ్లకే శ్రీదేవి మరణానికి కారణమన్న వాదన బయలుదేరింది. పలువురు సెలబ్రిటీల జీవితాలు విషాదాలతో ముగిసిన అనుభవం ఉన్న దరిమిలా నివాళులతో సరిపెట్టకుండా శ్రీదేవి మృతిపై వాస్తవాలు వెల్లడించాల్సిన బాధ్యత భారత ప్రభుత్వంపై ఉంది. అవసరమనుకుంటే సమగ్ర విచారణ జరిపించాలి. ప్రస్తుతం దుబాయ్‌లో బోనీకపూర్‌ను విచారిస్తున్నట్టు సమాచారం. అకాల మరణం చెందిన శ్రీదేవికి నివాళి.

సౌందర్య సాధనాల వాడకం, శస్త్ర చికిత్సలు, మానసిక ఒత్తిళ్లు 54 ఏండ్లకే శ్రీదేవి మరణానికి కారణమన్న వాదన బయలుదేరింది. పలువురు సెలబ్రిటీల జీవితాలు విషాదాలతో ముగిసిన అనుభవం ఉన్న దరిమిలా నివాళులతో సరిపెట్టకుండా శ్రీదేవి మృతిపై వాస్తవాలు వెల్లడించాల్సిన బాధ్యత భారత ప్రభుత్వంపై ఉంది. అవసరమనుకుంటే సమగ్ర విచారణ జరిపించాలి. ప్రస్తుతం దుబాయ్‌లో బోనీకపూర్‌ను విచారిస్తున్నట్టు సమాచారం. అకాల మరణం చెందిన శ్రీదేవికి నివాళి.

ప్రజాస్వామ్య ముసుగులో నిరంకుశత్వం



తెలకపల్లి రవి

ప్రపంచ వ్యాపితంగా ప్రజాస్వామ్య ఎన్నికల పద్ధతిని ఏకపక్ష పాలనవైపు, ఏక వ్యక్తి పెత్తనం వైపు మరల్చడం ఆందోళన కలిగిస్తున్నది. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ నుంచి భారత దేశంలో నరేంద్ర మోడీ వరకూ ఆఖరుకు రెండు తెలుగు రాష్ట్రాలతో సహా ప్రభుత్వాధినేతల పోకడలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ఏమంటే మాకు ప్రజలు ఎన్నికల్లో ఓట్లేశారన్నది సమాధానంగా వుంటున్నది. ఎన్నికల మెజార్టీ ఉన్నంత మాత్రాన మొత్తం రాజకీయ రాజ్యాంగ వ్యవస్థలను తలకిందులు చేసేంత అధికారం లభిస్తుందా అనేది పెద్ద సవాలుగా మారుతున్నది. పాశ్చాత్య మేధావులు సిద్ధాంతకారులు కూడా ఈ వాస్తవాన్ని అంగీకరించాల్సి వచ్చింది. వారు దీనికే ప్రజారంజక నియంతృత్వం (పాపులిస్టు అధారిటేరియనిజం) అని నామకరణం చేశారు. ఆసియా ఆఫ్రికా యూరప్ దేశాలలో అమెరికా ఖండంలో ఎన్నికల ద్వారా వచ్చిన నాయకులే ఇష్టానుసారం వ్యవహరించడం ప్రత్యర్థులను అణచి వేయడం సర్వసాధారణమైయింది.

ఇన్ని ప్రతికూలతల మధ్యనా ప్రజాస్వామిక శక్తులూ ప్రత్యామ్నాయ వాదులూ తమ పోరాటం సాగిస్తూనే ఉండటం ఊరట కలిగించే అంశం. ఆర్థిక పోరాటాలకు తోడు సామాజికాంశాలు కూడా తోడవుతుండటం, సాంస్కృతిక స్వేచ్ఛలను కాపాడుకోవాలనే స్పృహ పెరగడం ఆహ్వానించదగింది. ఈ తరహా భావ స్రవంతులనూ చర్చలనూ కార్యాచరణనూ బలోపేతం చేసుకోవడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలం. నిరంతర అప్రమత్తతే స్వాతంత్రానికి మూల్యం అన్నమాట ఎప్పటికీ చెరిగిపోని పరమ సత్యం.

ఈ రాజకీయార్థిక పెత్తనానికి మీడియా కూడా తోడై ప్రజలకు సరైన సమాచారం కూడా రాకుండా చేస్తున్నది. ముందే నిర్ధారించిన ఎజెండా ప్రకారం నడిపించడం జరుగుతున్నది. పాశ్చాత్య మీడియాధినేతలైన రూపర్ట్ మర్డోక్ వంటివారు గానీ భారతదేశంలోనూ తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రాబల్యం వహిస్తున్న మీడియాధిపతులు గానీ ఏది ఎలా రాయాలి ఏ మేరకు చెప్పాలి, చూపాలి ముందే నిర్ణయించేస్తున్నారు.

జనస్వామ్యమా?ధనస్వామ్యమా?

ఏకధృవ ప్రపంచమనే ప్రచారంలో అగ్రరాజ్యాధిపత్య పీఠాధిపతి ఒకరు అంత వికృతంగా వినాశకరంగా మాట్లాడగలరని వ్యవహరిస్తారని అంతకు ముందు కొందరి ఊహలో కూడా లేదు. తన తండ్రి ట్రంప్ అమెరికా అధ్యక్షుడైన కారణంగా తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆయన కుమారుడు వ్యాఖ్యానించాడంటే అహంభావం ఏ స్థాయిలో వుందీ తెలుస్తోంది. నిజానికి ఇది ఏకధృవ ప్రపంచం కాదు గనక బహుళ ధృవాలు పనిచేస్తున్నాయి గనక ప్రత్యర్థి శక్తులపై దేశాలపై దుర్భాషలకు దాడులకూ దారితీస్తున్నది. ప్రపంచంలో కొన్ని దేశాలలో వామపక్ష ప్రత్యామ్నాయ శక్తులు విజయాలు అందుకున్నా అనేక చోట్ల మితవాద జాతి దురహంకార శక్తులు అధికారం అందిపుచ్చుకోవడం అందరూ గుర్తిస్తున్న విషయమే. అయితే అంతగా గుర్తించబడని అంశం ఈ అధికారిక నిరంకుశత్వం. (కొంతమంది ఈ జాబితాలో చైనాను వెనిజులా వంటి వాటిని చేర్చి మాట్లాడటం పొంతనలేని విషయం.) బూర్జువా ప్రజాస్వామ్యం ఎప్పుడూ సంపూర్ణమైంది కాదనీ, సార్వత్రిక ఓటింగు ఉన్నా అక్కడ గుత్తాధిపతుల మాటే చెల్లుతుందని అనుభవం చెబుతున్న సత్యం. రాచరిక భూస్వామ్యంతో పోలిస్తే బూర్జువా ప్రజాస్వామ్యం మెరుగైంది కావచ్చు. గానీ అక్కడ జనస్వామ్యం ధనస్వామ్యంగానే ఉంటుంది. ప్రత్యామ్నాయ శక్తుల పెరుగుదలను అడ్డుకోవడానికి నిర్బంధాలూ నిరంకుశత్వాలతో పాటు అనేక రాజకీయార్థిక ప్రలోభాలనూ కొన్ని సంక్షేమ పథకాలనూ కూడా ఈ రాజ్యాలు అమలు చేశాయి. సామ్యవాదానికి విరుగుడు సంక్షేమ రాజ్యమేనని ప్రచారం చేశాయి. అయితే సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం సోషలిజానికి ఎదురుదెబ్బల తర్వాత వారికి ఆ అవసరం లేకుండా పోయింది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పథకం నిరాఘాటంగా ప్రపంచ వ్యాపితంగా అమలు కావాలంటే ప్రజాస్వామ్య విలువలూ ప్రజాఉద్యమాలూ వారికి ప్రమాదంగా కనిపిస్తుంటాయి. అభివృద్ధి జపంతో వాటిపై దాడి చేయాలి.

భారతీయుల అనుభవం

సిద్ధాంతాలు విధానాలతో నిమిత్తం లేని అభివృద్ధి ఒక బూటకపు తతంగమే. అభివృద్ధి అంటే ఎవరి అభివృద్ధి? కొద్దిమంది కోటీశ్వరులదా? లేక కోట్లమంది సామాన్యులదా? ఈ మూడేండ్లలో సంపదల తరలింపు భారీగా జరిగి పది శాతం చేతుల్లోనే 63శాతం ఆస్తులు చేరాయి. అట్టడుగు వర్గాల వారికి సామాజిక న్యాయమే గాక అల్ప సంఖ్యాకుల హక్కులు కూడా నిరాకరించ బడుతుంటాయి. అయినా స్వచ్ఛభారత్ మేకిన్ ఇండియా వంటి నినాదాలు మార్మోగుతుంటాయి. జాతి మతం వంటి వాటికి తమవైన నిర్వచనాలిచ్చి వాటిని ఏమాత్రం విమర్శించినా దేశద్రోహమన్నట్టు చిత్రించడం సినిమాలు మీడియాలు సోషల్‌మీడియాలపైన కూడా దాడి చేయడం ట్రోల్సును ఉసిగొల్పడం, మానవులకన్నా గోవుల రక్షణ జపం ఎక్కువై నరమేధాలు జరగడం ఇవన్నీ ఆందోళనకరమైన విషయాలే. రాజ్యాంగం మొదటి అధికరణంలోనే చెప్పుకున్న రాష్ట్రాల సమాఖ్య అంశాన్ని విస్మరించి కేంద్రం ఏకపక్షంగా నిర్ణయాలు చేయడం నోట్లరద్దు వంటివాటిపై రిజర్వుబ్యాంకును కూడా పాత్ర లేకుండా నిర్ణయం తీసుకోవడం చెప్పాలంటే చాలా ఉదాహరణలున్నాయి. సైన్యం ఎన్నికైన ప్రభుత్వానికి లోబడి రాజకీయ రహితంగా వుండాలనే ప్రాథమిక సూత్రం కూడా పాటించకుండా సైనిక దళాల ప్రధానాధికారి ఓవైపు ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ మరోవైపు అత్యంత అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినా సమాధానం లేదు. మత మార్కెట్ తత్వాల అడకత్తెరలో ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టడం చాలా పోరాటంతో గాని సాధ్యం కాదు. మోడీ ఏకవ్యక్తి పోకడలపై ప్రతిపక్షాలే గాక అరుణ్‌శౌరి, యశ్వంత్‌సిన్హా వంటివారు కూడా తిరుగుబాటు చేయాల్సి వచ్చింది. ట్రంప్‌కు ఎంతగా వంతపాడినా భారతీయుల హెచ్ 1బీ వీసాతో పాటు అన్నిటినీ గండంలో పడేశారు. మీరు మీ ప్రయోజనాలు చూసుకుంటే మేము మాత్రం చూసుకోవద్దా... అని దావోస్ శిఖరాగ్ర సభల సూటిగానే చెప్పారు. దేశదేశాల్లో వారి సైనిక ఉనికి రకరకాల రూపాల్లో



కొనసాగుతూనే ఉంది. స్వ దేశంలోనూ ముస్లింలను వేధించే అనేక చర్యలకు పాల్పడుతున్నారు. జాతి వివక్ష పెరుగుతున్నది. మీడియా కావలసినంత ప్రచారం ఇస్తున్నా దానిపై రోజూ విరుచుకుపడుతున్నారు. చైనాను బెదిరించడం, ఉత్తర కొరియాపై సైనిక కవ్వింపులూ, వెనిజులాలో కుట్రలూ క్యూబా వంటి దేశాలపట్ల గత విధానాలను తిరగదోడటం, జెరూసలెంను రాజధానిగా గుర్తించడం ద్వారా ఇజ్రాయిల్‌కు మరోవైపు నిరంకుశ సౌదీ అరేబియాకు పూర్తి వత్తాసునివ్వడం, అనేక అంతర్జాతీయ ఒప్పందాలను తోసిరాజనడం ఇవన్నీ అమెరికా పాలకుల ఆధిపత్య ధోరణులకు నిదర్శనాలు.


అమెరికాలో ఆందోళన

ఈ నేపథ్యంలోనే ఇటీవల వాషింగ్టన్ పోస్టు పత్రిక 'అంధకారంలో అంతరిస్తున్న ప్రజాస్వామ్యం' అని పతాకశీర్షికనిచ్చింది. ప్రజాస్వామిక ఉదారవాదులే గాక మితవాదులు కూడా అమెరికా గమనంపై ఆందోళనలో మునిగిపోతున్నారు. స్వతహాగా మితవాది అయిన డేవిడ్ ఫ్రమ్ ఇటీవలనే బ్రూకింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఒక సదస్సులో ప్రసంగిస్తూ అమెరికా రాజ్యాంగ వ్యవస్థలు ప్రజాస్వామ్యాన్ని రక్షించగలవా అని సందేహం వెలిబుచ్చారు. రాజ్యాంగ నిబద్ధత అన్నది లేని పాలకులు ఇష్టానుసారం వ్యవహరించడానికి ఆ నిబంధనలే దోహదం చేస్తున్నాయని ఆయన విశ్లేషించారు. భారత దేశంలోనూ రాష్ట్రాలకు సంబంధించిన అంశాలలో కేంద్రమే ఇంకా చెప్పాలంటే ప్రధాని నిర్ణయం తీసుకోవడం ఈ తరహాలోకే వస్తుంది. గత ఏడు దశాబ్దాలుగా అమలవుతున్న అనేక లౌకిక ప్రజాస్వామిక సంప్రదాయాలను తోసిపుచ్చి మతవాద మితవాద విధానాలను ప్రతిష్టించడం చూస్తున్నాం. సుప్రీం కోర్టు చెప్పినా రాష్ట్రాలలో పద్మావతి చిత్రం విడుదల అనుమతించకపోవడం, తెలంగాణలో పూర్తిగానూ ఏపీలో పాక్షికంగానూ టీవీ ఛానళ్లు పత్రికలపై ఆంక్షలు పెట్టి అడ్డుకోవడం కూడా చూశాం. వీటి ఫలితంగా గానీ లేక తమ ప్రయోజనాల కోసం గానీ ఆ మీడియా సంస్థలు కూడా పాలకపక్షాలకు అనుకూలమైన కథనాలే వండివార్చడం నిత్యకృత్యమై పోయింది. అప్రజాస్వామిక ఉత్తర్వులతో సభలూ సమావేశాలూ నిరసనల హక్కులను హరించడం కూడా ఈ కోవలోదే. చట్టసభలలో చర్చలు విలువే కోల్పోతున్న పరిస్థితి. ప్రజాధనంతో ఏవో కొన్ని సంక్షేమ పథకాలు ప్రకటించి అరకొరగా అమలు చేస్తూ అది కూడా స్వంత ఘనతగా చెప్పుకోవడం రివాజుగా మారింది.

అప్రమత్తత, ఆచరణశీలత

ఎన్నికల వ్యయం విపరీతంగా పెంచేసి ప్రత్యామ్నాయ శక్తులూ ప్రజాస్వామిక వాదులూ పోటీపడలేని స్థితి తీసుకురావడం ఈ దుష్పరిణామాలకు ఒక ప్రధాన కారణం. మితవాద భావజాలానికి పేరు మోసిన అమెరికా సుప్రీం కోర్టు 2010లో సిటిజన్స్ యునైటెడ్ పేరిట కార్పొరేట్లు ప్రయివేటు బృందాల ఎన్నికల విరాళాలపై అంటే రాజకీయ పెట్టుబడులపై పరిమితులు ఎత్తివేసింది. ఇండియాలోనూ మోడీ ప్రభుత్వం బడ్జెట్ ద్వారా కార్పొరేట్లు తమ వివరాలు తెలియకుండానే బాండ్ల కొనుగోలుద్వారా తమ చెప్పుచేతల్లో ఉండే పార్టీలకు ఎంతైనా ధనం సమకూర్చే వీలు కలిగించింది. దాదాపు ఎనభై శాతం నిధులు బీజేపీకే వెళ్లినట్టు కూడా ఇప్పటికే వెల్లడైంది. ద్రవ్యసంస్థలూ గనులూ వనరులూ ఎయిరిండియా విమానాల వరకూ అన్నీ ప్రయివేటు పరం కావడం అందువల్లనే. ఈ తరలింపును అడ్డుకోకుండా ప్రజలు మతచాందసంలో మునిగివుండాలి. చైతన్య వంతులు అడ్డుకోకుండా ఆంక్షలు అమలు చేయాలి. ఇదంతా ఒక విషవలయం. భారత సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తులు కూడా న్యాయం కోసం ప్రజల ముందుకు రావలసి వచ్చింది. ఇన్ని ప్రతికూలతల మధ్యనా ప్రజాస్వామిక శక్తులూ ప్రత్యామ్నాయ వాదులూ తమ పోరాటం సాగిస్తూనే ఉండటం ఊరట కలిగించే అంశం. ఆర్థిక పోరాటాలకు తోడు సామాజికాంశాలు కూడా తోడవుతుండటం, సాంస్కృతిక స్వేచ్ఛలను కాపాడుకోవాలనే స్పృహ పెరగడం ఆహ్వానించదగింది. ఈ తరహా భావ స్రవంతులనూ చర్చలనూ కార్యాచరణనూ బలోపేతం చేసుకోవడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలం. నిరంతర అప్రమత్తతే స్వాతంత్రానికి మూల్యం అన్నమాట ఎప్పటికీ చెరిగిపోని పరమ సత్యం.

శూర్పణఖ రోదన



ఎస్. పుణ్యవతి

శూర్పణఖనే. రోదిస్తున్నాను. ముక్కు, చెవులు పోయి, ముఖాకృతి పోగొట్టుకున్నందుకు కాదు. ఆడవాళ్ల లైంగిక జీవితం మీద దాడి జరుగుతున్నందుకు రోదిస్తున్నాను. ఆ యుగంలో-కృతయుగంలో సరే, కలియుగంలో, నేటి ఆధునిక యుగంలోనూ స్త్రీ లైంగిక జీవితమే టార్గెట్టా! ఫేసు బుక్కుల్లో, యూ ట్యూబుల్లో మీ వాగుళ్లు, వాచాలత్వాలు చూసి రోదిస్తున్నాను. మా కడుపులో పెరిగి, మా రక్తం పీల్చి, మా గర్భం చీల్చి, మా రొమ్ము పాలు తాగి మా మీదే దాడి చేస్తున్నారా!

మాకు తెలుసు, ఇది మీకు పుట్టిన బుద్ధి కాదని. వెనక ఆడిస్తున్న అజ్ఞాత శక్తి ఎవరో మాకు తెలుసు. మిమ్మల్ని అమానవీయం చేసిన ఆ విష సంస్కృతి ఏవిటో మాకు తెలుసు.

మానవ జాతి చరిత్రలో ఏనాడైతే జంట వివాహం రద్దయిందో ఆనాడే మాతృస్వామ్యం రద్దయ్యింది. ఆస్తి వారసత్వం కోసం దంపతీ వివాహం ఎప్పుడు మొదలయ్యిందో అప్పుడే పితృస్వామ్యం, దాంతోపాటే క్షీణ దశ ఆరంభమయ్యింది.

ఆటవిక సమూహంలో ఉన్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు పొందిన స్త్రీ జాతి మాది. ఆస్తి వారసత్వం కోసం.. మీ కులం, వంశం నిలపడం కోసం.. ఒక స్త్రీని ఇల్లాల్ని చేశారు. మీ శారీరక సుఖం కోసం మరో స్త్రీని, పర స్త్రీని వెలయాల్ని చేశారు. అయినా లొంగక వ్యక్తిత్వమున్న, వ్యక్తిగత లైంగిక జీవితాన్ని కాపాడుకోదల్చిన నాలాంటి స్త్రీని శూర్పణఖను చేశారు. ముక్కు, చెవులు కోశారు.

మీరు రాసిన చరిత్రలో రాణి పద్మినీ వందలాది అంతఃపుర స్త్రీలతో సహ నిప్పుల్లో దూకితేగాని మీరు చల్లబడలేదు కదరా! కత్తి బట్టి కదన రంగాన దూకగలిగే సత్తా ఒక్క మీకే ఉన్నట్టు చెప్పుకోడానికే కదా ఈ ప్రయత్నం! రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీ బాయి మీరు జీర్ణించుకోలేని చారిత్రక వాస్తవాలు కదా!



అసలు స్త్రీకి ఏం కావాలో తెలుసా మీకు? రాణి పద్మిని నడుం కనబడితేనే మీ వంశ ప్రతిష్టలు మంటగలిశాయని వీధుల్లో వీరంగం చేశారే! భన్వారీదేవి అలాంటి స్త్రీ కాదా! అందరు స్త్రీలు అలాంటి వారు కాదా! రాంగోపాల్‌వర్మ నీచ నేరపూరిత వాచాలత్వం మీద కన్నెర్రజెయ్యరేం! ఇప్పుడు ఓ దేవి, ఓ మణి, మరెందరో మహిళా కార్యకర్తలు, స్త్రీలను అణచిపెట్టే సంస్కృతిని ఎదిరించి నిలిచింది ఎవరి కోసం? జనం కోసం. జన సంస్కృతి కోసం! మానవతా వాదం వెల్లివిరియడం కోసం! మానవ జాతి శ్రేయస్సు కోసం కాదా!

అయ్యా చంద్రబాబూ! తెల్లారి లేస్తే అరెస్టులు, ప్రజానాయకుల మీద కేసులు, రౌడీ షీట్లు, హక్కుల కోసం పోరాడితే లాఠీ దెబ్బలూ జైళ్లు. ఇదేనా మీ పరిపాలన? మహిళల ఆందోళన కనిపించదా! పబ్లిగ్గా టీవీ చర్చల్లో ఆడకూతుళ్లని, వాళ్ల వ్యక్తిత్వాన్ని అవమానిస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదు? చట్టం తెలియదా! ఏమైపోయింది మీ పోలీస్ వ్యవస్థా? లేక ప్రజా నాయకులు విలన్లగాను, రాంగోపాల్ వర్మ హీరోగాను కనిపిస్తున్నారా!

లైంగికేచ్ఛ ప్రకృతి ధర్మం. జీవజాలం మనుగడ కొనసాగడం కోసం మనుషుల్లోనైనా, పశు పక్ష్యాదుల్లోనైనా లైంగికేచ్ఛ ప్రకృతి నియమం. ఎవరూ కాదనలేదు. అయితే మానవుల్లోనే కాదు, జంతుజాతుల్లో కూడా 'ఇచ్ఛ' లేకుండా ఒకదానికొకటి పొందు కోరలేదు. పొందలేవు. అటువంటిది ఇంత నాగరిక ప్రపంచంలో ఈ మాత్రం ఇంగితం తెలియదా! స్త్రీ మగాడి ఇష్టాలు తీర్చే యంత్రమా! పక్కలోకి రమ్మన్నప్పుడు రావడానికి ఒద్దన్నప్పుడు పోవడానికి తను మర మనిషా! లేక బానిసా?

మానవ జాతి చరిత్రను తిరగేయండి. జంట వివాహంలోనే స్త్రీ, పురుష సాంగత్య ప్రేమ జనించింది. 'ప్రేమ లేని ముద్దు ములక పంటి గిజరు' అన్నాడు వేమన. అది తెలియని మూర్ఖులే గోపాలవర్మ వారసులు, ఉచ్ఛనీచాలు మరచి, స్త్రీలపై, పిల్లలపై లైంగిక దాడికి తెగబడ్డానికి కారణం పోర్నోగ్రఫీ కాదా?

చలం చెప్పినట్టు స్త్రీ హృదయానికి జ్ఞానం కావాలి. మనసుకు స్పందన కావాలి. శరీరానికి అనుభూతి కావాలి. ఈ సమాజం బలవంతంగా రుద్దిన వేశ్యా వృత్తిలోని స్త్రీ కూడా మనసు కోరుతుంది. 'కాపు మనిషినై (ఇక్కడ కులం కాదు, రైతు స్త్రీ) పొలం పని చేసి పంట పండించే స్త్రీగా పుట్టకపోతినే' అని కన్యాశుల్కం నాటకంలో మధురవాణి చేత చెప్పిస్తాడు గురజాడ. స్త్రీ మనసు ఎందుకు అర్థం కాదో! భార్య ప్రేమ పొందడం తెలియాలి. పోర్నోగ్రఫీని కీర్తించే రాంగోపాల్ వర్మకే కాదు, ఫేసుబుక్కు వీరులకు కూడా!

ఏంటీ రాంగోపాల్ వర్మ..! ఏం సెలవిచ్చారు? మీరు అగౌరవ పర్చిన మహిళా కార్యకర్తలకు వారి కుటుంబాల నుండి ఏమైనా ఇబ్బందులు వచ్చాయేమోనని అపాలజీ చెప్తారా! శభాష్! ఒకవైపు న్యూడ్‌గా సినిమాలు తీస్తారా. మరో వైపు స్త్రీలు భర్త అధీనంలో, వారి కుటుంబాల అధీనంలో ఉండాలన్న మాట. స్త్రీల గౌరవానికి, కుటుంబ గౌరవానికి ఎంచక్కా ముడి పెట్టారండీ! స్త్రీ గౌరవం, అభిమానం ఆమె స్వవిషయాలు కావన్నమాట. స్త్రీ స్వేచ్ఛాజీవి కాదన్నమాట! ఎంత గొప్ప 'సాంప్రదాయ' వాదులండీ మీరు! ఒక్కటి తెలుసుకోండి. తమంత సంస్కార హీనులు కారు వారి కుటుంబ సభ్యులు.

నాయనలారా! అసలు రాజకీయం తెలుసుకోండి. బొమ్మల్లో ఎందుకు? పోర్నోగ్రఫీతో ఎవడైనా సంతోషంగా ఉన్నాడా? మనస్సున్న మనుషుల్లా మరో మనిషికి మనసిచ్చి పెళ్లి చేసుకోండి. కలసి జీవించండి. కలసి పోరాడండి. స్త్రీని అంగడి సరుకుగా మార్చిన విష సంస్కృతిలో భాగం కాకండి.

'మాయ మర్మము లేని నేస్తము/ మగువలకు, మగవారికియు నొక్కటే/ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును/ప్రేమ వచ్చిన ప్రేమ నిలుచును' అన్నాడు మహాకవి గురజాడ.

చివరగా ఒక్కమాట. మార్చి 8 వస్తున్నది. చరిత్ర గతినే మార్చివేసిన అక్టోబరు విప్లవానికి నాంది పలికింది మార్చి 8. స్త్రీ, పురుష కార్మికులు ఇరువురూ భుజం భుజం కలిపి పోరాడారు. దోపిడీ, దుర్మార్గాలపై ధ్వజమెత్తారు. అక్టోబరు విప్లవాన్ని దిగ్విజయం చేశారు. అదే కావాలి స్త్రీపురుషుల గమ్యం.

మెయిల్ @ నవతెలంగాణ

గిప్పుడు యాదికొచ్చిందా !

తన ప్రభుత్వం వచ్చిన నాలుగేండ్ల తరువాతనైనా సీఎం కేసీఆర్ సార్ రైతుల గురించి ఒక మంచి ముచ్చట చెప్పిండు. ఆదివారం రాజేంద్రనగర్‌లో జరిగిన రైతు అవగాహనా సదస్సుల మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర వచ్చిన నాడే నిజమైన పండుగ అన్నడు. నాకైతే మస్తు ఖుషీ అనిపించింది. నిజమే గానీ సారూ, ఈ విషయం తమకు ఇన్నాల్లకు యాదికొచ్చిందా ? గీ సారి ప్రత్యేక రైతు బడ్జెట్ ప్రవేశ పెడతరంట. గిందులో 12 లక్షల కోట్లు పెట్టుబడి సాయం కోసం కేటాయిస్తరంట. ఇక ముందు ఎవసంలో యంత్రాలు తెచ్చుడు జరగదంట. దానికి గావాల్సిన ట్రాక్టర్లు గిట్ల అన్నీ గవర్నమెంట్ కిరాయికిస్తదంట. గిదంతా రైతు సమన్వయ సమితుల ఆధ్వర్యంలోనే జరుగుతుందంట. మరి గివన్నీ సక్రమంగా జరగాలంటే పెద్దతలకాయలుండాలి గద. గందుకే అనేక సమ్మత్సరాలుగా డయిరీ యాపారంలో రాటుదేలి మస్తు కమాయించిన పెద్దకాపు గుత్తా సుఖేందర్‌రెడ్డి సారును రైతు సమన్వయ సమితి అధ్యక్షునిగా చేసిండు. ఆయనకు సాయంగా ఇంకో పెద్ద కాపు శ్రీనివాస్ రెడ్డిని పెట్టిండు.

కథ రంజుగా నడవాలంట. ఇ విషయం సీఎం సారే స్వయంగా చెప్పిండు. ఇక రైతుల భవిష్యత్ ఎట్లుంటదో..మనకు కండ్లముందు మెదుల్తాంది. గదే కాదు సీఎం సారు మల్లొక గొప్ప మాట జెప్పిండు. రైతులకు ఎకరాకి నాలుగు వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది గదా ! సీఎం సారు కూడా రైతే గదా..పాపం ప్రభుత్వ సాయాన్ని వదులుకుంటుండు ! ఎంతైనా గాయన దిల్ మస్తు పెద్దదిలే. సరే గాని సార్ మరి రైతు సమన్వయ సమితుల్లో పదవులు దొర్కించుకున్న మిగిలిన బడాసార్లు గూడ మీ లెక్కనే ప్రభుత్వ సాయం వదులుకుంటరా..లేక దీస్కుంటరా ?

మల్లొక ముచ్చట సార్. ఏండ్ల సంది రైతులు గిట్టుబాటు ధర లేక, కల్తీ విత్తనాలు, ఎరువులతో ఆగమాగమై ఆత్మహత్యలు చేస్కుంటున్నరు చెప్పిండ్రు గదా ! గిది నూరు శాతం సత్యమైన మాట కూడ. గానీ మరి గీ నాలుగేండ్ల సంది దాటినా పనికి కోషిష్ ఎందుకు చెయ్యలేరు సార్ ? మీటింగ్‌ల మీ పక్కన కూసున్న మన హోంమంత్రి గారేమో గామొన్న రైతులు డబ్బుల కోసమే ఆత్మహత్యలు చేస్కుంటున్నరని చెప్పిండు. మరి ముఖ్యమంత్రి గారి ముచ్చట కరెక్టా...హోంమంత్రి గారిదా ?

తెలంగాణ రైతు గురించి సీఎం గారు ఇంకో ముచ్చట జెప్పిండు. తెలంగాణ రైతు పండించిన పంటల ఇలువ ఒక లక్షా 25 వేల కోట్ల రూపాయలంట. కరెక్టా సరూ.మరి గా పంటలకు మద్దతు ధర లేదా ! ఇక ఖమ్మం ఎవుసాయ మార్కెట్ ఇసయం ఏంది అంటే..ఒక సారి భారీగా మిర్చి పంట రావటం వల్లన గట్ల కొట్లాటలైతయ్యంట. మరి అధికారులు, మీ నాయకులు ఏం చేస్తున్నరు సార్ !

ఇంక కొన్ని ముచ్చట్లు కూడ సీఎం సార్ చెప్పిండు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఏర్పాటుజేస్తరంట. ఏం పంటలు పండించాల్నో రైతు సమితి నాయకులు, ప్రభుత్వం చెప్తరంట. ఒక్క నిమిషమైన సోంచాయించకుండ ముఖ్యమంత్రి గారు 'వందల కోట్లు కర్చయినా మండల కమిటీ సభ్యులందర్నీ ఇజ్రాయిల్, ఇంక రెండు మూడు దేశాలకు చూడనికి తోల్కపోతము' చెప్పిండ్రు. గాని రైతులకు రావాల్సిన టార్పాలిన్లు మాత్రం ఆలోచించుకొని అవసరమైతే 75 శాతం సబ్సిడీ కిస్తరంట.

గిదంత ఇన్నంక, జూసినంక నాకర్తమైందేంటంటే రైతులకు పండుగొస్తదో లేదో గని అధికార పార్టీ లీడర్లకు, కార్యకర్తలకు మాత్రం మస్తు జాక్‌పాట్ అయితే గారంటీ...ఔమల్ల...!

- పద్మశ్రీ, హైదరాబాద్ .

ప్రజావాణి

ఇసుక లారీల ప్రమాదాలకు అంతం లేదా?

"జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇసుక లారీల ప్రమాదాలు నిత్యం పెరిగిపోతుండడంతో వాహనదారులు ప్రధాన రహదారి మీదకు రావాలంటేనే జంకుతున్నారు. జయశంకర్‌జిల్లాలోని కాళేశ్వరం క్వారీ నుండి ఇసుక లారీల ద్వారా హైదరాబాద్‌కి తరలివెళ్తుంది. నిత్యం సుమారు అయిదువేల లారీలు ఇసుకను రవాణా చేస్తున్నాయి. ఇసుక లారీల డ్రైవర్లు మితిమీరిన వేగంతో నడపడం వల్ల రోడ్డుమీద వెళ్ళేవారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వారం రోజుల క్రితం మోరంచపల్లి గ్రామంలో బైక్‌పై వెళ్తున్న ప్రయివేటు అధ్యాపకుడి దంపతుల మీదికి లారీ దూసుకు వెళ్లడంతో అధ్యాపకుడు ప్రాణాలు కోల్పోగా, భార్య 'కోమా'లోకి వెళ్లింది. లారీలను నిలుపుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, కాలేజీ విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు పది గంటల పాటు ధర్నా చేయడంతో సుమారు 20 కి.మీ. వరకు వాహనాలు నిలిచిపోయాయి. అధికారుల జోక్యం చేసుకుని మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామనడంతో ధర్నా విరమింపచేశారు. తాజాగా గణపురం మండలం కుందయ్యపల్లి గ్రామం వద్ద రోడ్డుపై వెళ్తున్న బిల్ల మల్లారెడ్డి అనే పేద రైతుపై ఇసుకలారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మరణించారు. మరో వ్యక్తికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారం రోజులలోపే రెండు ప్రమాదాలు జరిగి ఇరువురు మరణించడం వలన ఇసుక లారీలను మొత్తానికే నిలుపుదల చేయాలని మళ్లీ ధర్నాకు ఉపక్రమించి ప్రజలు సుమారు 31 లారీల అద్దాలను ధ్వంసం చేశారు. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని, మృతుని కుమారుడికి ఉద్యోగం కల్పిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఇసుక లారీలకు తోడు అధిక లోడ్‌గల బూడిదలారీలు, బొగ్గు లారీలు కూడా రహదారిమీదనే ప్రయాణిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు కార్లు, ఇతర వాహనాలలో ప్రయాణించేవారు బెంబేలెత్తుతున్నారు. కాళేశ్వరం నుంచి హైదరాబాద్ వరకు ప్రధాన రహదారిపై గల పల్లెలు, పట్టణాలు ఇసుక లారీల దూకుడుకు భయకంపితులై బయటకు రావాలంటేనే జంకుతున్నారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పాఠశాలకు వెళ్తున్నారు. రవాణాశాఖ అధికారుల తనిఖీలు లేకపోవడం, పోలీసుల నిర్లక్ష్యం, రోడ్డుపై స్పీడు బ్రేకర్లు లేకపోవడం, లారీ క్లీనర్స్ కూడా వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. ఇసుక లారీలను రాత్రివేళలో మాత్రమే రోడ్లపైకి అనుమతించాలి. బ్రీత్ ఎనలైజర్‌తో డ్రైవర్లను పరీక్షించాలి. లారీ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు తెలియజేయాలి. ప్రధాన రోడ్లపై ఒక వరుస క్రమంపైననే లారీలు వెళ్ళేలా ఏర్పాట్లు చేయాలి. ప్రభుత్వం కూడా ఇసుక లారీల ద్వారా ఆదాయం వస్తుందని చూస్తుంది తప్ప అమాయక ప్రజల ప్రాణాలను పట్టించుకోవడం లేదు. కోట్లాది రూపాయలతో వేసిన రోడ్డు ధ్వంసమవుతోంది. ఇసుక లారీల రక్తసిక్తానికి ముగింపు లేదా? ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించాలి.

- కామిడి సతీష్‌రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా,



వైభవోపేతమైన పట్టు చీరలు...

పండుగపూట అమ్మకట్టుకున్న పట్టుచీర... నానమ్మ పెద్దంచు పట్టుచీర... అత్తమ్మ కుట్టించిన పట్టులంగా... ఇవన్ని మధురమైన జ్ఞాపకాలే కదా! ఇక చిన్నతనంలో అత్తమ్మ కుట్టించిన పట్టులంగాను అద్దంలో చూసుకొని మురిసిపోయిన క్షణాలు... పెదాలపై చిగురించిన సన్నటి చిరు నవ్వు... లోలోపల ఆనందించిన మధురానుభుతులే కదా! ఆనాటి నుంచి ఈనాటి వరకు పట్టుచీరలకు ఉన్న వైభవం, హుందాతనం, అందం, కళ ఇప్పటికి చెక్కుచెదరలేదు. పార్టీ, అకేషన్, పండుగలు, శుభకార్యాలు ఏమైనా కానీ పట్టుచీర కట్టుకుంటే చాలు కుందనపు బొమ్మలా కనిపిస్తారు. అలాంటి అపూర్వమైన పట్టు చీరలు మీ కోసం... ఓ సారి ప్రయత్నించి చూడండి!



ఎక్కువ సమయం ఉంచితే!

వేసవి కాలం నీటిని అధికంగా తాగాలి. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. ఏసీలో ఉన్న సరే సమయానికి నీళ్ల తాగడం చాలా కీలకం. దాంతో పాటు ప్రతిరోజు తీసుకునే ఆహారంలో వెల్లుల్లి, మిరియాల పొడి, పసుపు, జీలకర్ర పొడి, ధనియాల పొడి కచ్చితంగా ఉండేలా చూసుకోవాలి. తాజాగా తయారు చేసే ఆహారాన్ని తీసుకోవాలి.

ఫ్రిజ్ నుండి తీసుకున్న వెంటనే ఆహారాన్ని తినడం మంచిది కాదు. ఫ్రిజ్‌లో పెట్టే ఆహారం చల్లగా ఉండటం వల్ల వాటిపై బ్యాక్టీరియా సులభంగా చేరుతుంది. ఫ్రిజ్‌లోని ఆహారాన్ని వెంటనే తీసుకోవడం వల్ల బ్యాక్టీరియా శరీరంలోకి చేరి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ. బాదం, జీడిపప్పు, సోయా ఉత్పత్తులను ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలి. శరీర ఉష్ణోగ్రత తగ్గితే వైరస్‌లు ఎక్కువగా సోకే అవకాశం ఉంటుంది. కాబట్టి విలైనంత వరకు శరీరాన్ని వెచ్చగా ఉంచుకోండి. ఫ్రిజ్‌లో పండ్లు, కూరగాయలు ఎక్కువ సమయం ఉండే క్రిములు ఎక్కువగా చేరే అవకాశం ఉంది. కాబట్టి ఫ్రిజ్ లో నుంచి తీసిన 30 నిమిషాల తర్వాత పండ్లను శుభ్రంగా కడుక్కోని తినడం లేదా వండుకోవడం మంచిది. ❄



బాదం ఫేస్ ప్యాక్...

- రెండు చెంచాల ఆల్మండ్ ఆయిల్‌లో రెండు చెంచాల గులాబీ నీటిని సమపాళ్ళల్లో తీసుకోవాలి. ఈ రెండు పదార్థాలను ఒక గిన్నెలో బాగా కలపాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని చర్మానికి పట్టించాలి. ఈ మాస్క్ పూర్తిగ ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో మైల్డ్ సోప్ ఉపయోగించి శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా, అందంగా తయారవుతుంది.
- సహజ సిద్ధమైన ఈ ఫేస్ ప్యాక్‌లో యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీనివల్ల చర్మంలో ముడతలు, వయసు పెరుగుతున్న లక్షణాలు తగ్గుతాయి.
- గులాబీ నీటిలో, ఆల్మండ్ ఆయిల్ లో స్కిన్ హైడ్రేటింగ్ ఏజెంట్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మ రంధ్రాల్లో మాయిశ్చరైజర్‌ని రీస్టోర్ చేస్తాయి. దీనివల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది.
- ఆల్మండ్ ఫేస్ ప్యాక్ లో విటమిన్ 'ఇ' ఉంటుంది. ఇది ముఖంపై ఉండే నల్లటి మచ్చలను తగ్గిస్తుంది. అలాగే కండ్ల కింద, నోటి చుట్టూ ఏర్పడే వలయాలను తగ్గించడమే కాకుండా చర్మ కణాలకు పోషణ అందిస్తుంది.
- ఆల్మండ్ ఆయిల్, రోజ్ వాటర్ మిశ్రమం యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలను కలిగి ఉంటాయి. కాబట్టి ఈ ఫేస్ ప్యాక్‌ను ఉపయోగించడం ద్వారా చర్మ రంధ్రాల్లో ఉండే బ్యాక్టీరియా, దుమ్ము, దురద, చిన్న చిన్న గాయాల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ❄

ఆస్తమా ఉంటే!

ఆస్తమా ఉన్నవారు కొన్ని ఆహారపదార్థాలకు దూరంగా ఉండటం మంచిదని చెబుతున్నారు నిపుణులు. ఆరోగ్యానికి సహకరించని ఆహారపదార్థాలను తీసుకోవడం వల్ల శ్వాస సంబంధిత సమస్యలు మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఆస్తమా పేషంట్స్ కొన్ని పదార్థాలకు దూరంగా ఉండాలి. అవేంటో చూద్దాం...

- ఆస్తమా పేషంట్స్ మాంసం, గుడ్లు, పాల ఉత్పత్తులు, చేపలు, పోర్క్, బీఫ్ వంటి ఆహారపదార్థాలను తీసుకోకూడదు. ఇవి శ్వాసలో మరింత సమస్య తీసుకొస్తాయి.
- కొన్ని రకాల పచ్చళ్లలో సల్ఫైట్ ఎక్కువగా ఉంటుంది. ఇది బ్రీతింగ్‌కి మరింత సమస్యగా మారుతుంది. కాబట్టి ఆస్తమాతో బాధపడేవాళ్లు పచ్చళ్లు తీనకూడదు.
- సోడియంకు దూరంగా ఉండటం చాలా అవసరం. అలాగే మోనోసోడియం గ్లూటమైట్ అనేది శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని కలిగిస్తాయి. కాబట్టి ఆస్తమాతో బాధపడేవాళ్లు సోడియంకు దూరంగా ఉండటం మంచిది.



- సాఫ్ట్ డ్రింక్స్‌లో ఉండే కొన్ని రకాల పదార్థాలు బ్రీతింగ్ ప్రాబ్లమ్స్ మరింత ఎక్కువ చేస్తాయి. కాబట్టి ఆస్తమా పేషంట్స్ ఎట్టి పరిస్థితుల్లో సాఫ్ట్‌డ్రింక్స్‌ను తీసుకోకూడదు. దాంతో పాటు ఫ్రెంచ్ ఫ్రైస్, ప్యాక్ చేసిన ఆలూ చిప్స్‌లో సల్ఫైట్స్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండటం మంచిది. ❄

పర్‌ఫెక్ట్ లైటింగ్ కోసం...

డ్రెస్సింగ్ రూమ్‌లో ముఖ్యంగా ఉండాల్సింది కరెక్ట్ లైటింగ్ డిజైన్. డ్రెస్సింగ్ రూమ్‌లో లైటింగ్ బ్రైట్‌గా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే అలంకరించుకొన్నప్పుడు అందంగా అలంకరించుకొన్నారా లేదా అన్న విషయం తెలుస్తుంది. వైట్ సీలింగ్ లైట్స్, మిర్రర్ లైట్స్, చిన్న లెడ్ లైట్స్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఫర్నీచర్: మోడ్రన్ డిజైన్ రూమ్ అందంగా కనిపించాలంటే ఆకర్షించే ఫర్నీచర్ కూడా ఉండాలి. దాంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుంది. ఎలా అంటే ముఖ్యంగా డ్రెస్సింగ్ రూమ్‌లో పొడవాటి అద్దాలు వివిధ డిజైన్లు, ఆకారాల్లో ఉంటే సరిపోతుంది.



వార్డ్ రోబ్: డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండాల్సిన మరొక ముఖ్యమైనటువంటి అలంకరణ వస్తువు వార్డ్ రోబ్. అలంకరించుకొనే వస్తువులు, దుస్తులు దాచుకోవడానికి వార్డ్ రోబ్ అవసరం. దీనివల్ల వార్డ్ రోబ్‌లో వస్తువులను చక్కగా సర్దుకోవచ్చు.

ఫ్లోరింగ్ అండ్ డ్రెస్సింగ్ కలర్: డ్రెస్సింగ్ రూమ్ మరింత అందంగా కనిపించాలంటే ఫ్లోరింగ్ అదిరిపోవాల్సిందే. సిరామిక్స్ టైల్స్, లామినేటెడ్ ఫ్లోరింగ్ కాంక్రీట్ ఫ్లోరింగ్‌తో మరింత ఆకర్షణగా కనిపిస్తుంది. అంతే కాదు ఇవి అమర్చుకోవడం వల్ల శుభ్రం చేయడానికి సులభతరం అవుతుంది.

వాల్ కలర్స్: డ్రెస్సింగ్ రూమ్‌కి వాల్ కలర్స్ సహజ రంగులు బాగా నప్పుతాయి. నేచ్యురల్ కలర్ వాల్ పేపర్స్ ను అతికించుకుంటే చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది.

అలాగే హెయిర్ పిన్నులు, కాటన్ బాల్స్, మానిక్యూర్ సామాగ్రి తదితర వస్తువులను చక్కటి గాజు పాత్రల్లో వేసి ఉంచితే చూసేందుకు ఆకర్షణీయంగా ఉంటాయి. గాజు పాత్రల్లో ఉంచటం వల్ల అవి స్పష్టంగా కనిపిస్తాయి. వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు. వాటిని డ్రెస్సింగ్ రూమ్ పక్కగానో లేదా కప్‌బోర్డ్‌లోనూ సర్దుకోవచ్చు. షాంపూలు, సబ్బులు లాంటివి కూడా బాత్ రూమ్‌లో పెట్టుకుంటే మంచిది. ఇకపోతే పరిమళాలను వెదజల్లే కొవ్వొత్తులు, ఎయిర్ స్ప్రేలు మీ మీ అభిరుచులకు తగినట్లుగా ఎంచుకుని గదిలో ఉంచుకుంటే మంచిది. ❄

ఆకాశమే హద్దుగా...

డేమ్ ఎలిజబెత్ రోజ్మండ్ టేలర్. ముద్దుగా సినీ ప్రేక్షకులంతా పిలుచుకునే పేరు 'ఎలిజబెత్ టేలర్'. ఆంగ్లో-అమెరికన్. తన నటనా కౌశలంతో హాలీవుడ్‌ను ఏలిన మహానటి. బాలనటిగా మొదలైన ఆమె ప్రస్థానం అంచెలంచెలుగా ఎదుగుతూ హాలీవుడ్‌ను ఏలింది. ఆమెరికన్ ఫిలిం ఇనిస్టిట్యూట్ చారిత్రాత్మక మహిళల జాబితాలో ఆమె ఏడో స్థానాన్ని సంపాదించుకున్నది.



ఉత్తర – పశ్చిమ లండన్‌లోని హాంప్‌స్టెడ్‌లో 1932 ఫిబ్రవరి 27న జన్మించిన టేలర్ రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అక్కడి పరిస్థితులు నిలువనీయకపోవడంతో అక్కడి నుంచి కుటుంబసభ్యులతో అమెరికాకు వలసవచ్చి స్థిరపడ్డారు. పుట్టిన ప్రాంతం లండన్ కావడంతో ఆమెకు బ్రిటిష్ పౌరసత్వంతో పాటూ అమెరికా పౌరసత్వం కూడా లభించింది. ఎలిజబెత్ టేలర్ తల్లి సారా వియోల కూడా రంగస్థల నటి కావడంతో పుట్టుకతోనే నట వారసత్వాన్ని పునికిపుచ్చుకుంది. మూడేళ్ళ వయసులోనే బాలే నృత్యంలో మెలకువలు నేర్చుకొని చిరు ప్రదర్శనలతో రాణించింది. ఆమెకు స్వతహసిద్ధంగా లభించిన అసాధారణ సౌందర్యం తోడు కావడంతో నటనలో అవకాశాలు కూడా వెంటనే వచ్చాయి. టేలర్ ఆమె తొమ్మిదేళ్ళ వయసులో తన మొదటి చలన చిత్రం 'దేరిజ్ వన్ బోర్న్ ఎవ్రి మినుట్' (1942)లో చిన్న పాత్ర పోషించి అందరి మన్ననలు పొందింది. ఇది యూనివర్సల్ చిత్రం

12 ఏండ్ల వయసులో టేలర్ నటించిన 'నేషనల్ వెల్వెట్' (1944) చిత్రం ఘన విజయం సాధించడమే కాకుండా నాలుగు మిల్లియన్ల వసూలుతో బాక్స్ ఆఫీసు రికార్డులనే బద్దలు చేసింది. ఈ సినిమా ఆమె జీవితాన్నే మార్చివేసింది. 1949లో ఆమె నటించిన చిత్రం 'కాన్సిరేటర్' బాక్స్ ఆఫీసు వద్ద ఘోర పరాభవం చవిచూసినప్పటికీ ఆ చిత్రంలో ఆమె నట విశ్వరూపాన్ని ప్రదర్శించి విమర్శకుల మన్ననలను పొందింది. ఆ చిత్రం నటించే నాటికి ఆమె వయసు కేవలం 16 సంవత్సరాలు మాత్రమే అయితేనేమీ ప్రశంసలకు నోచుకుంది. తదుపరి వచ్చిన ది బిగ్ హాంగ్ఓవర్ (1950), ఫాదర్ ఆఫ్ ది బ్రైడ్ (1950), గైంట్ (1956), 'ఎ ప్లెస్ ఇన్ ది సన్' (1951) వంటి చిత్రాలు వసూళ్ల సునామీని సృషించాయి. ఈ చిత్రాలు ఆమెను ఒక నటీమణిగా గుర్తింపును తీసుకొచ్చాయి. 1960లో వచ్చిన బట్టర్ ఫీల్డ్ అనే చిత్రానికి గాను మొదటి అకాడమీ పురస్కారాన్ని సంపాదించుకుంది. ఆ చిత్రాల్లో ఆమె నటనను న్యూయార్క్ టైమ్స్ వంటి పత్రికలు ఆకాశానికెత్తాయి. తదుపరి చిత్రమైన క్లియోపాత్ర (1963)లో కూడా ఆమె తన నట విశ్వ రూపాన్ని ప్రదర్శించింది.

అయితే నటిగా ఆమె ఎంత పేరు ప్రఖ్యాతలు సంపాదించిందో అలాగే వైవాహిక జీవితంలో అనేక ఎత్తుపల్లాలను, ఎదురుదెబ్బలను చవిచూడాల్సి వచ్చింది. ఎనిమిది పెళ్ళిళ్లు చేసుకున్న నటిగా కూడా వివాదాస్పదాలను మూటకట్టుకుంది. 1980 వరకు హాలీవుడ్‌ను మహారాణిగా ఏలిన ఎలిజబెత్ టేలర్ చరిష్మా క్రమంగా తగ్గుతూ వచ్చింది. 2006 వరకు అడప దడప చిత్రాల్లో నటించినప్పటికీ పెద్దగా రాణించలేదనే చెప్పాలి.

Women of the day

2004 నవంబర్‌లో టేలర్‌కు గుండె సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఇతర కార్యక్రమాలకు కూడా సరిగ్గా హాజరుకావడం మానేశారు. టేలర్ అనారోగ్యంతో బాధపడుతుంది అనే పుకార్లు వచ్చిన ప్రతిసారి ఏదో చిరుపాత్రలో కనిపించేది. 2006 మధ్య కాలంలో టేలర్ అల్జీమర్స్‌వ్యాధితో బాధపడుతున్నారని, మత్యువుకు చేరువలో ఉన్నాననే వార్త రావడంతో దాన్ని ఖండించటానికి 'లారీ కింగ్ లైవ్'లో నటించి ఆ ఆరోపణలను త్రోసిపుచ్చారు. అయితే ఎన్ని వివాదాలు మూటకట్టుకున్నప్పటికీ ఆమె సేవా కార్యక్రమాల్లో మాత్రం ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. రంగస్థల నటుల సంక్షేమం కోసం, ఎయిడ్స్ బాధితుల కోసం, వీధి బాలల కోసం అనేక కళా ప్రదర్శనలు ఇవ్వడమే కాకుండా తన సంపాదనలో మెజారిటీ వాటాను దాతృత్వ కార్యక్రమాలకు వెచ్చించింది. ❄

సీపీఐ(ఎం) కార్యకర్తలపై దాడి

- ముగ్గురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు



నవతెలంగాణ-నూతనకల్

సీపీఐ(ఎం) కార్యకర్తలపై సీపీఐ ఎంఎల్ కార్యకర్తలు దాడి చేయడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం శిల్పకుంట్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో సీపీఐ(ఎం) ఎదుగుదలను జీర్ణించుకోలేక కొందరు వ్యక్తులు సీపీఐ(ఎం) కార్యకర్తలు గజ్జెల శ్రీనివాసరెడ్డి, సాయిరెడ్డి, సాయిరెడ్డి భార్యతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో శ్రీనివాసరెడ్డి, సాయిరెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులను హుటాహుటిన సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎదుగుదలను ఓర్వలేకనే దాడులు : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ములకలపల్లి రాములు

గ్రామంలో సీపీఐ(ఎం) ఎదుగుదలను ఎదుర్కోలేకనే సీపీఐ ఎంఎల్ గూండాలు దాడులకు పాల్పడుతున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ములక్కలపల్లి రాములు అన్నారు. బాధితులను ఆయన పరామర్శించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో జిల్లా కమిటీ సభ్యులు తోట గోపీ, కందాల శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె ఉధృతం

రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి

- శ్రీకాకుళంలో 30 మంది అరెస్టు
- విజయనగరంలో విద్యుత్ టవర్ ఎక్కి కార్మికుని నిరసన
- కొనసాగిన నిరవధిక నిరాహార దీక్షలు
- సమస్యలపై శాసనమండలిలో చర్చిస్తాం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డి



యంత్రాంగం : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఏడో రోజూ కొనసాగింది. కార్మికులు సోమవారం తమ ఆందోళనను ఉధృతం చేశారు. కొన్ని జిల్లాల్లో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు రెండో రోజూ కొనసాగాయి. విజయనగరంలో ఒక కార్మికుడు విద్యుత్ టవర్ ఎక్కి నిరసన తెలియజేశాడు. శ్రీకాకుళంలో 30 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చలో శ్రీకాకుళం కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టారు. కలెక్టరేట్ గేటు ఎదుట పోలీసులు వారిని అడ్డుకున్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు, పి.తేజేశ్వరరావు, ఎం.శ్యామ్‌సుందర్, సంపతిరావు సహా 30 మందిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో కార్మికులు భిక్షాటన నిర్వహించారు. 132 కెవి సబ్‌స్టేషన్ వద్ద సమ్మె శిబిరం ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఆకస్మికంగా ఓ కార్మికుడు అక్కడ ఉన్న విద్యుత్ టవర్‌పైకి ఎక్కి సుమారు గంటపాటు తన నిరసన తెలియజేశాడు. విజయనగరంలోని విద్యుత్ భవనం వద్ద కార్మికులు ధర్నా చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో కార్మికులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అంతకుముందు దీక్షలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డి మద్దతు ఇచ్చి మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను శాసనమండలిలో చర్చిస్తానన్నారు. మాజీ మంత్రి జెడి శీలం, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి మద్దతు తెలిపారు. కర్నూలులో విద్యుత్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. 11 మంది కార్మికులు నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 1,250 మంది కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెను కొనసాగించారు. కాకినాడలో విద్యుత్ శాఖ డిఇ కార్యాలయాన్ని ముట్టడించారు. రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద భిక్షాటన చేశారు. మోతుగూడెం ఎపి జెన్‌కో ముఖ్య ఇంజినీర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. సిపిఎం, సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి మద్దతు తెలిపాయి. చిత్తూరు జిల్లా తిరుపతిలోని ఎస్ఇ కార్యాలయాన్ని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ముట్టడించారు. కడపలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు సిఐటియు, రైతు సంఘం, కెవిపిఎస్, అఖిల భారత ట్రేడ్ యూనియన్స్, ప్రజాసంఘాల నాయకులు, లాయర్లు మద్దతు తెలిపారు. విశాఖ జిల్లా పెదబయలు, అరకులోయ మండలాల్లో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన,భిక్షాటన చేశారు. నర్సీపట్నంలో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య, సిఐటియు, సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం కొనసాగింది. గుంటూరు లో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సామూహిక రాయబారం నిర్వ హించారు. కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం నుంచి జిల్లా పరిషత్తులోని 'మీ కోసం' వరకూ ప్రదర్శన నిర్వహించారు. జెడ్‌పి ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

28న ఇపిడిసిఎల్ కార్యాలయాల ముట్టడి

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 28న విశాఖలోని తూర్పు, తిరుపతిలోని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల కార్యాలయాలను ముట్టడిస్తామని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శ్రీకాకుళంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖలోని కార్యాలయాన్ని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల విద్యుత్ కాంట్రాక్టు కార్మికులతోనూ, తిరుపతిలోని కార్యాలయాన్ని కోస్తా, రాయలసీమ జిల్లాల విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులతోనూ ముట్టడిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే జోక్యం చేసుకొని సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

- విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించండి

- నిరాహారదీక్ష చేపట్టిన కల్లు గీత కార్మికులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కల్లు గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. వచ్చే బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ 5వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. "గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి" అని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో గీత కార్మికులు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకపోతుల రమణ మాట్లాడుతూ గీత కార్మికులు ప్రభుత్వానికి చెల్లిస్తున్న రూ.15 కోట్లు రద్దు చేస్తామని, ఎవరూ పన్ను చెల్లించవద్దని ఎక్సైజ్ శాఖ మంత్రి ప్రకటించినా ఆబ్కారీ శాఖ అధికారులు బలవంతంగా పన్ను వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. 164 జీవో ప్రకారం వృత్తి పెన్షన్ తీసుకునే వారికి ప్రమాదవశాత్తు మరణించినా, గాయపడినా ఎక్స్‌గ్రేషియా వర్తించదని, ఎలాంటి షరతులు లేకుండా సభ్యులైన వారందరికీ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. గీత కార్మికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఉన్నప్పటికీ నిధులు కేటాయించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దీక్షలో హైదరాబాద్ కార్యదర్శి బత్తుల జనార్ధన్, సుర్వి నరేష్ గౌడ్, అఖిలభారత గౌడ హక్కుల పోరాట వేదిక అధ్యక్షులు కొప్పుల జగన్ గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం యాదయ్య, యం వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్స్

అర్హులైన వారందరికీ కొత్త సభ్యత్వం, గుర్తింపు కార్డులు, కొత్త సొసైటీలకు అనుమతులివ్వాలి. తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పాలి. నిరుపేదలకు మూడెకరాల భూమి ఇవ్వాలి. ఉచిత విద్య, వైద్య సౌకర్యాలు అందించాలి. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను బహుళ ప్రచారంలోకి తేవాలి. ఏజెన్సీలో రద్దయిన సొసైటీలను పునరుద్ధరించాలి. వ్యక్తిగత రుణాలు, పిల్లలకు విద్య, ప్రత్యేక హాస్టల్ నిర్మాణం, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

గీత సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయించాలి

- చెట్ల పన్ను రద్దు జీవో విడుదల చేయాలి :
- కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాటూరి బాలరాజుగౌడ్



నవతెలంగాణ - భువనగిరి రూరల్/విలేకర్లు

రాష్ట్ర బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.ఐదువేల కోట్లు కేటాయించాలని, చెట్ల పన్ను రద్దు జీఓ విడుదల చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షులు మాటూరి బాలరాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కేజీకేఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, దీక్షలు సోమవారం చేపట్టారు. యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట దీక్షలనుద్దేశించి బాలరాజు మాట్లాడుతూ.. మెడికల్ బోర్డు నిబంధనలను ఎత్తేయాలని, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. తాటి, ఈత వనాల పెంపు కోసం భూమిని కేటాయించి కల్లుకు మార్కెట్ కల్పించాలని కోరారు. నిరుపేద గీత కుటుంబాలకు మూడెకరాలివ్వాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కట్టివ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాలని, వ్యక్తిగత రుణాలు, పిల్లలకు విద్య, ప్రత్యేక హాస్టల్ నిర్మాణం చేపట్టి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గీత కార్మికులకు అన్నిరంగాల్లో గుర్తింపు, గౌరవం, తగిన వాటా కల్పించాలన్నారు. అర్హులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని, టీసీఎస్‌లకు అనుమతులివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాగీరు కిష్టయ్య,తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేజీకేఎస్ జిల్లా అధ్యక్షులు గునిగంటి మోహన్ మాట్లాడారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని ఏకశిల పార్కులో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలకు బార్ అసోసియేషన్ నాయకులు తీగల జీవన్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, కళ్లెపు వెంకటయ్య, తదితరులు మద్దతు తెలిపారు. జనగామ కలెక్టరేట్ ఎదుట దీక్ష చేశారు. దీక్షను టీమాస్ జిల్లా చైర్మెన్ ఆకుల వేణుగోపాల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేజీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బూడిద గోపి, టీమాస్ చైర్మన్ ఆకుల వేణుగోపాల్ రావు మాట్లాడారు.

ఖమ్మం కలెక్ట రేట్ ఎదుట గల ధర్నాచౌక్‌లో రిలే దీక్షలు చేపట్టారు. జిల్లా కార్యదర్శి మెరుగు సత్యనారాయణ మాట్లా డారు. జీవో 164ను రద్దు చేయాలని కోరారు. సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.

పెట్టుబడి పథకాన్ని వర్తింప చేయాలి

- అటవీ హక్కుల పత్రం పొందిన వారికి :
- తెలంగాణ గిరిజన సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



అటవీ హక్కుల పత్రం పొందిన గిరిజనులకు రైతు పెట్టుబడి పథకాన్ని వర్తింప చేయాలని తెలంగాణ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిరిజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి రవి నాయక్, ఎం ధర్మానాయక్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు సాగుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రైతు పెట్టుబడి పథకం కింద భూస్వాములు, వందల ఎకరాలు ఉన్న కార్పొరేట్ సంస్థలు లాభం పొందే అవకాశం ఉందని, కానీ అసలైన రైతులు, వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న కౌలుదారులు, కాందీశీకుల భూములు సేద్యం చేస్తున్న గిరిజనులకు నష్టం జరుగుతుందని చెప్పారు. అటవీ హక్కుల పత్రాలు పొందిన సుమారు 2లక్షల మంది గిరిజన రైతులకు కూడా రూ. 4వేలు పెట్టుబడి పథకాన్ని వర్తింపచేయాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భూక్యా వీరభద్రం, కె శంకర్‌నాయక్, అంగోట్ వెంకన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎం శోభన్ నాయక్, ఎస్ పాపానాయక్, చందునాయక్, మిత్యానాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలుర గురుకుల డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలి

- జై భీమ్ యూత్ ఇండియా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సాంఘిక సంక్షేమ బాలుర డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయా లని జై భీమ్ యూత్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు మీదింటి సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక పక్క ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు వేల కోట్ల రూపాయలున్నా, ఖర్చు చేయలేకపోవడం, మరోపక్క ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయకపోవడం అసమర్థత పాలనకు నిదర్శమని తెలిపారు. ఎస్సీలు అభివృద్ధి చెందాలంటే అది కేవలం విద్యతోనే సాధ్యం కనుక తక్షణమే బాలుర డిగ్రీ కాలేజీల ఏర్పాటుకు పూనుకోవాలని కోరారు. గిరిజన బాలికలు, బాలురకు డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నామని అన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఎస్సీ బాలు రు ఏమైపోవాలని ప్రశ్నించారు. ఎస్సీలు అభివృద్ధి చెందాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, తక్షణమే బాలుర డిగ్రీ కాలేజీల ఏర్పాటుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కేజీ టు పీజీ విద్యను ఈ సంవత్సరం నుంచే అమలుకు శ్రీకారం చుట్టాలని కోరారు. లేని పక్షంలో అంచెలంచెలుగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఎస్‌టీయూ నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్


రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ) 71వ కౌన్సిల్ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీని 62 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆ సంఘం నేతలు ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షులుగా బి భుజంగరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జి.సదానందంగౌడ్, ఆర్థిక కార్యదర్శిగా ఆర్ సుధాకర్ రెడ్డి ఎన్నికయ్యారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నేతలు తెలిపారు. ఈ సందర్భంగా వేసవిలో బదిలీలు నిర్వహించాలనీ, సీపీఎస్ ను రద్దు చేయాలనీ, టెన్త్ జవాబుపత్రాల మూల్యాంకణం రేట్లు పెంచా లని, పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో ల్యాండ్‌లైన్ ఫోన్లు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కాగా ఎస్‌టీయూ భవన్‌లో జరిగిన సంఘం రాష్ట్ర ఎన్నిక లు బూటకమని ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు సీహెచ్ రాజిరెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. సంఘ నిబంధనలకు విరుద్ధమని చెప్పారు.

కేసులతో నీరు రాకుండా అడ్డు : లక్ష్మారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అపాలమూరును వలసల జిల్లా మార్చిన ఘనత కాంగ్రెస్‌పార్టీదేనని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో నిధులు, నీళ్ళు, నియామకాలను ఆంధ్రాకు తరలిపోవడానికి సహకరిస్తే, ఇప్పుడు కోర్టు కేసులతో పాలమూరు ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తగిన సమయంలో కాంగ్రెస్‌పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. జిల్లాలో పెండింగులో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు త్రికరణ శుద్ధితో పర్యవేక్షిస్తున్నారన్నారు. పాలమూరు, నెట్టెంపాడు, భీమా, ఆర్డీఎస్, కోయిలసాగర్, కెఎల్ఐ ప్రాజెక్టుల ఖచ్చితంగా నిర్ణీత సమయంలో నీటిని అందిస్తామన్నారు.

ఏప్రిల్ 15 లోపు కర్నాటక ఎన్నికల తేదీ



న్యూఢిల్లీ : ఏప్రిల్ 15 లోపు కర్నాటక అసెంబ్లీ ఎన్నికల తేదీని ప్రకటిస్తామని భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ ఓపి రావత్ సోమవారం తెలిపారు. 'స్కూల్ బోర్డు పరీక్షలన్నీ మార్చి నెల చివరిలోగా ముగుస్తాయి. ఇతర పరీక్షలు ఏప్రిల్ 14లోగా ముగుస్తాయి. ఏప్రిల్ 15లోగా ఎన్నికల తేదీని ప్రకటిస్తాం' అని రావత్ తెలిపారు. ప్రస్తుత కర్నాటక అసెంబ్లీ పదవీకాలం మే 28తో ముగియనుంది. ఆలోగానే ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. అలాగే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఏప్రిల్ మొదటివారంలో కర్నాటకలో ముగ్గురు ఎన్నికల కమిషనర్లు కర్నాటకలో పర్యటిస్తామని రావత్ వెల్లడించారు.

పోలీసు సిబ్బంది పరస్పర అంగీకార బదిలీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- కృతజ్ఞతలు తెలిపిన పోలీసు సంఘం అధ్యక్షుడు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

గత ఏడాది కాలంగా బదిలీలకు అనుమతించాలని కోరుతున్న వందలాది మంది కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్ల కోరిక సోమవారం తీరింది.. పరస్పర అంగీకార బదిలీలు జరుపడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తూ సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. అంతేగాక ఈ మేరకు తగిన మార్గదర్శకాలను రూపొందించి అమలు చేయాలని డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డిని ఆదేశించింది. రాష్ట్ర విభజన జరిగాక పాలనాసౌలభ్యం కోసం కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు, ఎఎస్ఐలను నిర్దేశించిన చోట పని చేసేలా ఆర్డర్ టు సర్వీస్ ఉత్తర్వులను ప్రభుత్వం మూడేండ్ల క్రిందట జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో, తమ కుటుంబభ్యులకు దూరంగా, ఉన్నతాధికారులు నిర్దేశించిన జిల్లా, మండల పోలీసు స్టేషన్‌లలో క్రింది స్థాయి సిబ్బంది విధులను నిర్వహిస్తున్నారు. ఎన్ని రోజులు గడిచినా తమను కోరుకున్న చోటికి, కనీసం సొంత జిల్లాకు సైతం బదిలీ చేయక పోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఇతర శాఖల ఉద్యోగులు కూడా ఈ ఉత్తర్వుల ఆధారంగానే పని చేస్తున్నప్పటకీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారి విధులు ముగుస్తున్నాయి. కానీ, ఎలాంటి నిర్ణీత సమయం లేకుండా 20 గంటలకు పైగా పోలీసు సిబ్బంది పని చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు డీజీపీకి తమ బాధలను సిబ్బంది తెలియచేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడిన డీజీపీ మహేందర్‌రెడ్డి బదిలీలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా ఒప్పించారు. దీంతో, పరస్పరం అంగీకార బదిలీలతోపాటు పదవీ విరమణకు దగ్గరలో ఉన్న సిబ్బందిని వారు కోరుకున్న చోటికి బదిలీ చేసేలా ప్రభుత్వం డీజీపీకి అనుమతినిచ్చింది. ఈమేరకు ఉత్తర్వులు అందుకున్న డీజీపీ పరస్పర అంగీకార బదిలీలను జరుపడానికి అవసరమైన మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు. ఇది పూర్తి కాగానే వారంరోజుల లోపల అన్ని జిల్లాల్లో కానిస్టేబుళ్ల బదిలీ జాతర ప్రారంభం కానున్నదని అధికారవర్గాలు తెలిపాయి. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి నందుకు రాష్ట్ర సీఎం, డీజీపీలకు పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు వై.గోపిరెడ్డి కృతజ్ఞతలు తెలియచేశారు.



అమెరికాలో తుఫాను బీభత్సం

న్యూయార్క్: అమెరికాలోని పలు రాష్ట్రాల్లో తుఫాను అల్లకల్లోలం సృష్టిస్తోంది. ఈ తుఫాను ధాటికి ఇప్పటివరకు ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.ఉధృతంగా వీస్తున్న గాలులతో భారీగా ఆస్తినష్టం సంభవించిందని అధికారవర్గాలు తెలిపాయి.. మిచిగన్, కెంటకి, ఆర్కాన్‌సాస్‌తో పాటు పలు రాష్ట్రాల్లో భారీ వానలు, సుడిగాలులు విరుచుకుపడ్డాయి. మిచిగన్, కెంటకిలోని చాలా ప్రాంతాల్లో వరదలు ముంచెత్తాయి. ఇక్కడ ముగ్గురు వ్యక్తులు నీట మునిగి చనిపోయారు. కెంటకిలోని అడ్కైర్‌వీల్ సహా ఆర్కాన్‌సాస్‌లో గంటకు 193 కి.మీ వేగంతో వీచిన పెనుగాలుల కారణంగా పలు ఇండ్లు ధ్వంసమయ్యాయి. ప్రాణనష్టం జరగకుండా సహాయకబృందాలు రంగంలోకి దిగాయి.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో ముగ్గురు..
- ఉప్పల్‌లో మరో ముగ్గురు మృతి.. పలువురికి గాయాలు



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

రోడ్డెక్కితే క్షేమంగా ఇంటికి తిరిగి వస్తామో.. లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రమాదాలతో అమాయక జనం మాత్రం విగత జీవులుగా మారుతున్నారు. రోడ్డు ఎక్కితే మృత్యువు ఏ రూపంలో కబళిస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుస్టేషన్ పరిధిలోని కొత్తగూడెం చౌరస్తాలో సోమవారం ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ బతుకమ్మకుంటకు చెందిన ఒకే కుటుంబ సభ్యులు బాటాసింగారం, కొత్తగూడెంలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లారు. అనంతరం అర్ధరాత్రి కారులో తిరిగి వస్తుండగా కొత్తగూడెం చౌరస్తాలో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న లారీ (ఏపీ-27 టీ7589).. కారు (ఏపీ-09 ఏకే 0060)ను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న పి.పద్మ(48), పి.స్వప్న(35), నిత్యఅభిరామ్(8) అక్కడిక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోలీసులు వెంటనే ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పల్...

గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో.. ఒకే రాష్టానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన సంఘటన ఉప్పల్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన లక్ష్మణ్, (25), నీతిష్ (27), హెూరిల్ రోహిత్ (18) లు గత పది సంవత్సరాల క్రితం బతుకు దెరువు కోసం వచ్చి ఉప్పల్ ఐడియ కాలనీలోని లక్ష్మీనారయణ కాలనీలో నివాస ముంటు న్నారు. ఇండస్ట్రీయల్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తు న్నారు. సోమవారం ఉదయం అంబర్‌పేట నుంచి ద్విచక్ర వాహనంపై రామంతాపూర్‌కు వస్తుండగా ఇండస్ట్రీయల్‌లోని మోడ్రన్ బేకరీ వద్ద గుర్తు తెలియని వాహనం డీ కోనడంతో అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకోని మృతదేహాలను పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

భూ నిర్వాసితుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళన

- భూనిర్వాసితుల పోరాట కమిటీ
- మార్చి 10 వరకు పోరాటం: వెంకట్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని తెలంగాణ భూనిర్వాసితుల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. అలాగే రైతులు, వృత్తిదారులు, వ్యవసాయ కూలీలు, గిరిజనులకు ఉపాధి పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో భూనిర్వాసితుల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ బి.వెంకట్ విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూనిర్వాసితులకు అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. బలవంతపు భూసేకరణకు పూనుకోవడాన్ని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయంగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఈ చట్టం ఉండగానే మరోవైపు 2017 భూసేకరణ సవరణ చట్టం తేవడం మంచి పరిణామం కాదన్నారు. ఇది నిర్వాసితులకు అన్యాయం చేయడమేనని వ్యాఖ్యానించారు. అభివృద్ధికోసం భూసేకరణ చేయడానికి తాము వ్యతిరేకం కాదన్నారు. చట్టం ప్రకారం పరిహారం ఇవ్వకుండా బలవం తంగా భూసేకరణ చేయడానికి మాత్రమే తాము వ్యతిరేకమన్నారు. వచ్చే మార్చి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూనిర్వాసితుల కేంద్రాల్లో పర్యటనలు చేసి నిర్వాసితుల కమిటీలు వేస్తామని ప్రకటించారు. పోరా టాలు, ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. అధికారులు, ఎమ్మెల్యే లు, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. సర్కారు దిగిరాక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకర్ల సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.జంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రాష్ట్ర కార్యదర్శి ధర్మనాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధీరావత్ రవినాయక్ పాల్గొన్నారు.

రెవరెండ్ డా. బిల్లీ గ్రాహం మృతి

- క్రైస్తవ సంఘాల సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ ప్రఖ్యాతగాంచిన క్రైస్తవ మత గురువు రెవరెండ్ డా. బిల్లీ గ్రాహం మరణం పట్ల ది నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్స్ (ఎన్‌సిఐసి) అధక్షులు సిఎ డానియేల్ ఆడమ్స్ అధ్యక్షులు, అలైయన్స్ ఆఫ్ క్రిస్టియన్ లీడర్స్ (జిఏసిఎల్) అధ్యక్షులు ఎల్‌డి పాల్‌తోపాటు పలువురు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

కరువు కోరల్లో సూడాన్



జుబా : దక్షిణ సూడాన్‌ను కరువు దేశంగా ప్రకటించిన ఏడాది తర్వాత ఇక్కడ సగం మందికి పైగా ప్రజలు తీవ్ర ఆకలితో అలమటిస్తున్నారని ఓ నివేదిక వెల్లడి చేసింది. ఐక్యరాజ్యసమితి, దక్షిణ సూడాన్ ప్రభుత్వ తాజా నివేదిక ప్రకారం.... 60 లక్షల మందికి పైగా ప్రజలకు ఎటువంటి ఆహార సహాయం అందటం లేదు. ఆహార సహాయం అందని వారు ఒక ఏడాది క్రితం 40 శాతం మంది ఉన్నారు. 11 కౌంటీలలో సుమారు 1.5 లక్షల మంది ప్రజలు ఈ ఏడాది కరువు పరిస్థితుల్లోకి వెళ్లే అవకాశముందని ఐరాస అంచనా వేసింది. ఇది తూర్పు ఆఫ్రికా దేశంలో ఆహార అభద్రత స్థాయికి కొలమానం అని యూఎన్ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాంతో కలిసి రాస్ స్మిత్ 'ది అసోసియేటెడ్ ప్రెస్'తో పేర్కొన్నారు. ప్రతి ముగ్గురిలో ఒక్కరికి ఈ పరిస్థితి ఎదురవుతోందని ఆయన తెలిపారు. 2013 చివరిలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి దేశంలో ప్రధానమైన ఆహారోత్పత్తి శాతం క్షీణించడమే దీనికి కారణం

సిరియాలో రసాయనిక దాడులు !

- **గౌటాలో పౌరులను బంధీలుగా మల్చుకున్న వైపీజీ : రష్యా రక్షణ శాఖ**



మాస్కో : సిరియాలో రసాయనిక దాడులకు పాల్పడేం దుకు తిరుగుబాటుదారులు కుట్ర పన్నారని రష్యా రక్షణ శాఖ పేర్కొన్నది. గౌటా నగరంలోకి చొరబడి కొంతమంది పౌరులను వైపీజీ తిరుగుబాటు దారులు బంధీలుగా మల్చుకున్నారని తెలిపింది. గౌటాలో అశాంతి యుత వాతావరణం సృష్టించేం దుకు తిరుగుబాటుదారులు కుట్ర పన్నారని పేర్కొన్నది. ఈ ప్రాంతంలో 30 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించాలని ఐరాస భద్రతా మండలి గతవారం నిర్ణయించింది. ఐరాస నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తిరుగుబాటుదారులు దాడులకు పాల్పడే ప్రమాదముందని మేజర్ జనరల్ యూరీ యెవ్‌తుషెంకో హెచ్చరించారు. సిరియాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే రసాయనిక దాడులు జరిగాయని యూరీ తెలిపారు. డమాస్కస్‌లో కాల్పుల విరమణ పాటించాలని ఐరాస తీర్మానించినప్పటికీ తిరుగుబాటుదారులు విధ్వంసాలకు పాల్పడుతున్నారని అన్నారు.

అమెరికాలో దారుణం...

- **లైబ్రరీలో మహిళ దారుణ హత్య**

వాషింగ్టన్ : అమెరికాలో అమానవీయ ఘటన చోటుచేసుకున్నది. పుస్తక పఠనం కోసం లైబ్రరీకి వెళ్లిన ఓ మహిళను ఓ వ్యక్తి వేటకొడవలితో దాడి చేసి హతమార్చాడు. ఈ ఘటన రాజధాని వాషింగ్టన్‌కు సమీపంలో చోటుచేసుకుంది. పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లైబ్రరీ గదిలో చదువుకుంటున్న ఓ మహిళపై మాసాచుసెట్స్‌కు చెందిన 23 ఏండ్ల జెఫ్రీ యావో వేట కొడవలితో తల, రొమ్ము భాగంలో విచక్షణా రహితంగా దాడి చేశాడు. రక్తమోడుతున్న మహిళ లైబ్రరీ తలుపుల వైపుగా పరిగెత్తింది. అతడు అంతటితో ఆగకుండా ఆమె వైపుగా పరిగెత్తాడు. అడ్డువచ్చిన లైబ్రరీ సిబ్బందిపై కూడా దాడికి పాల్పడి పరారయ్యాడు. ఆ మహిళ ఎవరు.? అతడు ఎందుకు ఆమెపై దాడి చేశాడు.? అన్న వివరాలు ఇంకా తెలియ రాలేదు. జెఫ్రీ యావో నివసిస్తున్న ఇంటి చుట్టు పక్కల వారిని బోస్టన్ హెరాల్డ్ ఇంటర్వ్యూ చేయగా అతని గురించి కొన్ని షాకింగ్ విషయాలు తెలిశాయి. గత కొద్ది సంవత్సరాలుగా యావో ప్రవర్తన క్రూరంగా తయారైందని, మాలో ఎవరిని చంపుతాడో అని భయపడుతుండేవాళ్లమని చెప్పారు. అతని మిత్రులు యావో గత కొద్ది సంవత్సరాలుగా పూర్తిగా మారిపోయాడన్న విషయాన్ని ధృవీకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

అంతరిక్షం నుంచి అంతర్జాలం..

'స్పేస్‌ఎక్స్' ప్రయోగం విజయవంతం!



వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంత మైన రాకెట్ ఫాల్కన్ హెవీని విజయవంతంగా ప్రయోగించడమేకాక, తొలిసారిగా టెస్లా రోడ్‌స్టర్ కారును అంగారక గ్రహ కక్షలోకి విజయవంతంగా ప్రవేశపెట్టిన స్పేస్‌ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ మళ్లీ వార్తల్లో నిలిచారు. ఈసారి ఆయన అంతరిక్షం నుంచి అత్యంత వేగవంతమైన అంతర్జాలాన్ని అందించడం కోసం రెండు ఉపగ్రహాలను ప్రయోగించారు. కాలిఫోర్నియాలోని వాండెన్బర్గ్ వైమానిక స్థావరం నుంచి పునర్వినియోగ ద్వారా స్పెయిన్ పీఏజెడ్ ఉపగ్రహంతోపాటు స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఈ రెండు ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.

ప్రయోగించిన 11 నిమిషాల తర్వాత పీఏజెడ్ ఉపగ్రహాన్ని ఫాల్కన్-9 రాకెట్ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ ఉపగ్రహంలోని అధునాతన రాడార్ ప్రపంచం మొత్తాన్నీ 24 గంటల్లోనే చుట్టేస్తుంది. దీన్ని స్పెయిన్ రక్షణ అవసరాల కోసం వినియోగిస్తారు. ఈ ఉపగ్రహం భూమిని రోజుకు 15సార్లు చుట్టివస్తుంది. ఇక స్పేస్‌ఎక్స్‌కు చెందిన మైక్రోశాట్ 2 ఎ, 2బి ఉపగ్రహాలు వాణిజ్య, ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడతాయి. ఈ ప్రయోగం విజయవంతంతో స్పేస్ ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ కల నిజమైంది. 2024 కల్లా ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సదుపాయం కల్పించడమే లక్ష్యంగా స్పేస్‌ఎక్స్ ఈ రెండు ఉపగ్రహాల ప్రయోగం జరిపింది. ఈ ప్రాజెక్టుకు 'స్టార్‌లింక్స్' అనే పేరు పెట్టారు. 2015 జనవరిలో స్పేస్‌ఎక్స్ ఈ ప్రాజెక్టును ప్రకటించింది. ఇందుకోసం గూగుల్, ఫిడిలిటీ సంస్థలు ఒక బిలియన్ డాలర్లను స్పేస్‌ఎక్స్ కంపెనీలో పెట్టుబడిగా పెట్టాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా దాదాపు 12 వేల చిన్న చిన్న కమ్యూనికేషన్ ఉపగ్రహాలను అతితక్కువ ఎత్తులో ఉన్న భూకక్ష్యలోకి ప్రవేశపెడతారు.

అదృశ్యమైన నైజీరియా యువతుల కోసం గాలింపు

అబూజ : నైజీరియాలో అదృశ్యమైన యువతుల కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. గతవారం యోబ్ రాష్ట్రంలో దాబ్చీ ప్రాంతానికి చెందిన గవర్నమెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీకి చెందిన 110 మంది యువతులు అదృశ్యమయ్యారు. ఈ యువతులను బోకోహారమ్ మిలిటెంట్లు ఎత్తుకెళ్లినట్టు ప్రత్యక్ష సాక్ష్యులు చెబుతున్నారు.

ఈ విషయం తెలుసుకున్న యువతుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. 2014లో చిబాక్ ప్రాంతంలో ఓ పాఠశాలలోకి చొరబడ్డ బోకోహారమ్ మిలిటెంట్లు 276 మంది మైనర్ బాలికలను అపహరించి చిత్రహింసలు పెట్టారు. కొంతమందిపై లైంగికదాడికి పాల్పడి అతిదారుణంగా హతమార్చారు. ఈ ఘటన అనంతరం బోకోహారమ్ మిలిటెంట్ల పేరు చెబితేనే ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అప్పట్లో ఈ ఘటనపై ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. బోకోహారమ్ తీవ్రవాదులను మట్టుబెట్టాలని లక్షలాది మంది నెటిజన్లు పోస్టులు పెట్టారు.

బ్రిటన్‌లో పేలుడు

- **నలుగురు మృతి, నలుగురికి గాయాలు**

లండన్ : బ్రిటన్‌లోని లీసెస్టర్లో ప్రాంతంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...లీసెస్టర్లో ప్రాంతంలోని ఓ భవనంలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. ఈ పేలుడుకు ఉగ్రవాదంతో సంబంధాలున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనను తీవ్రమైన ఘటనగా ప్రకటించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. అత్యవసర సేవల విభాగం సెర్చ్, సహాయక చర్యలు చేపడుతున్నాయి. అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పివేశాయి. కాగా, ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు పోలీస్ అధికారులు తెలిపారు.

పీవైడీ పార్టీ మాజీ నేత సాలిహ్‌ని అప్పగించండి

- **జెక్ రిపబ్లిక్‌కు టర్కీ అభ్యర్థన**

అంకారా : సిరియా కుర్దిస్ డెమోక్రటిక్ యూనియన్ (పీవైడీ) పార్టీ మాజీ నేత సాలిహ్ సలీమ్‌ని తమకు అప్పగించాలని టర్కీ ప్రభుత్వం జెక్ రిపబ్లిక్‌ని అభ్యర్థించింది. ఈ మేరకు ఓ పిటిషన్ దాఖలు చేసింది. టర్కీలో దాడులకు పాల్పడేందుకు సాలిహ్ కుట్ర పన్నినట్టు తమ వద్ద విశ్వసనీయమైన సమాచారం ఉన్నదని, అతన్ని అప్పగించినట్టయితే విచారించి వివరాలు రాబడతామని తెలిపింది. కాగా, సిరియా నుంచి జెక్ రిపబ్లిక్‌కు వెళ్లిపోయి ప్రవాసముంటున్న సాలిహ్ సలీమ్‌ని అరెస్ట్ చేయాలని ఎర్డోగన్ సర్కార్ కోరింది. టర్కీ అభ్యర్థన మేరకు పోలీసులు శనివారం సాలిహ్‌ని అదుపులోకి తీసుకున్నారు. కుర్దు తిరుగుబాటుదారులకు సాలిహ్ నేతృత్వం వహించారు. సాలిహ్ కనుసన్నల్లోనే పలు విధ్వంసాలు చెలరేగాయని టర్కీ డిప్యూటీ ప్రధాని బీకిర్ బోజ్డాగ్ ఆరోపించారు.

న్యూగినియాలో భారీ భూకంపం

- **రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.5గా నమోదు**

మెండీ: న్యూగినియాలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.5గా నమోదైంది. సోమవారం తెల్లవారు జామున ఈ ప్రమాదం వాటిల్లింది. దాదాపు 35 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్టు యూఎస్ జియోలజికల్ సర్వే అధికారులు తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు.

దక్షిణ హైలాండ్‌కు రాజధాని ప్రాంతంగా ఉన్న మెండీకి సమీపంలో భూకంపం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో సుమారు 50 వేల మంది జనాభా నివసిస్తున్నారు. భూకంప తీవ్రతతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుండి వీధుల్లోకి పరుగులు తీశారు. సుమారు 40 సెకండ్లపాటు భూమి కంపించిందని స్థానికులు తెలిపారు.

చైనా విమానానికి తృటిలో తప్పిన ప్రమాదం

బీజింగ్: చైనాకు చెందిన బోయింగ్-777 విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. విమానం టేకాఫ్ అవుతున్న క్రమంలో ఈ ప్రమాదం సంభవించింది. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...సెల్‌ఫోన్ చార్జింగ్‌కు వాడే పవర్ బ్యాంకు పేలడంతో చైనా సదరన్ ఎయిర్‌లైన్స్ కు చెందిన విమానంలో మంటలు చెలరేగాయి. సిబ్బంది, ప్రయాణికులు సకాలంలో మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. చైనాలోని గాంగ్‌జూ విమానాశ్రయంలో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. బోయింగ్ 777-300ఈఆర్ రకానికి చెందిన సీజెడ్3539 విమానం గాంగ్జూ నుంచి షాంఘై వెళ్లేందుకు సిద్ధమైంది. ప్రయాణికులు విమానంలో ఎక్కుతుండగానే ఓవర్‌హెడ్ కంపార్ట్‌మెంటులో మంటలు గమనించారు. అందులోని ఓ బ్యాగులో నుంచి మంటలు చెలరేగాయి.

సిబ్బంది హుటాహుటిన స్పందించి మంటలు ఆర్పివేశారు. ప్రమాదం జరిగినప్పుడు పవర్ బ్యాంకు వినియోగంలో లేకపోయినా ఎందుకు పేలిందనే దానిపై అధికారులు విచారణ ప్రారంభించారు. ఆ బ్యాగు తీసుకువచ్చిన వ్యక్తిని విచారిస్తున్నారు. ఈ ఘటనతో ఆ విమానాన్ని నిలిపివేసి మరో విమానంలో ప్రయాణికులను పంపించారు. బోయింగ్ 777-300ఈఆర్ విమానంలో కొంత భాగం మాత్రం పాడైంది. మంటలు చెలరేగినప్పుడు ప్రయాణికుడు తీసిన ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

వెల్ఫేరు బోర్డు కోసం హమాలీల ధర్నా

- **కలెక్టరేట్ ఎదుట అడ్డుకున్న పోలీసులు**





నవతెలంగాణ-సూర్యాపేట

సంక్షేమ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టింది. భారీగా తరలివచ్చిన హమాలీలను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది.

హక్కుల సాధన కోసం 23 మండలాల నుంచి కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వ సంస్థలోని హమాలీలకు ఎగుమతి, దిగుమతి నూతన రేట్లను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కలెక్టర్ వచ్చే వరకు ధర్నా విరమించబోమని కార్మిక నాయకులు హెచ్చరించారు. మధ్యాహ్నం దాటినా అధికారులు ఎవరూ బయటకి రాకపోవడంతో కార్మికులు పెద్దఎత్తున గేటు వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. నాయకులు, కార్మికులు గేటు ఎక్కారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు జాయింట్ కలెక్టర్ సంజీవరెడ్డి బయటకు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

తొలుత ధర్నానుద్దేశించి ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ మాట్లాడారు. హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఎగుమతి, దిగుమతుల రేట్లు క్వింటాకు 50 రూపాయలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. అలాగే, కార్మికులకు అడ్డాలు ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. అడ్డాల వద్ద నిర్ణయించిన రేట్ల బోర్డులు ఏర్పాటు చేయాలని, హమాలీలకు 5 రూపాయలకే నాణ్యమైన భోజనం ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కొలిశెట్టి యాదగిరిరావు, ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఐలయ్య, వగ్గు చార్లెస్, మల్లెల వెంకన్న, కందుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమల్లో టీఆర్ఎస్ విఫలం

- **టీడీపీ అధ్యక్షులు రమణ విమర్శ**



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో టీఆర్ఎస్ సర్కారు ఘోరంగా విఫలమైందని తెలుగుదేశం తెలంగాణ శాఖ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో ఆ పార్టీ మండల స్థాయి నేతల ఆరవ శిక్షణా శిబిరం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం అభివ ద్ధి విషయంలో రమణ నేతలకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పల్లెపల్లెకు వెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు పార్టీ ఆవిర్భవించిన 36 ఏండ్లల్లో ప్రభుత్వంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్నదన్నారు.

ఇప్పటివరకు ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా తట్టుకుని నిలబడ్డ పార్టీ టీడీపీనేనని అభిప్రాయపడ్డారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను టీఆర్ఎస్ అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడ్డ సమయంలో రూ. 68 వేల కోట్ల అప్పులు ఉంటే, ఇప్పుడు అవి రూ.2.25 లక్షల కోట్లకు పెరిగాయని చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. మిషన్ కాకతీయ, రీడిజైన్లు, మిషన్ భగీరథ పథకాల్లో కమిషన్లు దండుకున్నారని విమర్శించారు. తాగునీటి సరఫరా కోసం 70 శాతం నీటి ట్యాంకులు, పైపులైన్లు ఇప్పటికే వేశారని, మిగతా పనులు పూర్తిచేయడానికి రూ. 5 నుంచి రూ. 6 వేల కోట్లు ఖర్చు చేస్తే సరిపోయేదన్నారు. కాగా కమిషన్ల కోసం వేల కోట్లు వ్యయం చేయడాన్ని తప్పుబట్టారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కనిపించడం లేదన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణకు, క్రమశిక్షణకు మారుపేరు టీడీపీ అని చెప్పారు. పార్టీలో నాయకులుగా ఎదిగి, పదవులను అనుభవించి ఇతర పార్టీల్లోకి వెళ్లిన వారు, ఇప్పుడు టీడీపీ ఎక్కడుందని అంటున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు వారికి బుద్ధిచెబుతారని గుర్తుచేశారు. చంద్రబాబు దయతో కేసీఆర్ గతంలో మంత్రి అయ్యారని చెప్పారు. శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా వచ్చే ఎన్నికల నాటికి పదివేల మంది సైనికులను తయారచేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి అరవింద్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర నాయకులు బీఎన్‌రెడ్డి, బి.నర్సింహులు, ప్రధాన కార్యదర్శులు జి.బుచ్చిలింగం, రమాదేవి, మేకల సారంగపాణి, యోగా గురువు ఆంజనేయులు పాల్గొన్నారు. అనంతరం ఆకస్మికంగా మరణించిన సినీ నటి శ్రీదేవి సంతాపం ప్రకటించారు.

సీపీఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని స్పష్టంచేయాలి

- **ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేస్తేనే విద్యారంగం బలోపేతం**
- **బదిలీ, ప్రమోషన్ల షెడ్యూల్‌ను ప్రకటించాలి : టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి**



నవతెలంగాణ-నిజామాబాద్

2004 సెప్టెంబర్ నుంచి నియామకమైన ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం భద్రత ఇవ్వని కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం (సీపీఎస్)పై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. వచ్చే వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టేందుకు షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. నిజామాబాద్ టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని సుదీర్ఘ కాలంగా పోరాడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సర్వీస్ రూల్స్ సమస్య కోర్టు వివాదంలో ఉందని, ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా బదిలీలు, ప్రమోషన్ల కోసం చొరవ చూపాలని కోరారు. ఉపవిద్యాధికారి, మండల విద్యాధికారి పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో విద్యారంగం కుంటు పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బలోపేతానికి విద్యామిషన్‌ను ప్రకటించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తరగతికో ఉపాధ్యాయుడిని గదిని కేటాయించాలని అన్నారు. ఆంగ్ల మాధ్యమాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని అన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయ, ఉద్యోగ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, వేసవి కాలానికి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మోడల్ పాఠశాల టీచర్ల సర్వీస్ రూల్స్ ప్రకటించి బదిలీలు ప్రమోషన్లు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి, డి.సత్యానంద్, జిల్లా అధ్యక్షులు రమేష్, ఉపాధ్యక్షులు గంగాధర్, కోశాధికారి మల్లేష్, సీనియర్ నాయకులు సోమేశ్వర్లు, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

5వ తేదీలోపు పింఛన్లు అందించాలి

సెర్ఫ్ కార్యాలయం ముందు వికలాంగుల ధర్నా

- **సర్కారే పింఛన్లు విడుదల చేయడం లేదు.. డైరెక్టర్**



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆసరా పింఛన్లను 5వ తేదీలోపు చెల్లించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక డిమాండ్ చేసింది. సకాలంలో పింఛన్లు అందించక పోవడం వల్ల వికలాంగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. నెలల తరబడి పింఛన్లను పెండింగ్‌లో పెడుతున్నారని తెలిపింది. ప్రస్తుతం అందిస్తున్న పింఛన్లు ఏ నెలకు సంబంధించినవో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసింది. "5వ తేదీలోపు ఆసరా పింఛన్లను అందించాలి" అని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో సోమవారం సెర్ఫ్ కార్యాలయం ముందు వికలాంగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోరింకల నర్సింహా, అడివయ్య మాట్లాడుతూ ఆసరా పింఛన్లను అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్లు ఎప్పుడు వస్తాయో తెలియని ఆయోమయ పరిస్థితి నెలకొందన్నారు. పింఛన్ల చెల్లింపులో జాప్యం వల్ల రాష్ట్రంలోని 4.75 లక్షల మంది వికలాంగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెం 17 ప్రకారం ప్రతి నెల 5వ తేదీలోపు పింఛన్లు చెల్లించాల్సి ఉన్నా రెండు, మూడు నెలలకు ఒకసారి మాత్రమే ప్రభుత్వం పింఛన్లను విడుదల చేస్తున్నదని తెలిపారు.

సదరన్ క్యాంపుల నిర్వహణలోనూ నిర్లక్ష్యం

వికలాంగులను గుర్తించేందుకు ప్రతి నెల నిర్వహించాల్సిన సదరన్ క్యాంపుల నిర్వహణలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. క్యాంపుల నిర్వహించినా వికలాంగ సర్టిఫికెట్లు అందజేయడం లేదని తెలిపారు.

రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో సదరన్ క్యాంపులు నిర్వహించడం లేదన్నారు. ప్రతి నెల విధిగా సదరన్ క్యాంపులు నిర్వహించి వికలాంగులను గుర్తించాలని, 40 శాతం అంగవైకల్యంతో ఉన్న 2.50 లక్షల మందికి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎన్‌పీఆర్‌డీ నాయకులు ఆర్ వెంకటేశం, సయ్యద్ ఖజా, ఉపేందర్, వెంకట్, కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే పింఛన్లు విడుదల చేయడం లేదు..సెర్ఫ్ డైరెక్టర్

నిధుల కొరత వల్ల సర్కారే సకాలంలో ఆసరా పింఛన్లను విడుదల చేయడం లేదని సెర్ఫ్ డైరెక్టర్ ప్రవీణ తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న జాప్యం వల్లనే అనుకున్న తేదీలోపు పింఛన్లు అందించలేకపోతున్నామని చెప్పారు. ఇందులో తమ శాఖ నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు. మార్చి నెల నుంచి సకాలంలో పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్రమం తప్పకుండా సదరన్ క్యాంపులు నిర్వహించి వికలాంగులకు సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్లను విడుదల చేయడానికి ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పారు.

ఆదివాసీల సమస్యలను పరిష్కరించండి

- **సీఎంకు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం లేఖ**

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఆదివాసీల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఆదివాసీల సమస్యలపై పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా సమస్యలకు పరిష్కారం లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం భీంరావు సీఎం కేసీఆర్‌కు భహిరంగ లేఖ రాశారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న మీరు ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం అధికారులు, స్థానిక నాయకులకు సూచనలు సలహాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాల్లోని 951 హామ్లెట్ గ్రామాలకు 478 గ్రామాలకు ఇప్పటికీ రోడ్డు సౌకర్య లేదని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని అనేక గ్రామాల్లో మంచి నీటి కొరత ఉందన్నారు. అదేవిధంగా 2008లో హక్కు పత్రాలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్న 19500 మంది దరఖాస్తు దారులకు హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. భూ సర్వేలో పోడు భూములను అధికారులు నమోదు చేయలేదని తెలిపారు. దీంతో పాటు వారసత్వంగా వచ్చిన ప్రభుత్వ భూములను ప్రస్తుతం సాగు చేస్తున్న వారి పేరు మీద నమోదు చేయలేదని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనులకు మూడెకరాల భూ పంపిణీ, గిరిజన యూనివర్సిటీ విషయంలో మాట తప్పారని, వాటిని అమలు చేయాలని కోరారు.



నవచిత్రం



'మా పిల్లలు జాన్వీ, ఖుషీనే బ్లెస్డ్ అనే చెప్పాలి. ఎందుకంటే శ్రీని(శ్రీదేవి) రూపంలో ఫెంటాస్టిక్ మదర్ దొరికినందుకు. వారి ప్రతి అవసరాన్ని గుర్తించి, అది నెరవేరేలా చేస్తుంది. తల్లిగా, భార్యగా తన బాధ్యతలను ఎంతో నిబద్ధతతో, అంకితభావంతో చేస్తుంది. పిల్లల కోసం శ్రీని తన టాప్ కెరీర్‌ను సైతం పక్కన పెట్టినప్పుడు చాలా ఆశ్చర్యపోయాను. నా జీవితంలోకి శ్రీని రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రతి పురుషుడి విజయం వెనుక ఓ స్త్రీ ఉంటుందని అందరూ చెబుతుంటారు. నా విషయంలో తప్పకుండా శ్రీని ఉంది. ఆమె లేకపోతే ఇదంతా ఏమీ ఉండేది కాదు. శ్రీనికి చేసిన లవ్ ప్రపోజల్ గురించి అప్పుడప్పుడు గుర్తు చేసుకుని, చాలా గర్వంగా ఫీలవుతాను. ఆమెను చాలా గాఢంగా (పిచ్చిగా) ప్రేమించాను. షీ ఈజ్ మై ఫేవరేట్ లేడీ. ఫేవరేట్ స్టార్.. శ్రీని సింప్లీ సూపర్..'

- ఇటీవల ప్రేమికుల దినోత్సవం సందర్భంగా శ్రీదేవి గురించి భర్త బోనీకపూర్ చెప్పిన మాటలు..

అద్భుత వ్యక్తిత్వం.. స్ఫూర్తిదాయక అంకితభావం..

అందం, అభినయం మాత్రమే కాదు అద్భుత వ్యక్తిత్వం, అంతకంటే స్ఫూర్తిదాయకమైన అంకితభావమే అశేష అభిమానగణాన్ని శ్రీదేవి సొంతం చేసుకోవడానికి మూల కారణం. అసమాన నటిని స్మరించుకుంటూ అభిమానులే కాదు ప్రేక్షకలోకం కూడా మౌనంగా రోదిస్తోంది. ఏ తీరులో స్పందించాలో తెలియని సందిగ్ధావస్థలో ఆవేదన పడుతోంది. ఈ విషయంలో సినీ ప్రముఖులు, క్రికెట్ దిగ్గజాలు, రాజకీయ రంగ హేమాహేమీలూ మినహాయింపు కాదు. తమ అభిమాన నటి ఇక లేదనే విషయాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. అద్భుత వ్యక్తిత్వం, మార్గదర్శక అంకితభావంతో భారతీయ సినీ చరిత్రలో శ్రీదేవి ఓ సువర్ణాధ్యాయాన్ని సృష్టించింది.

80కిపైగా నటించిన తెలుగు చిత్రాలన్ని శ్రీదేవి నటనకు అద్దం పట్టినవే. ఆయా చిత్రాల్లో శ్రీదేవి నట విశ్వరూపంతోపాటు పాత్రల పోషణ కోసం ఎంతో అంకితభావంతో పని చేసిన తీరునూ స్పష్టంగా చూడొచ్చు. అందులో ప్రధానంగా 'పదహారేళ్ల వయసు' గురించి చెప్పుకోవాలి. ఇది తమిళంలో విడుదలైన '16 వయదినిలె' చిత్రానికి రీమేక్. కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అందాల మల్లిగా శ్రీదేవి నటించింది. అప్పటికి వయసు 14ఏండ్లే అయినప్పటికీ విభిన్న పార్శ్వాలున్న మల్లిగా శ్రీదేవి తనదైన నట విలక్షణతతో ఆడియెన్స్‌ను ఫిదా చేశారు. అమాయకమైన పల్లెటూరి అమ్మాయిగా, ప్రేమించిన వాడి మోసానికి గురైన ప్రియురాలిగా, తల్లిని కోల్పోయిన కూతురుగా అత్యంత సహజ నటనతో ఆకట్టుకున్నారు. ఇందులో 'సిరిమల్లె పువ్వా.. చిన్నారి చిలకమ్మా..' అనే పాటలో శ్రీదేవి అభినయం మంత్రముగ్దుల్ని చేస్తుంది. ఇక ఎన్టీఆర్‌తో కలిసి నటించిన 'వేటగాడు' చిత్రంలో రాజకుమారి రోజాగా అందంతో కట్టిపడేశారు. ప్రేమించిన ప్రియుడి కోసం తపించే ప్రియురాలిగా ఆద్యంతం ఆకట్టుకున్నారు. ఎన్టీఆర్ సరసన శ్రీదేవి నటించిన ఈ చిత్రంలో వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు పోటాపోటీగా ఉంటూనే అలరిస్తాయి. శ్రీదేవి నటనకు అద్దం పట్టే చిత్రాల్లో మరోకటి 'ఆకలి రాజ్యం'. నిరుద్యోగంతో బాధపడుతున్న యువకుడికి, ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన అమ్మాయి అందించిన సపోర్ట్, అతని కోసం తన కుటుంబాన్ని త్యాగం చేయడం ఇందులో ప్రధానాంశం. నిరుద్యోగిగా కమల్ హాసన్, మధ్యతరగతి అమ్మాయిగా శ్రీదేవి నటించారు. నిరుద్యోగి కష్టాలు చూసి చలించిన మిడిల్ క్లాస్ అమ్మాయిగా శ్రీదేవి నటనకు ప్రతి ఒక్క ప్రేక్షకుడు ఇంప్రెస్ అయ్యారు. కె.బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలోని పాటలూ మంచి ఆదరణ పొందాయి. ఇక ఎన్టీఆర్‌తో కలిసి నటించిన మరో సినిమా 'కొండవీటి సింహం'. ఇందులో ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేయగా, దేవి పాత్రలో శ్రీదేవి నటించారు. అందం, అభినయంతో కూడిన దేవి పాత్రలో ఆమె తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించారు.

శ్రీదేవి నటించిన అద్భుత చిత్రాల్లో 'ప్రేమాభిషేకం' ఒకటి. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ట్రాజిక్ లవ్‌తో కూడిన ఈ సినిమాలో దేవి పాత్రలో ప్రియుడు రాజేష్‌ను అపార్థం చేసుకున్న అమ్మాయిగా శ్రీదేవి నటన ఆద్యంతం అలరిస్తుంది. మొండి అమ్మాయిగా తనదైన వైవిధ్యమైన నటనతో మెప్పించింది. 1981లో విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించి ప్రశంసలందుకుంది. అప్పటి వరకు నటించిన సినిమాలు ఓ ఎత్తైతే 'ఆఖరి పోరాటం' మరో ఎత్తు. ఇందులో చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్న విలన్ ఆగడాలను బట్టబయలు చేసే సీబీఐ అధికారి ప్రవల్లిక పాత్రలో శ్రీదేవి నటనకు ఎవ్వరైనా ఫిదా కావాల్సిందే. యాక్షన్ ఎలిమెంట్స్‌ల్లోనూ సత్తా చాటి మహిళా శక్తిని చాటారు. పోలీస్ అధికారిగా తన హీరోయిజం చూపించారు. ఆమెకు సహాయపడే స్టేజ్ ఆర్టిస్టు పాత్రలో నాగార్జున నటించారు. 1988లో విడుదలైన ఈచిత్రం బ్లాక్‌బస్టర్‌గా టాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది.

ఈ చిత్రాలతో లేడీ సూపర్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న శ్రీదేవి 'జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రంతో అతిలోక సుందరిగానే ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. స్వర్గలోకం నుంచి భూమిపైకి వచ్చి తన ఉంగరం పోగొట్టుకుని ఇక్కడే ఉండిపోవాల్సిన వచ్చిన ఇంద్రుడి కుమార్తె ఇంద్రజగా శ్రీదేవి అందం, అభినయాన్ని వర్ణించడానికి మాటలు, పదాలు చాలవు. 'ఏమీ మానవా..' అంటూ ఆమె పలికించే అమాయక సంభాషణలు ప్రేక్షకులకు కడుపుబ్బ నవ్విస్తూనే కన్నీళ్లు పెట్టిస్తాయి. ఇందులో చిరంజీవి సరసన నటించారామె. 1990లో విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిందంటే శ్రీదేవి అభినయమే అందుకు ముఖ్య కారణం. ఇక శ్రీదేవి నటనను పీక్‌కు తీసుకెళ్ళిన చిత్రం 'క్షణక్షణం'. రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో వెంకటేష్ సరసన శ్రీదేవి నటించారు. అమాయకమైన అమ్మాయిగా తన నటనతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. సత్య అనే ఉద్యోగి పాత్రలో అత్యంత సహజమైన నటనతో అల్లరి చిల్లరి పనులతో గిలిగింతలు పెట్టించే చతురతతో ప్రేక్షకుల్ని పడి పడి నవ్వుకునేలా చేశారు. వీటితోపాటు 'కార్తీక దీపం', 'సర్దార్ పాపారాయుడు', 'త్రిశూలం', 'గోవిందా గోవిందా', 'బొబ్బిలి పులి' వంటి తదితర చిత్రాల్లో వైవిధ్యమైన, భిన్నమైన పాత్రలు పోషించి తన నటనలోని విలక్షణతను చాటుకున్నారు. చాలా వరకు తన పాత్రలకు తానే డబ్బింగ్ చెప్పడం విశేషం.

తెలుగులోనే కాదు తమిళంలో కూడా పలు అద్భుతమైన పాత్రలతో మెప్పించారు. అందులో 'మూండ్రు ముడిచు', '16 వయదినిలె', సిగప్పు రోజకలే', 'మూండ్రమ్ పిరై', 'మీండుమ్ కోకిల' చిత్రాలు శ్రీదేవి నటనకు మచ్చుతునకలు. ట్రయాంగిల్ లవ్ స్టోరీ 'మూండ్రు ముడిచు'లో సెల్వి పాత్రలో ఇద్దరు ప్రియులను బ్యాలెన్స్ చేస్తూ తన ఇన్నోసెంట్‌ను చాటుకునే అమ్మాయిగా, సంఘర్షణతో కూడిన పాత్రలో జీవించి ఆ పాత్రకే ప్రాణం పోశారు. కె.బాలచందర్ దర్శకత్వంలో 1976లో వచ్చిన ఈ సినిమా భారీ విజయాన్ని సాధించింది. ముఖ్యంగా సెల్వి పాత్రలో శ్రీదేవి నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ఇక '16వయదినిలె'లో మయిలిగా అమాయకత్వంతో కూడిన పాత్రలో తనలోని భిన్న పార్శ్వాలను ప్రతిబింబించింది. ఇది తెలుగులో 'పదహారేళ్ళ వయసు'గా రీమేక్ అయిన విషయం విదితమే. 'సిగప్పు రోజకాలె'లో శారదగా, మహిళలను లైంగికంగా వాడుకుని హత్యలు చేసే వ్యాపారవేత్త అయిన తన భర్త ఆగడాలను బట్టబయలు చేసే పాత్రలో ఎంతో ధైర్యసాహసాలు చూపించారు. ఇందులో వ్యాపారవేత్తగా కమల్ హాసన్ నటించారు. భారతీరాజా దర్శకత్వంలో 1978లో వచ్చిన ఈ సినిమా పెద్ద హిట్ అయ్యింది. తెలుగులో 'ఎర్రగులాబీలు'గా అనువాదమైంది. శ్రీదేవి నట విశ్వరూపానికి ప్రతీక 'మూండ్రమ్ పిరై'. తెలుగులో 'వసంత కోకిల'. ఓ ప్రమాదం వల్ల గతాన్ని మర్చిపోయిన పాత్రలో భాగ్యలక్ష్మిగా, విజయగా తనలోని రెండు పార్శ్వాలను ఆవిష్కరించారు. తన జీవితంలోని విషాదాన్ని అర్థం చేసుకోలేని చిన్న పిల్లగా ఆమె నటన కన్నీళ్లు పెట్టిస్తుంది. తన భర్త మరో అమ్మాయితో తిరుగుతున్న నేపథ్యంలో తిరిగి అతన్ని తన వాడిగా మార్చుకోవడం కోసం కోకిల పాత్రలో నటించిన శ్రీదేవి పడే తపనే ఈ చిత్రం. ఇందులో భర్త



పాత్రలో కమల్ హాసన్ నటించారు. 'గురు', 'పోకిరి రాజా', 'పులి' వంటి చిత్రాల్లో తన విలక్షణ నటనతో మెప్పించారు. 'లాడ్లా', 'హిమ్మత్‌వాలా', 'లమ్హే', 'చాందిని', 'చాల్‌బాజ్', 'మిస్టర్ ఇండియా', 'సద్మా', 'నాగిన', 'ఇంగ్లీష్ వింగ్లీష్', 'మామ్' వంటి బాలీవుడ్ చిత్రాలు శ్రీదేవిని బాలీవుడ్‌లో సూపర్‌స్టార్‌ను చేశాయి. భాష రాకపోయినప్పటికీ నేర్చుకుని మరీ తన పాత్రలకు శ్రీదేవి డబ్బింగ్ చెప్పడమనేది వృత్తిపట్ల తన డెడికేషన్‌ను తెలియజేస్తుంది. 'స్వప్నంగల్', 'పూంపట్టా', 'తీర్థయాత్ర', 'అభినందనమ్', 'ఆలింగానమ్', 'ఘులవర్షమ్', 'ఆశీర్వాదమ్', 'అంతర్థాహమ్', 'ఆకలే ఆకాశమ్', 'నిరకుడమ్', 'అంగీకారమ్', 'సత్యవన్ సావిత్రి', 'దేవరాగమ్' వంటి 23కుపైగా మలయాళ చిత్రాల్లో , 'భక్త కుంబర', 'హెన్ను సంసార కన్ను', 'సంపూర్ణ రామాయణ', 'యశోద క్రిష్ణ', 'ప్రియా', 'బాలల భారత' వంటి డిఫరెంట్ జోనర్ కన్నడ చిత్రాల్లో భిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల్ని అలరించారు. చాలా చిత్రాల్లోని ఆమె పాత్రలు శక్తివంతమైన మహిళా పాత్రలకు ప్రతీకలు. నటిగానే సుపరిచితురాలైన శ్రీదేవి ఓ గొప్ప పెయింటర్ కూడా.

వృత్తిపరంగానే కాదు వ్యక్తిగతంగానూ తన బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వర్తించారు. తండ్రి చనిపోయాక తన తల్లితోపాటు సవతి తల్లి, ఆమె కూతురు, కొడుకుల బాధ్యతల్ని తీసుకోవడమే కాకుండా టాప్ హీరోయిన్‌గా కొనసాగుతున్న తరుణంలో పిల్లల కోసం దాదాపు 10 ఏండ్ల వరకు సినిమాల జోలికి రాలేదు. అలాగే పెద్దకూతురు జాహ్నవి ఇష్టం మేరకు ఆమె ఎంచుకున్న సినీ రంగంలోకే పంపింది. జాహ్నవి హీరోయిన్‌గా పరిచయం అవుతూ నటిస్తున్న చిత్రం 'ధడక్'. పాత్రల పోషణకే కాదు కమర్షియల్ చిత్రాల్లోని పాటల కోసం, యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం శక్తివంచన లేకుండా సాధన చేసి అందరితో శభాష్ అనిపించుకుంది.

మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్



'దండుపాళ్యం 3' చిత్ర ప్రీ రిలీజ్ వేడుక దృశ్యం

బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ప్రధాన పాత్రధారులుగా శ్రీనివాసరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దండుపాళ్యం'. 'దండుపాళ్యం' సిరీస్‌లో భాగంగా వస్తున్న మూడవ పార్ట్ ఇది. రజనీ తాళ్ళూరి నిర్మించిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో వైభవంగా జరిగింది. పాటల సీడీలను లయన్ కిరణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దండుపాళ్యం' పేరు ఓ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకుంది. పక్కా మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. మొదటి రెండు భాగాలను మూడో పార్ట్ బీట్ చేస్తుందని నమ్మకం ఉంది. టీమ్ అందరికి ఆల్ ది బెస్ట్' అని అన్నారు.

"దండుపాళ్యం'కు నేను పెద్ద అభిమానిని. మాలాంటి దర్శకులకు ఈ చిత్రం ఒక ఇన్స్పిరేషన్. ఇలాంటి సినిమా చేయాలంటే గట్స్ ఉండాలి. డైరెక్టర్ విజన్‌ను ఫాలో అయ్యే మంచి టీమ్ దొరికింది. మూడు పార్టులుగా చేయడం అంత చిన్న విషయం కాదు. మరో మూడు పార్టులు కూడా చేయాలని కోరుకుంటున్నాను' అని దర్శకుడు వి.ఐ.ఆనంద్ తెలిపారు.

చిత్ర దర్శకుడు శ్రీనివాసరాజు చెబుతూ, 'మూడు పార్టులకు కొంత మంది నటీనటులు తప్ప మిగతా అందరూ గత చిత్రాల్లో నటించినవారే. అందరూ ఎంతో బాగా కష్టపడ్డారు. ఈ సిరీస్‌లో నాతో పాటు బాగా కష్టపడిన వ్యక్తులు మాటల రచయిత రమేష్, ఎడిటర్ రవిచంద్రన్, సినిమాటోగ్రాఫర్ వెంకట్ ప్రసాద్. వారికి కృతజ్ఞతలు. ఈ సినిమా తర్వాత మరో రెండు, మూడేండ్ల వరకు ఈ జోనర్‌లో సినిమాలు చేయను' అని చెప్పారు.

'ఆరేండ్ల జర్నీ ఇది. ఇందులో నేను నెగటివ్ రోల్ చేశాను. మమ్మల్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు కాబట్టే మూడో పార్ట్ చేయగలిగాం' అని పూజా గాంధీ చెప్పారు. మకరంద్ దేశ్ పాండే చెబుతూ, 'ఈ మూడుపార్ట్‌ల్లో మొదటిది సాహసంతో కూడిన ప్రయాణం. దాని కారణంగానే రెండో పార్ట్‌ను చేయగలిగాం. ఈ చిత్రంతో మా జర్నీ ముగిసింది. ఐదారేండ్లు కలిసి ప్రయాణించడం గొప్పగా అనిపించింది. దర్శకుడు శ్రీనివాసరాజు పడ్డ కష్టాన్ని మాటల్లో చెప్పలేం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరుచూరి వెంకటేశ్వరరావు, డానీ, కుట్టప్ప, కోటి, బెక్కం వేణుగోపాల్, మల్కాపురం శివకుమార్, హరి సుబ్బు, ముని, ప్రసన్న, నక్కిన త్రినాథరావు, శ్రీనివాస్ మీసాల, సాయికృష్ణ పెండ్యాల తదితరులు పాల్గొన్నారు.



నా రూటే సపరేటు..

ప్రస్తుతం కళ్యాణ్‌రామ్ సరసన 'ఎమ్మెల్యే', తమిళంలో 'పారిస్ పారిస్' ('క్వీన్' రీమేక్) చిత్రాల్లో నటిస్తున్న కాజల్ తాజాగా ఓ యువకథానాయకుడికి జోడీగా నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని సమాచారం. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా నూతన దర్శకుడు శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కబోతున్న రొమాంటిక్ థ్రిల్లర్‌లో కాజల్ ఓ నాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. చిరంజీవి, పవన్‌కళ్యాణ్, మహేష్‌బాబు, ప్రభాస్, రామ్‌చరణ్, ఎన్టీఆర్ వంటి తదితర స్టార్ హీరోల సరసన నటించి, సిల్వర్ స్క్రీన్ మీద మ్యాజిక్ చేసిన కాజల్ ఇప్పుడు కళ్యాణ్‌రామ్, బెల్లంకొండ సాయిశ్రీనివాస్ వంటి కథానాయకుల సరసన నటిస్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ఒకప్పుడు ప్రాధాన్యత లేని, గ్లామర్‌కి మాత్రమే పెద్ద పీట వేసే చిత్రాల్లో నటించిన కాజల్ ప్రస్తుతం రూట్ మార్చి కంటెంట్ బేస్డ్ చిత్రాలు, మహిళా ప్రధాన చిత్రాల్లో నటిస్తూ నా రూటే సపరేటూ అని చెప్పకనే చెప్పేసింది.



'నందికొండ వాగుల్లోన..' చిత్రం ఆడియో ఆవిష్కరణోత్సవ దృశ్యం

నందికొండ వాగుల్లోన పాటలొచ్చాయ్..

షఫీ, లక్కీ ఎకారి సాయి కిరణ్, పూజశ్రీ, మేఘన, జ్యోతిక ప్రధాన పాత్రధారులుగా సత్యనారాయణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నందికొండ వాగుల్లోన'. బీచుపల్లి ఆంజనేయ ప్రొడక్షన్స్ పతాకంపై సాయి వెంకట్ సమర్పణలో రఘు హెచ్ నిర్మిస్తున్నారు. నవనీత్ సంగీతం అందించిన ఈ చిత్ర ఆడియో విడుదల కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ట్రైలర్‌ను శివారెడ్డి, ఆడియో సీడీలను ఎర్రల్ల శ్రీనివాస్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సత్యనారాయణ మాట్లాడుతూ, 'సెన్సార్ నుంచి 'ఎ' సర్టిఫికెట్ వచ్చినప్పటికీ సినిమాలో చాలా వినోదం ఉంది. నేటి యువతను కావాల్సిన అన్ని రకాల అంశాలుంటాయి. తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. నటీనటులు తమదైన నటనతో బాగా నటించారు. నిర్మాత రాజీపడకుండా నిర్మించారు. అందమైన లొకేషన్లలో సినిమాను చిత్రీకరించాం. త్వరలో విడుదల కానున్న మా చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నాం' అని అన్నారు. 'సినిమా కోసం చాలా కష్టపడ్డాం. నవీన్, భాషలు ప్రోత్సహించారు. సాయివెంకట్, ఆర్కెగౌడ్ సినిమాను రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చారు. థియేటర్ల విషయంలో సపోర్ట్ చేస్తామని చెప్పడం చాలా హ్యాపీగా ఉంది. వారికి థ్యాంక్స్' అని నిర్మాత రఘు తెలిపారు. సాయి వెంకట్ చెబుతూ, 'హీరో షిరాజ్‌తో ఉన్న స్నేహంతో ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నా. 'అర్జున్‌రెడ్డి' సినిమాలో ఉన్న దానికంటే కాస్త ఎక్కువగానే టెమ్టేషన్స్ ఉంటుంది. అది పూర్తి వినోదం మేళవింపుగా ఉంటుంది. ముఖ్యంగా బీ, సీ సెంటర్ల ఆడియెన్స్‌ను బాగా ఆకట్టుకుంటుంది. చిన్న సినిమాలకు థియేటర్లు దొరకడం కష్టం. కానీ మా వంతుగా సహకారం అందించి 200థియేటర్లలో విడుదల చేసేలా సపోర్ట్ చేస్తాం. ఇలాంటి మంచి చిత్రాలను ఆదరించాల్సిన అవసరం ఉంది. అప్పుడు మరిన్ని మంచి సినిమాలు ముందుకొస్తాయి' అని చెప్పారు. 'మార్చి 2న సినిమాను విడుదల చేయాలనుకున్నాం, కానీ థియేటర్ల బంద్ కారణంగా మంచి డేట్ చూసి సినిమాను విడుదల చేస్తాం' అని సమర్పకుడు షిరాజ్ తెలిపారు. 'సినిమా పెద్ద విజయం సాధించాలి. చిత్ర బృందానికి నా అభినందనలు' అని ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రల్ల శ్రీనివాస్, సాయి, మధుసూదనచారి, గట్టు రామచంద్రరావు, ఆర్కెగౌడ్, సత్యానంద్, రాధా ప్రశాంత్, హనుమంతరావు, రష్మీ ఠాగూర్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

అంచనాలు అందుకోని బడ్జెట్లు



ఏనాడూ 75 శాతం దాటలే..

- బడ్జెట్‌లో మన వ్యయం తీరిది...
- ఈ యేడాది ఇప్పటి వరకు ఖర్చయింది 62 శాతమే
- పూర్తికాని లక్ష్యాలు..
  నెరవేరని ప్రజల ఆకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకూ మూడు బడ్జెట్లు ముగిశాయి. నాలుగో బడ్జెట్ కాలపరిమితి మార్చి చివరి నాటికి పూర్తి కాబోతున్నది. ఈ క్రమంలో టీఆర్ఎస్ సర్కారు నిర్దేశించుకున్న లక్ష్యాలు ఎంతవరకు సఫలీకృతమయ్యాయి..? ప్రజల ఆకాంక్షలు ఏ మేరకు నెరవేరాయి...? అనే విషయాలను తతరచి చూస్తే అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా టీఆర్ఎస్ సర్కారు ప్రతిపాదించిన మొదటి మూడు బడ్జెట్లలో ఏ ఒక్క దాన్లోనూ 75 శాతానికి మించి నిధులను ఖర్చు చేయలేకపోయింది. ఇక నాలుగో బడ్జెట్ (ప్రసుతం కొనసా గుతున్నది.. మార్చితో ముగియబోతున్నది) విషయానికొస్తే.. జనవరి చివరి నాటికి మొత్తం లక్షా 49 వేల కోట్ల కేటాయింపుల్లో కేవలం రూ.87,565 కోట్లనే ఖర్చు చేయగలిగారు. మొత్తం కేటాయింపుల్లో ఇది 62 శాతంగా నమోదైంది. మరో నెల రోజుల్లో కొత్త బడ్జెట్ రాబోతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈసారి వేసుకున్న అంచనాలను కూడా అందుకోలేదనే విషయం సుస్పష్టమవుతున్నది. ఈ క్రమంలో బడ్జెట్ పద్దులను అట్టహాసంగా ప్రకటించటం.. ఆ తర్వాత ఖర్చు విషయంలో మాత్రం తంటాలు పడటం ఆనవాయితీగా మారిందనే విషయం విదితమవుతున్నది.

మరోవైపు వివిధ పథకాలకు కేటాయింపులు ఘనంగానే ఉంటున్నా.. వాటిలో కొన్ని కార్యక్రమాలపైన్నే ప్రత్యేక శ్రద్ధ వహించటం ఆనవాయితీగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదాహరణకు వ్యవసాయశాఖకు సంబంధించిన పద్దులను పరిశీలిస్తే.. గడిచిన మూడు బడ్జెట్లలోనూ రుణమాఫీకే పెద్ద పీట వేశారు. ఇందుకోసం ఏటా రూ.4,250 కోట్లను విడుదల చేశారు. ఇదే సమయంలో వ్యవసాయ రంగానికే చెందిన ధరల స్థిరీకరణ నిధి, సబ్సిడీ మీద వ్యవసాయ ఉపకరణాలు, గ్రీన్‌హౌస్‌లు, పాలీహౌస్‌లు, కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన వారికి పరిహారం చెల్లించటం, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబీకులను ఆదుకోవటం తదితరాంశాలపై సర్కారు శ్రద్ధ పెట్టలేదు. మరోవైపు దళితులు, మైనారిటీలు, బలహీనవర్గాలకు స్వయం ఉపాధి పథకాల కోసం బడ్జెట్లలో నిధులు కేటాయించినప్పటికీ వాటిలో 25 శాతం కంటే ఎక్కువ విడుదల చేయలేదని సమాచారం. మూడేండ్ల కాలంలో లక్ష మందికి పైగా దళితులు ఈ పథకాల ద్వారా లబ్ది పొందారంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. వాస్తవంలో వారి సంఖ్య 20 వేలకు మించి లేదన్నది కాదనలేని వాస్తవం. ఇదేగాక వివిధ రంగాలు, శాఖలకు చెల్లించాల్సిన బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోవటం కూడా ఖజానాకు పెనుభారంగా మారింది. వీటిలో విద్యుత్ సంస్థలకు రూ.15 వేల కోట్లు, పౌర సరఫరాలశాఖకు రూ.3 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2 వేల కోట్లు, పరిశ్రమలకు రాయితీల కింద రూ.వెయ్యి కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ విధంగా చూస్తే మొత్తం రూ.25 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. దీంతోపాటు అట్టహాసంగా ప్రకటించిన దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇండ్లు, కేజీ టూ పీజీ తదితర పథకాల కేటాయింపులు, వాటి అమలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. దళితుల సంక్షేమం కోసం ప్రతియేటా రూ.10 వేల కోట్ల చొప్పున.. ఐదేండ్లలో రూ.50 వేల కోట్లను కేటాయిస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్... మొదటి బడ్జెట్ సందర్భంగా చెప్పారు. ఆ ప్రకారంగా చూస్తే ఇప్పటి వరకు నాలుగు బడ్జెట్లలో కలిపి రూ.40 వేల కోట్లను కేటాయించాలి. కానీ రూ.32 వేల కోట్లను కేటాయించి.. రూ.18 వేల కోట్లనే ఖర్చు చేయటం గమనార్హం. మన ఊరు-మన ప్రణాళికా పథకం కింద గ్రామ పంచాయతీల్లో పనుల కోసం రూ.20,040 కోట్లు, మండలాలకు రూ.12,143 కోట్లు, జిల్లాలకు రూ.32,210 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. కానీ ఇప్పుడు ఆ పథకం ఊసే లేకుండా పోవటం గమనార్హం. ఈ పథకం కింద ఎన్ని పనులు చేశారు? ఎన్ని నిధులు ఖర్చు చేశారనే విషయాలపై అధికారులు కూడా నోరు మెదపట్లేదంటే.. దాని పరిస్థితేంటనేది తేటతెల్లమవుతున్నది. మరోవైపు సాగునీటి పారుదలకు అత్యంత ప్రాధాన్య తనిచ్చి.. ఆ రంగానికి ఏటా రూ.25 వేల కోట్లు కేటాయిస్తామని సర్కారు ప్రకటించింది. కానీ ఇప్పటి వరకూ ఒక్క ప్రాజెక్టూ పూర్తి కాలేదు.. ఒక్క చుక్క నీరు రాలేదంటూ నీటి పారుదల నిపుణులు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో కనీసం కాళేశ్వరం ప్రాజెక్టునైనా పూర్తి చేసి.. ఎన్నికల్లో గట్టెక్కాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి (2018-19) ప్రతిపాదించబోయే బడ్జెట్ కీలకం కానుంది. వచ్చేది ఎన్నికల సంవత్సరం కాబట్టి ఈ బడ్జెట్‌లో ఏయే రంగాలకు ఎన్నెన్ని నిధులు కేటాయిస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

చంద్రుడిపై ఇండ్లు !

- సాంకేతిక పరిజ్ఞానం సిద్ధం చేశాం : ఇస్రో
- 60 టన్నుల నిర్మాణ సామాగ్రితో 'ఇగ్లూస్' నిర్మాణం



బెంగుళూరు : చంద్రుడిపై ఇండ్లు కట్టే రోజు రాబోతోంది. దీనికి సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. అన్నీకుదిరితే భవిష్యత్తులో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి భారీ ప్రాజెక్టు కూడా చేపడతామని ఇస్రో తెలిపింది. అంతరిక్ష ఆవాసాలుగా పేర్కొంటున్న వీటిని శాస్త్రవేత్తలు 'ఇగ్లూస్' అనే పేరుతో పిలుస్తున్నారు. చంద్రుడిపైకి రోబోలను, త్రీడీ ప్రింటర్స్‌ను, నిర్మాణ సామాగ్రి, ఇతర పరికరాల్ని పంపి ఇగ్లూస్ నిర్మాణాల్ని చేపడతారు. దీనికి సంబంధించి ఇస్రో చేపట్టిన 'నమూనా ప్రాజెక్టు' సక్సెస్ అయ్యింది. ఐదు రకాల అంతరిక్ష ఆవాస (ఇండ్లు) నమూనాలను శాస్త్రవేత్తలు తయారుచేశారు.

వీటిపై ఇస్రో డైరెక్టర్ ఎం.అన్నాదురై మాట్లాడుతూ..."భవిష్యత్తులో అంతరిక్ష కేంద్రాలు కనుమరుగై, వాటి స్థానంలో 'ఇగ్లూస్' వచ్చే అవకాశముంది. అంటార్కిటికాలో మనం ఒక ఔట్‌పోస్టు ఎలాగైతే నిర్మించుకున్నామో, అలా..చంద్రుడిపై 'ఇగ్లూస్' ఏర్పాటవుతాయి. అమెరికా, బ్రిటన్‌తో సహా అనే దేశాలు ఇలాంటి శాశ్వత అంతరిక్ష ఆవాసాల నిర్మాణాన్ని చేపడతాయి. అప్పుడు తప్పకుండా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఒక గొప్ప పాత్ర పోషించనున్నది. మేము దానికి సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేస్తాం. అపోలో మిషన్ ద్వారా చంద్రుడిపై నుంచి తెచ్చిన మట్టిపై పరిశోధనలు చేశాం. అందులో ఏ మూలకాలైతే ఉన్నాయో, వాటిని పోలిన కృత్రిమ పదార్థాల్ని తయారుచేసి 60 టన్నులతో 'ఇగ్లూస్'ను రోబోలు నిర్మిస్తాయి" అని చెప్పారు.

రూ. 9 కోట్ల గ్రామీణ బ్యాంకు కుంభకోణం కేసు.. రికవరీలో ఏసీబీ

- నిందితుల జాబితాలో మరో పది మంది?

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా మోయినాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు లో చోటు చేసుకున్న కోట్ల రూపాయల స్కాంలో ప్రతి పైసాను తిరిగి రికవరీ చేసే లక్ష్యంతో సీబీఐ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. మరో వైపు మరో వైపు ఈ బ్యాంకుకు చెంది , ఇతర బ్రాంచ్‌లో పని చేస్తున్న మరో పది మందిని కూడా నిందితుల జాబితాలో చేర్చేందుకు దర్యాప్తు అధికారులు సమాయత్తం అవుతున్నట్టు తెలిసింది. మోయినాబాద్ అజీజ్‌నగర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాదారుల కోట్ల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి దాదాపు తొమ్మిది కోట్ల రూపాయలు దారి మళ్లి ప్రయివేటు ఖాతాల్లోకి చేరడం సంచలనం రేపింది.

దీనిపై బ్యాంకు రీజియన్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారులు దర్యాప్తును దిగిన విషయం తెలిసిందే. ప్రస్తుత బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, క్యాషియర్ జైపాల్‌రెడ్డి, స్వీపర్ శ్రీనివాస్‌రెడ్డితో సహా గతంలో ఈ బ్యాంకులో 2010 నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు పనిచేసి వేరే బ్రాంచ్‌లో మేనేజర్లుగా ఉన్న మొత్తం 11 మంది పై సీబీఐ కేసులు నమోదు చేసింది. ఇందులో ప్రధాన నిందితుడిగా అనుఆనిస్తున్న జైపాల్‌రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌లతో పాటు మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విచారణలో మరో పది మంది బ్యాంకు ఉద్యోగులు(వీరు ప్రస్తుతం వేరు వేరు బ్రాంచీలలో పని చేస్తున్నారు)ను కూడా సీబీఐ విచారించనున్నట్టు తెలిసింది. వారిని కూడా నిందితుల జాబితాలో చేర్చడానికి సన్నాహాలు జరుగుతున్నట్టు తెలిసింది. ఇదిలా ఉంటే ఈ బ్యాంకు నుంచి ఇతర ప్రయివేటు ఖాతాల్లోకి బదిలీ అయిన కోట్ల రూపాయల ఖాతా దారుల సొమ్మును తిరిగి రికవరీ చేసే లక్ష్యంతో దర్యాప్తు అధికారులు ప్రయత్నిస్తున్నారని తెలిసింది.

ముఖ్యంగా ఈ డబ్బును కుట్ర పూరితంగా తమకు చెందిన ప్రయివేటు ఖాతాల్లోకి మళ్లించిన అధికారులను సీబీఐ క్షుణ్ణంగా విచారిస్తున్నట్టు తెలిసింది. తమ జేబుల్లోకిచేరిన కోట్ల రూపాయలతో ఏం చేశారు, వాటిని ఎక్కడ ఖర్చు పెట్టారు, దాని ద్వారా వారు పొందిన ఫలితామేమిటనేది కూడా అధికారులు విచారిస్తున్నారని తెలిసింది. వీరు చేసిన నేరానికి సంబంధించిన పూర్తి ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితులను విడతల వారిగా అరెస్టు చూపించడానికి అధికారులు సన్నాహలు చేస్తున్నారు.

మింగేస్తున్న అప్పులు



నవతెలంగాణ-సైదాపూర్/రఘునాథపల్లి/ కమలాపూర్/కామారెడ్డి

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్‌కు చెందిన గొల్లపల్లి రాజమౌళి (38) తన రెండెకరాలను సాగుచేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. గత ఖరీఫ్‌లో సాగుచేసి పత్తి, మొక్కజొన్న పంటలు నీరులేక ఎండిపోయాయి. అప్పుచేసి బోరు తవ్వించగా నీరు పడలేదు. ఈసారీ ఆశించిన పంట దిగుబడి రాక నష్టాలపాలయ్యాడు. పంట పెట్టుబడి, బావుల కోసం చేసిన అప్పు రూ. 5లక్షలా 30 వేలు అయ్యింది. అప్పు తీర్చేమార్గం కనపడక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సోమవారం తెల్లవారుజామున పొలం వద్దే చెట్టుకు ఉరేసుకున్నాడు. రాజమౌళి తండ్రి శంకరయ్య(75)కు సరిగా కండ్లు కనపడవు. కొడుకు మరణాన్ని తట్టుకోలేక బోరున విలపిస్తూ తీవ్ర డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. 'చేతకావట్లేదు. నేను తట్టుకోలేను. ఈడనే ఉంటా' అంటూ రాజమౌళి అంత్యక్రియలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి పోయాడు. అంత్యక్రియల అనంతరం బంధువులు, కుటుంబ సభ్యులు ఇంటికి రాగా...శంకరయ్య ఇంట్లోనే ఉరేసుకుని కనిపించాడు. శంకరయ్య భార్య గతంలోనే మృతి చెందింది. రాజమౌళికి భార్య రమాదేవి, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆరునెలల కిందటే రాజమౌళి కూతురి పెండ్లి చేశాడు. వరంగల్ అర్బన్ కమలా పూర్ మండలం మర్రిపెల్లిగూడెం గ్రామానికి చెందిన చందబోయిన శంకర్(35)కు ఎకరం ఉంది. మరో ఎకరం కౌలుకు తీసుకుని పత్తి సాగుచేశాడు. పెట్టబడి కోసం లక్షన్నర రూపాయలు అప్పుచేశాడు. దిగుబడి రాక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించక ఆదివారం సాయంత్రం గుళికలు మింగాడు. ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగబాబు తెలిపారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం మంథని దేవునిపల్లికి చెందిన కామాటి రాజయ్య (45)కు రెండెకరాలుంది. మూడ్నెళ్ల కింద బోరుబావిని తవ్వించగా నీళ్లు పడలేదు. అంతకుముందూ ఓ బావిని తవ్వించగా ఇదే పరిస్థితి. బావుల తవ్వకాల కోసం సుమారు రూ.2లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక ఇంట్లో తరుచూ చర్చించేవాడు. శనివారం నాడు రాజయ్య పంట పొలానికి మందు చల్లి వస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగిరాలేదు. అతని భార్య లలిత ఎంతవెతికినా అతడు కన్పించకపోవటంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. సోమవారం రాజయ్య తమ్ముడు పోతరాజు శ్రీను చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో వెతకగా రాజయ్య చెట్టుకు ఉరేసు కుని కనిపిం చాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి పంచ నామా నిర్వహించారు. మృతదేహం కుళ్లిపోవడంతో వైద్యులను ఘటనా స్థలానికి రప్పించి, పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుండెపోటుతో మరో రైతు

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం గ్రామానికి చెందిన నక్క కృష్ణ(40) తన మూడెకరాలలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. రెండుమూడేండ్లుగా సాగు కోసం రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. ఈసారి పత్తి పంట దిగుబడి సరిగా రాలేదు. వచ్చిన పంటకూ మార్కెట్‌లో రేటు సరిగా లేక మానసిక వేదనకు గురయ్యాడు. సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రైతు మృతితో ఆకుటుంబం రోడ్డున పడింది. రాష్ట్ర ప్రభుత్వం రైతు కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శాగ కైలాసం, సీపీఐ(ఎం) మండల నాయకులు కావటి యాదగిరి డిమాండ్ చేశారు.

బస్సుయాత్ర అర్థరహితం

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు చేపడుతున్న బస్సు యాత్ర అర్థరహితమని, ఏ ముఖం పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు తెలంగాణలో బస్సుయాత్రకు సిద్ధమవుతున్నారని భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణపై వివక్ష చూపడంలో బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందేనని అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రెండు జాతీయ పార్టీలు తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేస్తున్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా బీజేపీ అన్యాయం చేసిందన్నారు. వెనకబడిన తెలంగాణకు నిధులు, ప్రాజెక్టులివ్వకుండా, అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు ప్రాధాన్యతనిస్తోందని ఆరోపించారు. కాళేశ్వరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని ఇప్పటికే చాలా సార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. తెలంగాణ పట్ల కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పోలవరానికి జాతీయ హోదా ఇచ్చిన కాంగ్రెస్ ప్రాణహిత-చేవెళ్లకు మొండి చేయి చూపిందని చెప్పారు. జాతీయ హోదా కల్పించి ఉంటే తెలంగాణ ప్రభుత్వానికి నేడు అప్పులు తెచ్చే దుస్థితి ఉండేది కాదన్నారు. అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేక హోదా కల్పించే అంశంపై తొలి సంతకం చేస్తామని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ తాజాగా ప్రకటించడాన్ని మంత్రి తప్పుబట్టారు. తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన హక్కుల మాటేమిటి ? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీలు గుత్తా సుఖేందర్ రెడ్డి, బీబీ పాటిల్, కొత్త శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేవెబ్‌సైట్ హ్యాకింగ్

- డీజీపీకి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఫిర్యాదు



నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

తన వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురైందని బీజేపీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి సోమవారం రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. రోజు వారీగానే తన సహాయకుడు ఒక సమాచారాన్ని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబోగా అది హ్యాకింగ్‌కు గురైనట్టు తేలిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని వెనుక ఉగ్రవాద సంస్థలు లేదా పాకిస్తాన్ ప్రేరేపిత వ్యక్తుల హసం ఉందని ఆయన ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయంచేయాలని ఆయన డీజీపీని కోరారు. దీనిపై స్పందించిన డీజీపీ సైబర్ క్రైమ్ విభాగం ద్వారా విచారణ జరపించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయనకు హామీ ఇచ్చారు. దీనిపై నగర నేర పరిశోధక విభాగంలోని సైబర్‌క్రైమ్ విభాగం అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు.

నేడే ఎంసెట్ నోటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)



విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఎంసెట్‌కు గతంలో ఉన్నట్టుగానే ఈసారి కూడా నిమిషం నిబంధన కొనసాగిస్తున్నారు. అయితే గతంతో పోలిస్తే దరఖాస్తు ఫీజులను భారీగా పెంచేశారు. సోమవారం ఎంసెట్ పరీక్షకు సంబంధించిన వివరాలను జేఎన్‌టీయూ వీసీ వేణుగోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్, ఎంసెట్ కన్వీనర్ యాదయ్యతో కలిసి తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్ టి పాపిరెడ్డి విలేకరులకు వివరించారు. మే 2,3 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్ పరీక్ష, మే 4,5,7 తేదీల్లో ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్ష నిర్వహించనున్నట్టు పాపిరెడ్డి చెప్పారు. ఒక్కో బ్యాచుకు 25వేల మంది చొప్పున ప్రతిరోజూ రెండుబ్యాచులకు పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. మొదటి బ్యాచ్‌కు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ, రెండో బ్యాచుకు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకూ పరీక్ష ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో ఎంసెట్ పరీక్ష నిర్వహిస్తు న్నట్టు తెలిపారు. విద్యార్థులకు పరీక్ష పట్ల అవగాహన కోసం మాక్ టెస్టులూ నిర్వహిస్తామన్నారు. జవాబు పత్రం, కీ అభ్యర్థి ఈ మెయిల్‌కు పంపిస్తామని చెప్పారు.

ఏప్రిల్ 20 నుంచి హాల్‌టికెట్లు

విద్యార్థులు ఎలాంటి అపరాద రుసుము లేకుండా ఏప్రిల్4 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.500 అపరాద రుసుముతో ఏప్రిల్ 11వరకు, రూ.వెయ్యి అపరాద రుసుముతో ఏప్రిల్ 18వరకు, రూ.ఐదువేల అపరాద రుసుముతో ఏప్రిల్ 24 వరకు, రూ.పదివేల అపరాద రుసుముతో ఏప్రిల్ 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో ఏమైన తప్పులు దొర్లితే ఏప్రిల్ 6 నుంచి 9వరకు సరిచేసుకునే అవకాశం కల్పించారు. ఏప్రిల్ 20 నుంచి మే1వరకు విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఎంసెట్ షెడ్యూల్ వివరాలు..

నోటిఫికేషన్	27.2.2018
దరఖాస్తుల స్వీకరణ	మార్చి 4 నుంచి ఏప్రిల్ 4 వరకు
తప్పుల సవరణకు	ఏప్రిల్ 4 నుంచి 9వరకు
హాల్‌టికెట్లు డౌన్‌లోడ్	ఏప్రిల్ 20 నుంచి మే 1వరకు
అగ్రికల్చర్, ఫార్మసీస్ట్రీమ్ పరీక్ష	మే 2, 3తేదీల్లో
ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్ష	మే 4,5,7 తేదీల్లో

'ఈ-మెయిల్' తప్పనిసరి..

అధికారులు ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లోనే పూర్తి సమాచారాన్ని పంపించనున్నారు. దీంతో దరఖాస్తు చేసుకునే ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా ఈ-మెయిల్ అడ్రస్ ఉండాలనే నిబంధన పెట్టారు. ఒకవేళ విద్యార్థి ఈ-మెయిల్ ఇవ్వకపోయినా, తప్పుడు ఈ-మెయిల్ ఇచ్చినా, విద్యార్థికి సరైన సమాచారం చేరదు. దరఖాస్తు చేసుకున్న వెంటనే ఈ-మెయిల్ అడ్రస్‌కు పీడీఎఫ్ దరఖాస్తు కాపీ వచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

భారీగా పెరిగిన ఫీజులు..

ఎంసెట్ దరఖాస్తు ఫీజును అధికారులు భారీగా పెంచేశారు. గతేడాది ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.250 ఉండే ఈ సంవత్సరం రూ.400లకు పెంచారు. బీసీ, ఓసీ, ఇతర విద్యార్థులకు గతేడాది రూ.5వందల ఫీజుంటే, ఈసారి రూ.800లుగా నిర్ణయించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ స్ట్రీమ్ రెండు పరీక్షలు రాసే విద్యార్థుల్లో ఎస్సీ, ఎస్టీలకు రూ.800, ఇతర విద్యార్థులకు రూ.1600 వసూలు చేయనున్నారు. జీఎస్టీ, ఆన్‌లైన్ పరీక్ష విధానంతోనే ఫీజులు పెంచినట్టు అధికారులు చెబుతున్నారు.

మార్చి 5 నుంచి ఈసెట్ దరఖాస్తులు

ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఈసెట్ పరీక్ష నోటిఫికేషన్ మార్చి 2న విడుదల కానున్నది. మార్చి5 నుంచి ఏప్రిల్ 6 వరకు ఎలాంటి అపరాద రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు. మే2 నుంచి ఏడు వరకు విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఈసెట్ కన్వీనర్ గోవర్ధన్ తెలిపారు. మే 9న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకూ ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందని చెప్పారు.

మార్చి 15 నుంచి పీజీఈసెట్ దరఖాస్తులు

ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పీజీఈసెట్ నోటిఫికేషన్ మార్చి 12న జారీ కానుంది. మార్చి 15 నుంచి మే 1 వరకు అపరాద రుసుము లేకుండా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.500, ఇతర విద్యార్థులకు రూ.వెయ్యిగా నిర్ణయించారు. పరీక్షను మే 28 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు.

రాష్ట్రం ఉలుకదు.. కేంద్రం పలుకదు..

(మొదటిపేజీ తరువాయి)

భరించలేదనే కారణంతో ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కోరాలని నిర్ణయించారు. ఈమేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రానికి లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను గత సంవత్సరం కేంద్రానికి పంపారు. కేంద్ర జలవనరుల శాఖ నిబంధనల ప్రకారం ఏదైనా ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలంటే ఈ ప్రాజెక్టు ద్వారా రెండు రాష్ట్రాలకు పైగా ప్రయోజనం చేకూరాలి. అదే విధంగా అంతరాష్ట్ర వివాదాలు ఉండకూడదు. కేంద్ర జలవనరుల శాఖకు సంబంధించిన సాంకేతిక సలహా సంఘం అనుమతులు ఉండాలి. పెట్టుబడులు తదితర అంశాలకు సంబంధించిన 18 డైరెక్టరేట్ల అనుమతులు లభించిన తర్వాతే సాంకేతిక సలహా కమిటీ అనుమతులు లభిస్తాయి. సాంకేతిక సలహా కమిటీ ఆమోదించిన డీపీఆర్ ప్రాతిపదికగా జాతీయ హోదా విషయాన్ని కేంద్ర జలవనరుల శాఖ పరిశీలిస్తుంది. ఇదే విషయాన్ని కేంద్రం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. కేంద్ర జలసంఘం నుంచి నీటి లభ్యతకు సంబంధించిన సూత్రప్రాయమైన అనుమతి, అంతరాష్ట్ర అనుమతి, పర్యావరణ అటవీ అనుమతులు ఈ ప్రాజెక్టుకు లభించినప్పటికీ అతి ముఖ్యమైన సాంకేతిక సలహా కమిటీ అనుమతి ఇంకా లభించాల్సి ఉంది.

జాతీయ హోదా ఒడిసిన ముచ్చట...

కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తిగా స్పష్టత ఉన్నప్పటికీ కొందరు అధికార పార్టీ నేతలు మాత్రం ప్రకటనలతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా లభించటం కష్టమని తెలిసిన తర్వాతే బ్యాంకుల నుంచి రుణం తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అందుకే కేంద్ర జలవనరుల శాఖ నుంచి పెట్టుబడుల అనుమతి కోసం ప్రయత్నించటం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఒడిసిన ముచ్చటేనని ముఖ్యమంత్రి అంతర్గత సమావేశాల్లో అన్నట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రాలు నిర్మించే ప్రాజెక్టులకు ఇకపై జాతీయ హోదా ఉండదని కేంద్రం కూడా ఇటీవల స్పష్టం చేసింది. కేవలం జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులుగా కొన్ని ప్రాజెక్టులను పరిగణించాలని నిర్ణయించింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఎటువంటి ఒత్తిడీ తీసుకు రావటం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక అద్భుతమైన ప్రాజెక్టుగా కేంద్ర మంత్రులు అంటున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వమే ప్రచారం చేసుకుంటున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఇటీవల వ్యాఖ్యానించారు.

11 ప్రాజెక్టులకూ నిధులివ్వని కేంద్రం

రాష్ట్రంలోని 3 భారీ, 8 మధ్యతరహా ప్రాజెక్టులను ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన పథకం కింద కేంద్రం చేర్చింది. భారీ ప్రాజెక్టుల్లో దేవాదుల, శ్రీరామ్‌సాగర్ వరద కాల్వ, బీమా ప్రాజెక్టులు ఉన్నాయి. సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ) కింద గతంలో కేంద్రం నిధులిచ్చిన ప్రాజెక్టులనే ఈ పథకంలో కూడా చేర్చారు. ఈ ప్రాజెక్టులకు కేంద్రం ఇవ్వాల్సిన రూ. వెయ్యి కోట్లను విడుదల చేయటం లేదు. వివిధ ప్రాజెక్టులకు నేరుగా కేంద్రం నుంచి కాకుండా నాబార్డు నుంచి నిధులు ఇచ్చే విధంగా పీఎంకేఎస్‌వై రూపకల్పన చేయటంతో రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నది.

ఎనిమిదేండ్ల క్రితమే ప్రతిపాదనలు

ప్రాణహిత-చేవెళ్ల, పోలవరం సహా ఏడు ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని 2009 లోనే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. వీటిలో రెండు ప్రాజెక్టులు ఆంధ్ర ప్రాంతానివి కాగా ఐదు ప్రాజెక్టులు తెలంగాణ ప్రాంతానికి కావటం విశేషం. పోలవరం, దుమ్ముగూడెం టేల్‌పాండ్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, దేవాదుల, కంతనపల్లి, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపగా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను 13వ ఆర్థిక సంఘం కేంద్ర జలవనరుల శాఖకు పంపింది. వీటిలో రాష్ట్ర పునర్విభజ సందర్భంగా పోలవరం ప్రాజెక్టుకు మాత్రమే జాతీయ హోదా లభించింది. దుమ్ముగూడెం, ఉత్తరాంధ్ర సుజలస్రవంతి, కంతనపల్లి, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు సాంకేతిక కారణాలతో జాతీయ హోదా ఇవ్వలేదు. దేవాదుల, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర జలసంఘం 2016 వరకూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తూనే ఉంది. దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనాలతో పెట్టుబడుల అంచనాలతో కూడిన నివేదికను కేంద్ర జలవనరుల శాఖ కోరగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రాలేదని కేంద్రం తెలిపింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జలవనరుల శాఖ సలహా కమిటి ఆమోదించిన సాంకేతిక ఆర్థిక అంశాలకు సంబంధించిన నివేదికను పంపాలని కేంద్రం కోరింది. దీనికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సమాధానం లేక పోగా రెండు ప్రాజెక్టుల ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నదని కేంద్రం స్పష్టం చేసింది.

చరిత్ర సృష్టిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌పార్టీదే అధికారం.' అని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉద్ఘాటించారు. కాంగ్రెస్‌పార్టీ చేపట్టిన బస్సుయాత్ర సోమవారం సాయంత్రం వికారాబాద్ జిల్లా చేవెళ్లలో ప్రారంభమైంది. అంతకుముందు ఉదయం గాంధీభవన్ నుంచి ఈ యాత్ర ప్రారంభమై నాంపల్లి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి నుంచి ఆరే మైసమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మొయినాబాద్ చర్చిలో ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడి నుంచి వేలాది వాహన శ్రేణితో ఆయన చేవెళ్లకు చేరుకున్నారు. అక్కడి నుంచి వికారాబాద్‌కు చేరింది.ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. చేవెళ్ల సెంటిమెంట్‌తో ఇక్కడినుంచి బస్సుయాత్ర ప్రారంభించాలని మొదలుపెట్టామన్నారు. కేసీఆర్ ప్రజా వ్యతిరేక పాలన, రాష్ట్రంలో అన్ని వర్గాలకు జరుగుతున్న అన్యాయంపై ఈ యాత్రలో ఎండగడుతామన్నారు. బీసీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతులకు నీళ్ళు, కొత్త ప్రాజెక్టులు వస్తాయని ఆశప డితే, ఆ దిశగా ప్రభుత్వ చర్యలు లేవన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతుంటే కేంద్రాన్ని ఈ ముఖ్యమంత్రి ప్రశ్నించడం లేదన్నారు. కేసీఆర్‌కూ, మోడీకీ మధ్య ఏ విధమైన అవగా హన ఉందో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఐటీ సెక్టార్ అంటే.. ఉద్యోగాలు ఇచ్చే కల్పత రువుగా భావించే వారు.. కానీ ఇపుడు ఐటీ అంటే ఇవంకా ట్రంప్ అనేలా మార్చారని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం ఏమైందో తెలియదు కానీ, కేసీఆర్ కుటుంబంలో మాత్రం మరో కొత్తవాడికి కూడా ఉద్యోగం ఇవ్వడానికి సిద్ధమవుతు న్నారని ఎద్దేవా చేశారు. తామంతా ఐక్యంగా వుండి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

హామీలివే...

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అర్హులైన విద్యార్థులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఫీజు రీయింబర్స్ మెంట్‌ను అందిస్తామన్నారు. ఏకకాలంలో 2లక్షల రుణమాఫీ చేస్తామని, అది కూడా ఏకకాలంలో చేస్తామన్నారు. పంటబీమా కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. క్వింటాల్ వరికి 2 వేలు, పత్తి 6వేలు, పసుపు 10వేలకి కొనుగోలు చేస్తామన్నారు. 70లక్షల సమభావన సంఘం సభ్యులకి,డ్వాక్రా గ్రూపులకి ప్రతి సంఘానికి లక్ష రూపాయల గ్రాంట్ ఇస్తామన్నారు. ప్రతి మహిళా సంఘానికి 10లక్షల రూపాయలు ప్రోత్సాహం, వడ్డీని ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. నిరుద్యోగ విద్యార్థులకి నెలకి 3వేల రూపాయల భృతిని చెల్లిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాలో వున్న అన్ని సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తీరుస్తుందన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పాత డిజైన్‌కు మార్చి రంగారెడ్డి జిల్లాకు నీరు ఇస్తామని చెప్పారు.

రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు వ్యతిరేకులు...కాంగ్రెస్‌కు అనుకూల సమీకరణలే : కుంతియా

రాష్ట్రంలో రెండే రెండు వర్గాలు ఉన్నాయని, ఒకటి టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా, మరొకటి కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియా అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా సమీకరణాలు మారనున్నా యన్నారు. టీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడేందుకు అన్ని వర్గాలు కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నూతన సమీకరణలకు రంగం సిద్ధం : మల్లు

రాష్ట్రంలో ఏర్పడే నూతన రాజకీయ సమీకరణలకు ఇప్పుడే రంగం సిద్ధమైందని కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రేపటి భవిష్యత్ కు చేవెళ్ల నాంది పలుకుతుందని అన్నారు. బస్సు యాత్రతో కాంగ్రెస్‌పార్టీ అధికారంలో లోకి వస్తుందని భట్టి విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆశించిన సామ్యవాద, ప్రగతిశీల, ప్రజాస్వామ్య తెలంగాణ, కేసీఆర్ చేతిలో బందీ అయిందని చెప్పారు. పొరుగు రాష్ట్రం, కేంద్రంలో భాగస్వామిగా ఉన్న పార్టీ నేతలు.. తమ హక్కుల కోసం ఉద్యమాలు చేస్తుంటే.. ఈ ప్రాంత నాయకులు బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు.

గట్టిగా గాలి వస్తే కేసీఆర్ ఎగిరిపోతాడు : షబ్బీర్‌అలీ

గట్టిగా గాలి వస్తే ఎగిరిపోయే కేసీఆర్ తెలంగాణ తెచ్చాను అని చెప్పుకుంటున్నారని శాసనమండలిలో కాంగ్రెస్‌పార్టీ పక్ష నేత షబ్బీర్‌అలీ ఎద్దేవా చేశారు. నిన్న మొన్న అమెరికాలో ఉంది వచ్చిన కేటీఆర్ మేమంటేనే తెలంగాణ అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చింది సోనియాగాంధీ అని తెలిపారు. సచివాలయం బాగాలేదు అని అమెరికా వాళ్ళు అన్నారని కొత్తది కడతా అంటున్నాడు కేసీఆర్, మరి కేసీఆర్ నీ ముక్కు బాగాలేదు అంటే ముక్కు కోసుకుంటావా అని వ్యాఖ్యానించారు. ఆంధ్ర కాలేజీ లను కేసీఆర్ కుటుంబం కొనుగోలు చేసిందన్నారు. కల్వకుంట చంద్రశేఖర్‌రావు కాదు అని కడుపునిండిన చంద్రశేఖర్‌రావు అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. దేశంలో దౌర్భాగ్య సీఎం ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క కేసీఆర్ అని చెప్పారు. రానున్న రోజుల్లో సబితను హోమ్ మినిస్టర్ చేసేలా ప్రజలు తీర్పు ఇవ్వాల న్నారు. లంచం అడిగితే చెప్పుతో కొట్టండని అంటున్నారని, కానీ రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతే ఉందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. రైతు సమన్వయ సమితుల పేరుతో కేసీఆర్ కొత్త నాటకం చేస్తున్నారని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. మోసకాని కేసీఆర్ అని చెప్పారు.

కబడ్డీ ఆడుతుంటే... మనం క్యారమ్ ఆడితే ఎలా? : రేవంత్‌రెడ్డి

ఎదుటోడు కబడ్డీ ఆడుతుంటే, మనం క్యారమ్స్ ఆడుతూ కూర్చుంటే ప్రజల నమ్మరని, కుస్తీ పడుతుంటే మనం కూచిపూడి ఆడితే సరిపోదు అని కాంగ్రెస్‌పార్టీ నేత రేవంత్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వంపై యుద్ధం చేయాలన్నారు. కాంగ్రెస్‌ను అడ్డగోలుగా నిందిస్తే ఊరుకో వద్దని, తొడగొడితే, మనము దౌడ పడగొట్టాలన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిగా మారాలన్నారు. నాడు కాంగ్రెస్ పాలనకు నాంది పలికినట్లే ..ఇప్పుడు ఈ చేవెళ్ల గడ్డ నుండి కేసీఆర్ పాలనకు అంతం పలకాలన్నారు. ఈ పోరాటంలో కార్యకర్తల్లో ఒక్కడిగా...పార్టీ సీనియర్ల అండ దండల్లో టీఆర్ఎస్ పాలనపై యుద్ధం చేయాలని కోరారు.

సెన్సెక్స్ ▲303	నిఫ్టీ ▲92	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
34,445	10,582	64.79	రూ. 30,549	రూ. 41,600





కోడిగుడ్లు			
హైదరాబాద్	358	విజయవాడ	348
ఒక్కగుడ్డుకు	4.15	చెన్నై	397
వరంగల్	357	ముంబయి	406



నోకియా నుంచి 5 కొత్త స్మార్ట్‌ఫోన్లు



బార్సిలోనా: నోకియా మాతృ సంస్థ హెచ్‌ఎండీ గ్లోబల్ తన పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించనుంది. బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2018(ఎండబ్ల్యూసీ) వేదికగా ఆ సంస్థ కొత్తగా అయిదు హ్యాండ్‌సెట్లను ఆవిష్కరించింది. నోకియా 8 సిరొక్కో, నోకియా 7 ప్లస్, నోకియా 6 (కొత్త వేరియంట్), నోకియా 1, పునరుద్ధరించిన నోకియా 8110లను ఇక్కడ ఆవిష్కరించింది. నోకియా ఐకానిక్ మోడల్ 8110ను 4జీ కనెక్టివిటీతో పాటు గూగుల్ అసిస్టెంట్, గూగుల్ మ్యాప్స్, గూగుల్ సెర్చ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి యాప్స్‌తో కంపెనీ ఆవిష్కరించింది. పన్నులు, ఇతర సబ్సిడీలను మినహాయించి నోకియా ఐకానిక్ మోడల్ అయిన 8110 ధరను హెచ్‌ఎండీ గ్లోబల్ 79 యూరోలుగా నిర్ణయించింది. మే నుంచి ఈ ఫోన్ అందుబాటులోకి రానుందని కంపెనీ తెలిపింది. నోకియా 8 సిరొక్కో, నోకియా 7 ప్లస్, కొత్త నోకియా 6లు ఆండ్రాయిడ్ వన్ ఫ్యామిలీలో చేరాయని, గూగుల్ డిజైన్ చేసిన హై క్వాలిటీ సాఫ్ట్‌వేర్ అనుభవాన్ని వీటిలో తాము అందించినట్టు కంపెనీ పేర్కొంది. నోకియా 8 సిరొక్కో స్మార్ట్‌ఫోన్ ధర 749 యూరోలుగా కంపెనీ నిర్ణయించింది. అంటే భారత కరెన్సీ ప్రకారం ఇది సుమారు రూ.60వేల వరకు ధర పలుకనుంది. ఏప్రిల్ ప్రారంభం నుంచి నోకియా 8 సిరొక్కో స్మార్ట్‌ఫోన్ సేల్ మొదలు కానుంది.

రాణించిన దేశీయ స్టాక్ మార్కెట్లు ..



ముంబయి: అంతర్జాతీయ సానుకూల తలకు తోడు దేశీయ మార్కెట్లలో అనుకూలత ధోరణి కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం దాదాపు ఒక్క శాతం మేర ర్యాలీని నమోదు చేశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ దాదాపు 304 పాయింట్ల మేర రాణించి 34,446 పాయింట్ల వద్ద ముగిసింది. మరోవైపు ఎన్‌ఎస్‌ఈ సూచీ నిఫ్టీ 92 పాయింట్ల మేర పెరిగి 10,583 పాయింట్ల వద్ద స్థిరపడింది. రంగాల వారీగా చూస్తే స్థిరాస్తి సూచీ అత్యధికంగా 3 శాతం, ఆటోమొబైల్ సూచీ 2% మేర పెరిగాయి. మేటిగా రాణించిన సూచీల్లో యంత్రపరికరాల రంగం, బ్యాంక్స్, ఆర్థిక సేవలు, చమురు సహజ వాయువు, ఐటీ టెక్నాలజీ రంగాలు ఉన్నాయి. మారుతీ సుజుకీ స్టాక్ అత్యధికంగా 3.41 శాతం, టాటా మోటార్స్ 3.22 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.94 శాతం, ఎల్ అండ్ టీ 2.83 శాతం, యాక్సిస్ బాయంక్ 2.41 శాతం, ఎం అండ్ ఎం 2.27%, మేర పెరిగింది. శుక్రవారం అమెరికా మార్కెట్లు దాదాపు 1.39 శాతం మేర ర్యాలీని నమోదు చేసి ముగియడంతో.. సోమవారం ఆసియా మార్కెట్లు లాభాలతో మొదలయ్యాయి. జపాన్ నిక్కీ 1.3 శాతం చైనా మార్కెట్లు 0.7 శాతం మేర ర్యాలీని నమోదు చేశాయి. ఈ నేపథ్యంలో మొదలైన భారతీయ మార్కెట్లు కూడా సానుకూలతల నడుమ మంచి ర్యాలీని నమోదు చూస్తూ దూసుకుపోయాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

'క్విట్' ఇండియన్లకు చెక్!

- తెరపైకి 'ఫ్యుజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్' బిల్లు
- ఇక ఎల్లలుదాటిన ఎగవేతదారుల ఆస్తుల విక్రయం
- వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో సభ ముందుకు
- నీరవ్ మోడీ, మాల్యా లాంటి మోసాలకు తెర!

న్యూఢిల్లీ: దేశంలో తీవ్ర ఆర్థిక అక్రమాలకు పాల్పడి 'క్విట్ ఇండియా' అంటూ విదేశాలకు పారిపోతున్న బడాబాబుల సంఖ్య పెరుగుతున్న వేళ సర్కారు అప్రమత్తమైంది. కోట్లకు కోట్లు బ్యాంకుల నుంచి రుణాలను స్వీకరించి వాటిని సకాలంలో చెల్లించకుండా విదేశాలకు తరలిపోతున్న వారికి చెక్‌పెట్టేలా సర్కారు త్వరలో సరికొత్త చట్టాన్ని తీసుకురానుంది. 'ది ఫ్యుజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్' పేరుతో త్వరలో చట్టసభల్లో ఈ కొత్త 'బిల్లు'ను పెట్టనుంది. ఈ చట్టం నీరవ్ మోదీ, విజయ్ మాల్యా లాంటి వారు బ్యాంకులకు, ఆర్థిక సంస్థలకుకన్నం వేసి విదేశాలకు పారిపోయినా.. వారికి దేశంలో ఉన్న ఆస్తులను అమ్మేందుకు వీలు కలిగించనునంది. స్పెషల్ కోర్టు ద్వారా అన్ని బకాయిలను వెంటనే రికవరీ చేసుకునేలా ఈ బిల్లు తోడ్పడనుంది. విదేశాలకు పారిపోయినప్పటికి కచ్చితంగా ఇక్కడ వారి పేర్లపై ఉన్న అన్ని ఆస్తులను విక్రయించే అధికారం దక్కించుకునేలా.. ఈ బిల్లు వెసులుబాటు కలిగించనుందని అధికారులు చెబుతున్నారు.

'ఫ్యుజిటివ్ ఎకనామిక్ అఫెండర్ 'అంటే..

ఆర్థిక నేరం లేదా ఆర్థిక మోసం కింద ఏ వ్యక్తి పైనైనా అరెస్ట్ వారెంట్ జారీ అయి, అతను క్రిమినల్ ప్రాసిక్యూషన్ తప్పించుకోవడానికి భారత్‌ను వీడి వెళ్లితే అతణ్ని ఫ్యుజిటివ్ ఎకనామిక్ అఫెండర్‌గా గుర్తిస్తారు. ఈ బిల్లులో పేర్కొన్న నేరాల్లో ఉద్దేశ్యపూర్వకంగా రుణ ఎగవేతదారులు, మోసం చేసిన వారు, ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు, తప్పుడు ఎలక్ట్రానిక్ రికార్డులు, తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించడం, సుంకాలు ఎగవేత, రుణాల రూపంలో కాకుండా ఇతర రూపాల్లో తీసుకున్న సొమ్ములనుతిరిగి చెల్లించని వారిని 'ఫ్యుజిటివ్ ఎకనామిక్ అఫెండర్'గా ఈ చట్టంలో పేర్కొన్నారు.



పరువు నిలుపుకొనేందుకేనా...

గత సెప్టెంబర్‌లోనే ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ ముసాయిదా బిల్లుకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఇప్పటికే తన సమ్మతి తెలిపింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో (పీఎన్‌బీ) సహా పలు బ్యాంకుల్లో రోజుకో ఆర్థిక మోసం వెలుగు చూస్తున్న ప్రస్తుత తరణంలో దేశాన్ని కాపాడుకొనేందుకు సర్కారు తనవంతు కృషి చేస్తోందని ప్రజల్లో విశ్వాసం కలిగించేందుకు గాను మోడీ సర్కారు ఈ బిల్లును తెరపైకి తెస్తున్నట్టుగా సమాచారం. మార్చి 6 నుంచి జరగనున్న తదుపరి బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు అధికారులు ముందస్తు కసరత్తు మొదలు పెట్టారు.

ఒక్కసారి ఈ బిల్లు చట్టరూపం దాల్చితే దేశాలకు పారిపోయిన రుణ ఎగవేతదారులు, బ్యాంకులకు మోసాలకు పాల్పడిన ఆర్థిక నేరగాళ్ల ఆస్తులను ఎలాంటి దాడులు చేయకుండానే దర్యాప్తు సంస్థలు స్వాధీనం చేసుకోవచ్చు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, ఫైనాన్సియల్ ఇంటెలిజెన్స్ యూనిట్‌లు ఈ చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. అసాధారణ లావాదేవీలను గుర్తించి, అథారిటీలకు అలర్ట్ చేయాల్సిన బాధ్యత కూడా బ్యాంకింగ్ రెగ్యులేటర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌దే. ఎగవేత కంపెనీల వ్యాపార నమూనాల మార్పులపై ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలి. అంతేకాక ఎగవేత కంపెనీ ప్రమోటర్లపై చర్యలు మాత్రమే కాక, వారి విదేశీ ప్రయాణాలను నిలువరించేలా కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

ఓబీసీలో రూ.110 కోట్ల మోసం!

- శింభోలీ షుగర్స్‌పై సీబీఐ కేసు
- కీలక నిందితుడు పంజాబ్ సీఎం అల్లుడు గురుపాల్ సింగ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ బ్యాంకుల్లో మోసాలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ప్రభుత్వ రంగ బ్యాంకు ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌కు (ఓబీసీ) రుణాల ఎగవేతకు సంబంధించి సీబీఐ మరో కేసును నమోదు చేసింది. ప్రయివేటు చక్కెర ఉత్పాదక సంస్థ శింబోలీ షుగర్స్ ఓబీసీకి రూ.110కోట్ల మేర రుణాలు ఎగవేసిన కేసు విషయమై సీబీఐ ఈ కేసును నమోదు చేసింది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన శింభోలీ షుగర్స్ తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే విషయంలో విఫలంకావడంతో ఓబీసీ బ్యాంక్ సీబీఐకి ఫిర్యాదు చేసింది. ఈ కేసులో పంజాబ్ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్ కుమార్తె జై ఇందర్ సింగ్ భర్త గురుపాల్ సింగ్ కీలక నిందితుడుగా ఉన్నారు. కంపెనీ డిప్యూటీ డైరెక్టర్లలో ఒకరైన గురుపాల్ సింగ్, శింభోలీ సీఎండీ, సీఈవో, సీఎఫ్‌వో సహా మొత్తం 13మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. మొత్తం ఎనిమిది కంపెనీల్లో గురుపాల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా ఉన్నట్టు తెలుస్తోంది.



2011 లో చక్కెర రైతులు 5700 మందికి సహాయం చేసే ఉద్దేశంతో ఆర్‌బీఐ పథకం కింద రూ.150కోట్ల మేర రుణం మంజూరైంది. అయితే ఈ మొత్తం రైతులకు పంపిణీ చేయకుండా అక్రమార్గాల్లో కంపెనీ అకౌంట్‌లో మళ్లించారనేది సీబీఐ ప్రధాన ఆరోపణ. శింభోలీ సిబ్బందితోపాటు బ్యాంక్ అధికారులు కొందరిపై సైతం కేసు రిజిస్టర్ అయింది. ఈ వార్తలతో శింబోలి షుగర్స్ షేరు 15 శాతానికి పైగా కుప్పకూలింది. ఈ కేసుకు సంబంధించి ఢిల్లీ, హపూర్, నోయిడాలలో కంపెనీల డైరెక్టర్ల నివాసాలు, ఫ్యాక్టరీ, కార్పొరేట్ ఆఫీస్, రిజిస్ట్రేషన్ ఆఫీసు సహా ఎనిమిది చోట్ల విచారణ సంస్థ సోదాలు నిర్వహించినట్టుగా సీబీఐ వెల్లడించింది. నిందితులపై నేరపూరిత కుట్ర, మోసం అవినీతి నిరోధక చట్టంకింత కేసు నమోదు చేసినట్టుగా వివరించింది. తొలత రూ.97.85 కోట్లుగా నమోదైన రుణ ఏగవేతను బ్యాంక్ అప్పట్లోనే నిరర్థక ఆస్తిగా ప్రకటించింది. అయితే దీనిని తీర్చేందుకు గాను అదే బ్యాంకు నుంచి జనవరి 28, 2015 లో రూ.110కోట్ల మరో కార్పొరేట్ రుణాన్ని మంజూరు చేసింది. ఇప్పుడు ఈ లోన్ సమస్యాత్మకంగా తయారైంది. అయితే ఈ మొత్తాన్ని 2016 నవంబరులో నిరర్థక ఆస్తిగా ప్రకటించింది. దీనికి తోడు 2017 నవంబరు 17న బ్యాంకు సీబీఐకి ఫిర్యాదు చేయగా ఈ ఏడాది ఫిబ్రవరి 22న కేసు నమోదు చేయడం గమనార్హం.

మార్కెట్లోకి గెలాక్సీ 9 వచ్చేసింది..



బార్సిలోనా: ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ స్మార్ట్‌ఫోన్ల విభాగంలో రెండు సరికొత్త ఫోన్లను ఆవిష్కరించింది. గెలాక్సీ ఎస్ 9, ఎస్ 9 ప్లస్‌ను ఫిబ్రవరి 25 ఆదివారం, లాంచ్ చేసింది. స్పెయిన్, బార్సె లోనాలో మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ (ఎండ బ్ల్యూసీ) 2018 ప్రారంభానికి ఒక్క రోజు ముందు ఈ స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించడం విశేషం. ఈ ఫోన్ల ముందస్తు బుకింగ్‌లు మార్చి 2 నుంచి మొదలవుతాయని.. 16 నుంచి ఈ ఫోన్ల విక్రయాలకు శ్రీకారం చట్టనున్నట్టుగా కంపెనీ తెలిపింది. ఈ ఫోన్లలో అత్యాధునిక కెమేరాలను అందిస్తున్నట్టుగా కంపెనీ వర్గాలు తెలిపాయి. కెమెరాలను మెరుగు పర్చడంతో పాటు ఎస్9 ప్లస్‌లో ద్వంద్వ రియర్ కెమెరాలను, అలాగే ఫేస్ రికగ్నిషన్, ఎఆర్ (అగ్‌మెంటెట్ రియాలిటీ) ఎమోజీ ఫీచర్‌ను జోడించినట్టుగా శాంసంగ్ వెల్లడించింది. రెండు హ్యాండ్ సెట్లు మిడ్ నైట్ బ్లాక్, కోరల్ బ్లూ, లిలాక్ పర్పుల్ టైటానియం గ్రే రంగుల్లో అందుబాటులో ఉండనున్నాయి. గెలాక్సీ ఎస్9 ధర సుమారు రూ .46,600, ఎస్9 ప్లస్ ధర సుమారు రూ .54,400గా ఉండే అవకాశం ఉంది. అలాడే రెండు స్మార్ట్‌ఫోన్లలోనూ ఇన్‌ఫినిటీ డిస్‌ప్లే, డాల్బీ సరౌండ్ స్టీరియో సౌండ్ స్పీకర్లు అమర్చింది.

సీఎం స్పందించాలి

- బొగ్గు గనుల ప్రయివేటీకరణ, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బొగ్గు గనుల ప్రయివేటీకరణ, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలం తరువాత సింగరేణి కార్మికుల సమస్యలు తెలుసుకోవడానికి కోల్‌బెల్ట్ ప్రాంతంలో పర్యటించడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. బొగ్గు గనులు ప్రయివేటు సంస్థలు, వ్యక్తులకు అప్పగిస్తామని కేంద్రం ప్రకటించిందన్నారు. ప్రయివేటుకు బదలాయిస్తే దేశం సంపద లూటీ కావడమేగాక సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సింగరేణిలో 15 వేల మంది కాంట్రాక్టు కార్మికులు బోనస్, కోలిండియా వేతనాలు, పర్మినెంట్, సమానపనికి సమాన వేతనం తదితర సమస్యలపై అనేక ఏండ్లుగా ఆందోళన చేస్తున్నారని గుర్తు చేశారు. ఈవిషయమై టీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ప్రయివేటు బొగ్గు గనులకు వ్యతిరేకంగా ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. 2017 జనవరిలో అసెంబ్లీలో సింగరేణిపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులే లేరని తప్పుడు ప్రకటన చేశారని వివరించారు. 2014 ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామన్నారు. నేటికా ఈ సమస్యను పరిష్కరించలేదని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ పర్యటనలో ప్రయివేటు బొగ్గు గనులపై తన వైఖరిని ప్రకటించాలని, సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్న వాస్తవాన్ని గుర్తించి వారి సమస్యలపై పరిష్కారానికి సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు శ్రీరాంపూర్, గోదావరిఖని ప్రాంతాల్లో సింగరేణికి యాజమాన్యం సెలవు ప్రకటించిందని, కార్మికులను సభకు హాజరు కావాలని చెబుతున్నారన్నారని చెప్పారు. మరో పక్క కరీంనగర్, మంచిర్యాల తదితర ప్రాంతాల్లో సీఐటీయూ, ప్రజాసంఘాల ఆఫీసుల్లో పోలీసులు జొరబడి నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారన్నారు. ప్రజాసమస్యలను తెలుసుకోవడం కోసం వస్తున్నానని చెబుతూనే, ఇంకోపక్క అరెస్టులు చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటివకే అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసి, సీఎంకు తమ సమస్యలు చెప్పుకునేలా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కోల్‌బెల్ట్ పర్యటన నేపథ్యంలో సెలవులు ప్రకటించి ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని చెప్పారు. యాజమాన్య కార్మిక విధానాలు వెలుగులోకి రాకుండా చేస్తున్న కుట్రలో భాగమే ఈ అక్రమ అరెస్టులని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు తెలుసుకోవాలనుకుంటున్న సీఎం, ప్రశాంతవాతావరణం పర్యటించాలని సూచించాని సోమవారం విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌ల జీతాలు పెంపుదల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌ల జీతాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంవత్సరాల తర్వాత మార్జిత్ కమిటీ చైర్మన్‌ల నెల జీతాలను ప్రభుత్వం పెంచింది. సెలెక్షన్ గ్రేడ్ మార్కెట్ చైర్మెన్ నెల జీతం 2,000 నుంచి 25,000 రూపాయల పెరిగింది. స్పెషల్ గ్రేడ్ మార్కెట్ చైర్మెన్ 1,500 నుంచి 20,000 రూపాయలకు పెంచారు. గ్రేడ్ 1 మార్కెట్ కమిటీ చైర్మెన్ జీతం 1,000 నుంచి 15,000రూపాయలకు పెంచారు. గ్రేడ్ 2,3మార్కెట్ల చైర్మెన్‌లకు 500నుంచి 15,000రూపాయలకు జీతంపెరిగింది. పదహారేండ్ల తర్వాత వేతనాలు పెరగడం పట్ల చైర్మెన్‌లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కోదండరామ్ పార్టీ కాగితపు పడవ : జగదీశ్

నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

కోదండరామ్ పార్టీ కాగితపు పడవ లాంటిదని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. దాని గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం ఆయన టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే పడవ అని, ఆ పడవలో ప్రయాణం చేయలేకనే కాంగ్రెస్ నేతలు పక్క పార్టీ లోకి వస్తున్నారని చెప్పారు. తెలంగాణపై ఆ పార్టీకి ప్రేమ లేదన్నారు.

వయసు మించిపోతుండే.. కొలువు రాకపాయే

సింగరేణిలో సీఎం హామీలు బుట్టదాఖలు

- వారసత్వ ఉద్యోగాల ప్రకటనతో నిరుద్యోగుల ఆశలు గల్లంతు
- జాడేలేని కారుణ్య నియామకాలు
- రామగుండం రీజియన్ పరిధిలో 6500 ఎదురుచూపు

నవతెలంగాణ - పెద్దపల్లి ప్రతినిధి

మానాన్న పెసర్ల కొమురయ్య గోదావరిఖని ఆర్జీ-2లో కోల్‌కట్టర్. అనారోగ్యంతో రెండుసార్లు సింగరేణిలో అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్నా అధికారులు పట్టించుకోలే. సింగరేణి నోటిఫికేషన్‌తో ఫిబ్రవరిలో వారసత్వం ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వ తప్పిదంతో సుప్రీం, హైకోర్టులు నోటిఫికేషన్‌ను రద్దు చేశాయి. దీంతో ఉద్యోగ వకాశాన్ని కోల్పోయా. నాకు 34 ఏండ్లు రావటంతో సింగ రేణి సంస్థలో ఉద్యోగం వచ్చే అవకాశం లేదు. మా నాన్నకు 21 నెలల సర్వీస్ ఉన్నప్పటికీ సంస్థలో ఉద్యోగ అవకాశం లేకుండా పోయింది.

-గోదావరి ఖని విఠల్‌నగర్‌కు చెందిన పెసర్ల తిరుపతి

నాన్న(పోచమ్) ఆర్జీ-1లోని ఓసీపీ-4లో జనరల్ మజ్దూర్‌గా పనిచేసి ఈ ఏడాదే రిటైర్డ్ అయ్యాడు. నాకు 35 ఏండ్లు. వారసత్వ ఉద్యోగం వస్తుందని ఆశపడి దరఖాస్తు పెట్టుకున్న. పెండ్లి సంబంధం కూడా కుదిరింది. నోటిఫికే షన్ రద్దుతో ఉద్యోగం రాలే. పెండ్లీ క్యాన్సల్ అయింది. నాన్న ఇంటికాడ్నే ఉంటున్నడు. పెయింటింగ్ వర్క్ చేస్తూ కుటుం బాన్ని నెట్టుకొస్తున్నా.

- గోదావరి ఖనికి చెందిన మాటూరి సదానందం

వీరిద్దరే కాదు. వేలాది మంది సింగరేణిలో వారసత్వ, కారుణ్య ఉద్యోగాలొస్తాయని గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర సర్కారు కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పట్టించుకోకుండా గమ్ముగా ఉండటంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది వయస్సు దాటిపోయి...ఉద్యోగాలు రాక..పెండ్లీలు కాక నైరాశ్యంలోకి కూరుకుపోతున్నారు.

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు కల్పిస్తామని ముఖ్యమంత్రికేసీఆర్ 2016 అక్టోబర్ 6న హైదరాబాద్‌లో సింగరేణి ప్రాంతానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, మం త్రుల సమక్షంలో ప్రకటించారు. గోదావరిఖని పట్టణానికి చెందిన ఒక నిరుద్యోగి కోర్టులో పిటీషన్ వేయగా దీనిపై 2017 ఏప్రిల్ 17న సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును సమర్థిస్తూ వారసత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ చెల్లదంటూ తీర్పుని చ్చింది.

ఉద్యోగాల వస్తాయని ఆశతో ఎదురుచూసిన సింగ రేణి కార్మికుల కుటుంబాలు నోటిఫికేషన్ రద్దుతో రోడ్డున పడ్డాయి. సింగరేణి కార్మికుల పిల్లలకు వారసత్వం కింద ఉద్యోగాలు వస్తాయని సంస్థ నోటిఫికేషన్ వేయడంతో వేలా ది మంది తమ కొడుకులకు, కూతుర్లకు పెండ్లి సంబంధాలు చూసుకున్నారు. కొంతమంది పెండ్లీలు చేశారు. పట్టణాల్లో ప్రయివేటు సంస్థల్లో పని చేసే యువకులు సింగరేణిలో ఉద్యోగాల కోసం వచ్చారు. వారసత్వ ఉద్యోగాల రద్దుతో పెండ్లీలు ఆగిపోయాయి. పెండ్లి చేసుకున్న వారిలో కుటుంబ కలహాలు వస్తున్నాయి. ఉద్యోగాలు రాక కొందరు కూలీలుగా మారారు.

రామగుండం రీజియన్‌లో 3వేల మంది ఎదురుచూపు

రామగుండం రీజియన్ పరిధిలో మూడు డివిజన్లున్నాయి. వీటిలో మొత్తం సింగరేణి ఎన్నికల కంటే ముందు వరకు 18,500 మంది కార్మికులున్నారు. ఆర్జీ-1లో 6,876 మంది, ఆర్జీ-2లో 5,652 మంది, ఆర్జీ-3లో 5,368 మంది కార్మికులుండేవారు. ఎన్నికల తర్వాత ఇప్పటి వరకు 14, 786 మంది తగ్గారు. నెలలో 200 మంది వరకు ఉద్యోగ విరమణ పొందారు. ఈ ప్రకారం ప్రస్తుతం ఆర్జీ-1లో 6,550 మంది, ఆర్జీ-2లో 4,222 మంది, ఆర్జీ-3లో 2,470 మంది పని చేస్తున్నారు. రామగుండం రీజియన్ పరిధిలో మొదట్లో మొత్తం 6,500 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఆర్జీ-1లో 2,200 మంది, ఆర్జీ-2లో 2,500, ఆర్జీ-3లో 18,00 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వీరికి సంబంధించిన తండ్రులు 3,500 మంది ఉద్యోగ విరమణ పొందారు. ఇంకా మూడు వేల మంది ఉద్యోగ విరమణకు ఉన్నారు. మిలిగిన ప్రస్తుతం పని చేస్తున్న కార్మికుల పిల్లలు వారసత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు.



జాడేలేని కారుణ్య నియామకాలు

సింగరేణిలో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల సంద ర్భంగా టీఆర్‌ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్‌ను గెలి పించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి హామీలి చ్చారు. వారసత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ కావడంతో బదు లుగా కారుణ్య నియామకాలు చేపడతామని ప్రకటించారు. సింగరేణిలో సాంకేతికపరమైన పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వేశారు. కార్మికులకు ఇండ్లు కట్టుకునేందుకు రూ.10 లక్షల రుణాలు, మారు పేర్ల రద్దు ప్రకటనను అమలు చేయలేదు. ఎన్నికలు జరిగిన ప్రస్తుతం ఐదు నెలలవుతున్నా ఒక్క హమీ కూడా అమలు చేయట్లేదు. కారుణ్య నియామకాలకు సంబం ధించి సర్క్యులర్ జారీ చేయట్లేదు.

వారసత్వ ఉద్యోగాల భర్తీ చేయాలి

ప్రభుత్వ ప్రకటనపై అనేక మంది కార్మికుల పిల్లలు వారసత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకుని మోసపో యారు. ప్రభుత్వం కారుణ్య నియామకాలు భర్తీ చేస్తామని ప్రకటన చేసి ఇప్పటివరకు సర్క్యులర్ జారీ చేయలేదు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వారసత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి.



- సింగరేణి డిపెండెంట్ యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు శ్రీనివాస్

ఎన్నికలు హామీలు అమలు చేయాలి

సింగరేణి ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఇందుకోసం ఈ నెల 7 నుంచి దశల వారీగా 4 జాతీయ కార్మిక సంఘాలు సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మొదలుపెట్టాం. హామీలను అమలు చేసేంతవరకు ఆందోళన ఉధృతం చేస్తాం.

- మెండె శ్రీనివాస్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(ఎస్‌సీఈయూ) రాష్ట్ర ప్రచార కార్యదర్శి


ప్రజాస్వామిక తెలంగాణ కోసం ఉద్యమం

- ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, ఖాసీం, సుజాత

నవతెలంగాణ-పెద్దపల్లి

ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడుతామని హెచ్‌సీయూ, ఉస్మానియా, ఎస్‌యూ ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, ఖాసీం, సుజాత అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంల సోమవారం జరిగిన తెలంగాణ విద్యార్థి సంఘం(టీవీఎస్) రాష్ట్ర మూడో మహాసభలో ప్రొఫెసర్లు మాట్లాడారు. తెలంగాణలో దొరల, గడీల పాలన నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక హక్కుల కోసం బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఏకమై ఆ పాలనకు చరమగీతం పాడాలన్నారు. తెలంగాణలో గతం కంటే నిర్బంధాలు పెరిగాయన్నారు. ప్రజాస్వామ్యంలో సభలు, సమావేశాలు జరుపుకునే హక్కును తెలంగాణ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ఆంధ్రా పాలక, కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. టీఆర్‌ఎస్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేజీ టూ పీజీవిద్య, దళితులకు మూడెకరాల భూమి నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు వంటి పథకాల్లో ఇప్పటికీ పురోగతి లేదన్నారు. శాస్త్రీయ విద్యావిధానానికి ప్రభుత్వం ఏనాడో తిలోదకాలిచ్చిందన్నారు. బీజేపీ, టీఆర్‌ఎస్ కలిసి విశ్వవిద్యాలయాలు, విద్యాలయాల్లో కాషాయ రంగును పులిమేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో హిందూ మతోన్మాద శక్తులు చొరబడి విద్యను ఛిన్నాభిన్నం చేస్తున్నాయన్నారు.





సంస్కృతి పరిణామం చెందుతుందా?

సంస్కృతిని వివరించడానికి చాలామంది పరిణామ భావాన్ని అనువర్తింపజేశారు. సంస్కృతి స్తబ్దం కాదు. పరిణామాత్మకం. పరివర్తన పరిణామాంతర్గతం. ప్రతి పరివర్తన పరిణామం కాదు. పేకముక్కలను కలిపినప్పుడల్లా 'అమరిక' మారుతూ ఉంటుంది. ఆ మార్పును పరిణామం అని ఎవరూ అనరు. పరిణామానికి వేగం, దిశ, పరివర్తన, క్రమత, ప్రగతి, పరిపూర్ణత లక్షణాలు ఉండాలి. అయితే ఈ లక్షణాలు అన్నీ పరిణామానికి ఉన్నాయని అందరూ ఒప్పుకోరు. ఉదాహరణకు పరిణామానికి ప్రగతి, క్రమత, పరిపూర్ణతలు ఉన్నాయని చాలా మంది ఒప్పుకుంటారు.

అసలు ఈ మహా విశ్వావతరణమే ఒక పెద్ద పరిణామం. అందులో భూమి, నిర్జీవ పదార్థం నుంచి జీవ పదార్థం అవతరించడం మరొక గొప్ప పరిణామ దశ. ఆ తరువాత సంస్కృతి అవతరించడం మరొక మెట్టు.

చాలామంది మేధావులు 'సంస్కృతి' అంతకు ముందు ఉన్న ప్రాచీన రూపాల నుంచి పరిణామం చెందిందని చెబుతారు. సాంస్కృతిక పరిణామాన్ని గురించి విశేష చర్చ జరిపిన వారిలో టుర్గోట్, మాంటెస్క్యూ, రూసో, కాంట్, హెగెల్, హ్యూమ్, హాబ్స్, ఫెర్గుసన్‌లు ముఖ్యులు. వీరి ప్రభావం సంస్కృతి పరిణామ సిద్ధాంతం మీద ఎక్కువగా పడింది. వీరంతా 'ప్రగతి పరిణామాన్ని అంటిపెట్టుకున్నవారే'.

వీరంతా గతంలో ప్రగతి ఉన్నదని ఒప్పుకుంటారు. కానీ భవిష్యత్తులోను ప్రగతి ఉంటుందంటే వీరిలో కొందరు ఒప్పుకోరు. కాంట్, టుర్గాట్‌లకు మాత్రం ప్రగతి అనివార్యం.

ఇక్కడ పరిణామాన్ని గురించి కొన్ని ప్రశ్నలు వేయక తప్పదు. అందులో ఒకటి పరిణామం చెందేది ఏది?ఏ పద్ధతిలో అది పరిణామం చెందుతుంది? అది అనివార్యంగా పరిణమిస్తుందా? హేతుబద్ధత, ఆలోచన ద్వారానా? ఉద్దేశపూర్వకంగానా? యోగ్యజీవి నిలుస్తుంది (సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్) అనే పద్ధతిలోనా? నిర్దిష్ట దశలోనా? క్రమ పద్ధతిలోనా?అచేతన గతితార్కిక పద్ధతిలోనా?– ఏ పద్ధతిలో పరిణామం చెందుతుంది. మూడు, పరిణామ కారణం దేనిలో ఉంది? సాంకేతికాభివృద్ధిలోనా? భౌతికాభివృద్ధిలోనా? ఆదర్శాలలోనా? విశ్వశక్తిలోనా?– ఈ ప్రశ్నలకు సమాధానాలు వివిధ వర్గాల వారు వివిధంగా చెప్పారు. ఏ రెండు వర్గాల మధ్య ఏకాభిప్రాయం లేదు. వీటికి క్లుప్తంగా సమాధానాలు ఇచ్చే ప్రయత్నం చేయవచ్చు.






పరిణామం చెందేది ఏమిటన్న ప్రశ్నకు సమాధానంగా సంస్కృతిలోని స్వతంత్ర విషయాలైన వ్యక్తులు, సమూహాలు, ఆర్థిక, రాజకీయ, సాంఘిక వ్యవస్థలు పరిణామం చెందుతాయని, ఇవి పరిణామం చెందినప్పుడు సంస్కృతి పరిణమించిందని చెప్పవచ్చు. ఏపద్ధతిలో పరిణామం చెందుతుందనే ప్రశ్నకు సమాధానంగా 'మానసిక పరిణామమే సంస్కృతి' అన్నారు 18వ శతాబ్ది తార్కికులు. సంస్కృతి పరిణామం 'గతితార్కిక విధానాన్ని అవలంబిస్తుం' దన్నారు మార్క్స్, ఎంగెల్స్. ఇతరులు ఇతర విధాలుగా చెప్పారు. సంస్కృతి పరిణామం ఔద్దేశికమా లేక అచేతనమా? అహేతుక ప్రక్రియల ఫలితమా? మానవుని చేతన పరిధికి వెలుపలి కారకాలు సంస్కృతి గతిని నిర్దేశించాయా? అనే ప్రశ్నలు ఈ సందర్భంగా కలుగక మానవు. సంస్కృతి పరిణామం కొంతవరకు ఔద్దేశికమని చెప్పక తప్పదు. ఎందుకంటే భావ ప్రగతిలో సంస్కృతి పరివర్తనం చెందుతుంది.భావనలు, చేతనలు సహేతుకాలు. విజ్ఞానాన్ని, శాస్త్రాన్ని చూసినా, రాజకీయ, ఆర్థిక సమస్యల పరిష్కారానికి మనం ఉద్దేశ పూర్వకంగా నిర్మించిన వ్యవస్థలను చూసినా ఈ విషయం అర్థమవుతుంది. అయితే అన్ని వేళలా ఈ వ్యవస్థలు ఆశించిన ఫలితాలు ఇచ్చాయని చెప్పలేం. ఒక సమస్యను పరిష్కరించడానికి, ఒక వ్యవస్థను నిర్మించినప్పుడు, ఆశించిన ఫలితాలతో పాటు విపరీత ఫలితాలూ రావడం సహజమే. ఈ ఫలితాలు ఊహించినవి కావు, ఉద్దేశించినవి కావు. పరిశోధకులు ఔద్దేశికంగా మరో సంస్కృతి నుంచి సంగ్రహించిన విషయాలు, యాదృచ్ఛిక సంఘటనలు, గుప్త శక్తులు, అచేతన కారకాలు–వీటిలో ఏవైనా సంస్కృతి పరిణామానికి కారకాలు కావచ్చు.

ఇక పరిణామ కారణం దేనిలో ఉందనే ప్రశ్నకు సమాధానంగా సాంకేతిక, సామాజిక వ్యవస్థలలో పరిణామ కారకం ఉందని చెప్పవచ్చు. కాని సాంకేతిక రంగంలోని పరిణామం సామాజిక వ్యవస్థలపై గాని, సామాజిక వ్యవస్థలలోని పరిణామం సాంకేతిక వ్యవస్థపైగాని ఆధారపడి ఉంటుందని మోర్గాన్ అన్నాడు. సరళత నుంచి సంక్లిష్టతకు, ఏకత్వం నుంచి భిన్నత్వానికి నడిపే 'విశ్వశక్తి' (కాస్మిక్ ఫోర్స్)లో పరిణామ కారకం ఉందన్నాడు స్పెన్సర్. దుర్క్ హైమ్ ప్రకారం అది శ్రమ విభజనలో ఉంది. మార్క్స్, ఆయన అనుయాయులు దానిని సాంకేతిక, ఆర్థిక (భౌతిక) రంగాలలో దర్శించారు.

–ఎ.వి.రెడ్డి


మహేంద్రశైలి గుహాలయాలు



పల్లవరాజైన మహేంద్రుడి కాలంలో (క్రీ.శ.580–630) తొలిచిన ఆలయాల్లో స్తంభాలున్న అగ్రమండపం, ఆ మండపం ఉన్న దిశను బట్టిఆయతనం ఉన్నాయి. మండపం ముఖం దక్షిణంగా కాని, ఉత్తరంగా కాని ఉన్నప్పుడు ఆయతనాన్ని పక్క గోడల్లోను, మండప ముఖం తూర్పు పడమరలుగా ఉన్నప్పుడు ఆయతనాన్ని మండపం వెనుక గోడలోను చెక్కేవారు. అనగా ఆయతనం తూర్పు లేదా పడమటి వైపు ఉండేటట్లు చేసేవారు. 'మండప' రకపు ఆలయాలను పోలిన ఈ గుహాలయాల లోపలి భాగం ఆ శైలికి అనుగుణంగా ఉండేవి. మహేంద్రుడు తొలిపించిన ఆలయాలలో అతని బిరుదులు, ఆలయం అంకిత వివరాలు ఇస్తున్న పద్యశాసనాలు ఉంటాయి. అలాంటివి పది ఆలయాలున్నాయి. వాటిలో తొమ్మిది; మండగ పట్టులోని త్రిమూర్తులకంకితం చేసిన లక్షితాయతనము; పల్లపరంలో పంచపాండవ గుహాలయం అనబడేది, మామండూరు 2వ గుహలోని రుద్రవలీశ్వరం, కురంగనిల్ ముట్టమ్ నందలి రాతి మండప గుహాలయం, వల్లంలోని వసంతేశ్వర ఆలయం, మహేంద్రవాడిలోని మహేంద్ర విష్ణు గృహ గుహాలయం, మా మండూరు మొదటి గుహ లోని విష్ణు గుమాలయం, దలవనూర్ లోని శత్రుమల్లేశ్వరాలయం, సియా మంగళంలోని అవని భజన పల్లవేశ్వర గృహ గుహాలయం. ఇవన్నీ కూడా పల్లవ రాజధానియైన కాంచీపురం, రేవుపట్నం అయిన మామల్లపురం పరిసరాల్లో ఉన్నాయి. దూరంగా సృష్టించిన పదవది తిరుచ్చిరాపల్లి దగ్గర కొండ మీద తొలిచిన లలితాంకుర పల్లవేశ్వర గృహము. మిగతా ఆలయాలన్నీ కింద రాతిలోనే ఉండగా ఇదొక్కటే కొండ శిఖరం మీద వుంది. విలాప్పక్కం (ఉత్తర ఆర్కాట్ జిల్లా), అరంగదవల్లూర్ (దక్షిణ ఆర్కాట్ జిల్లా)లలోని అసంపూర్ణ రాతి ఆలయాలూ శైలి రిత్యా చూస్తే మహేంద్రుడి కోవకే చెందుతాయి.

ఒకే ఒక గర్భగుడి ఉన్న మండపాలు దీర్ఘచతురస్రాకారంలో నాలుగు స్తంభాలు, కలిగి ఉంటాయి. మూడు, అయిదు, ఏడు ఆయతనాలు ఉన్న మండపాలలో నాలుగు, ఆరు, ఎనిమిది స్తంభాలు ఉంటాయి. స్తంభాలు అడుగు భాగం, పైభాగం లావుగా పొట్టిగా, చదరంగాను, మధ్యభాగం అష్టభుజా కారంలోను ఉంటాయి. .స్తంభాల పై భాగం వంపులతో, తరంగాలతో, పట్టాతో ఉంటుంది. స్తంభాల మీద ఆనుకొని ఉన్న వాసానికి 'కపోతం' లేదు. చదరంగా ఉన్న స్తంభాల మీద, చదరాలు, వాటి మీద పద్మాలు చెక్కబడి ఉంటాయి. మండపాన్ని ముఖమండపం, అర్ధమండపంగా విభజిస్తున్నట్లుగా స్తంభాలు, కుడ్య స్తంభాలు ఉంటాయి. స్తంభాలు లేనిచోట్ల ఈ విభజనను చూపించడానికి ఎత్తులతో వ్యత్యాసం చూపించారు. మండపం నుంచి మూడు మెట్లెక్కితే ఆయతన ద్వారం వస్తుంది. మండపంలోకి చొచ్చుకు వచ్చినట్లున్న ఈ ద్వారం నిరాడంబరంగా ఉంటుంది. ఆ ఆయతనం (గర్భగుడి)లో 'అధిష్ఠానం' అనే పీఠం ఉంటుంది. గర్భగుడి ద్వారానికి అటు అటు ఆరేసి కుడ్యస్తంభాలు ఉంటాయి. వీటిలో రెండింటి మీదుగా ద్వారబంధం నిలిచి ఉంటుంది. కుడ్యస్తంభాల మీద 'పోతిక'లు, 'కపోతా'లు ఉంటాయి. కపోతాన్ని అర్ధ వృత్తాకారపు 'గూడు'లతో, చదునుగా ఉన్న 'స్తూపి'తో అలంకరిస్తారు.

గర్భగుడి తలుపుల మీద ద్వారపాలకుల రూపాలు చెక్కి ఉంటాయి. అన్నిటికన్నా ప్రాచీనమైనదైన త్రిమూర్తి ఆలయంలోని గర్భగుడి (ఆయతనం) అనేది వెనుక గోడలోకి తొలిచిన గూడువంటిది మాత్రమే. ఈ గుడి ద్వారపాలకుల మూర్తులను మండప ముఖద్వారమునకు ఇరుపక్కల చెక్కారు. వల్లం, మహేంద్రవాడి, మామండూరు, సియామంగళంలలో వున్నవన్నీ ఇలాంటి ఏకమూర్తి ఆలయాలే. మామండూరు లోని రుద్రవలీశ్వరం, కురంగనిల్ ముట్టిమ్ లోని కల్మండకం రాతి గుహాలయం; మండగపట్టులో వలే మూడేసి ఆయతనాలున్న ఆలయాలు, కల్మండకంలోని అర్ధ, ముఖమండపాల పక్కగోడలలోకి తొలిచిన నాలుగు అదనపు గర్భ గృహాలు తర్వాత చేర్చినవే. పల్లవరం గుహాలయంలో ఐదు, విళాప్కక్కంలోని అసంపూర్ణాలయంలో ఏడు ఆయతనాలు ఉన్నాయి. ఇదేవిధంగా అరంగండవల్లూర్‌లో కూడా అయిదు గర్భగృహాల ఏర్పాటుకు ప్రయత్నం జరిగినట్లు తెలుస్తున్నది. ఈ ఆలయంలో నాలుగు స్తంభాలు, రెండు కుడ్య స్తంభాలు ఉన్నాయి. దీనిని బట్టి మండపాల్లోని స్తంభాల సంఖ్యకు ఆయతనాల సంఖ్యకు సంబంధం తెలుస్తున్నది. రెండేసి స్తంభాలు (కుడ్యస్తంభాలు) మధ్య ఒక ఆయతనం చొప్పున ఆరింటి మధ్య అయిదు ఆయతనాలు ఉండాలి. మహేంద్రుడి ఆలయాలలో ద్వారపాలురు మినహా మండపాలలో కూడా ఎటువంటి శిల్పాలూ కానరావు. వివిధ ఆలయాలలో వివిధ స్థానాలలో ఉండే ఈ ద్వారపాలురు కొన్ని చోట్ల చూపరులకు అభిముఖంగాను, కొన్ని చోట్ల అర్థాభిముఖంగాను, మరికొన్ని చోట్ల సర్వానృత దండాధరులుగాను దర్శనమిస్తారు. సియామంగళంలోనయితే వీరు ప్రత్యేకమైన గూళ్లలో నిలిచి ఉన్నారు. గర్భగుడికి ఎదుటి గోడ మీద బృహత్ శిల్ప సముదాయం ఉండటం తిరుచ్చిలోని లలితాంకురాలయం ప్రత్యేకత.






–శ్రీనివాస్

క్రీడాభిరామంలో జీవిత–చిత్రణ



14వ శతాబ్దం మొదటి దినాల్లో వినుకొండ వల్లభరాయడు రచించిన 'క్రీడాభిరామం' అనే ఏకాశ్వాస ప్రబంధం కాకతీయుల కాలపు సామాజిక జీవితాన్ని కండ్లకు కట్టే గొప్ప రచన. ఈ రచన నాటి కాకతీయుల రాజధాని పట్టణ జీవితాన్ని ముఖ్యంగా ప్రతిబింబిస్తుంది. ఇందులో ప్రధాన పాత్రలైన మంచన, టిట్టిభ సెట్టి ఓరుగల్లు నగరంలోకి పోతూ దారిలో వారి చూపులను ఆకట్టుకున్న దృశ్యాలు వర్ణించడం ఈ పుస్తకంలో కనిపిస్తుంది. వారికి ఎదురైన వేశ్యలు, వ్యభిచారిణుల వర్ణనలు, రసికుల మనసును దోచుకొనే ఎన్నో వర్ణనలు ఇందులో కనిపిస్తాయి.

కాసల్నాటి 'బ్రాహ్మణ శ్రేష్ఠుడు'–గోవింద మంచన శర్మ. "గన్నేరు పూజాయ నీర్కావి దోవతి గట్టి, గొజ్జంగి పూల రసంతో మేదించిన గంగమట్టితో లలాటాన నీటుగా బొట్టుపెట్టి, జరీపట్టు కండువా వల్లెవాటు వేసి, తెల్లగా మెరుస్తూన్న జన్నిడంతో, ఇంత ముచ్చట ముడితో, చిగురు పెదవులమీద చిరునవ్వు చిందులాడుతుండగా సాక్షాత్తు మన్మథుడులాగ ప్రవేశిస్తాడు, తన అనుగు చెలికాడు టిట్టిభ సెట్టితో." అంటూ కవి కథానాయకుడ్ని వర్ణించడంలోనే ఆసక్తిని రేకెత్తిస్తాడు. మంచన శర్మ వేషధారణ సమకాలిక బ్రాహ్మణ యువకుల వేషధారణను కండ్లకు కడుతున్నది. ఓరుగల్లులో జూదం పెద్ద వ్యసనంగా ఉన్న వాస్తవాన్ని కవి చెబుతాడు. జూద పద్ధతిని, దాని దుష్ఫలితాలు, పై పందాలు కాయించే దళారుల మోసకారి తనాన్ని వివరిస్తాడు.



ఏకవీర ఆరాధన

కవి వల్లభరాయడు తన ఏకాంకికలో నాటి ఓరుగల్లు వైభవాన్ని అద్భుతంగా చిత్రిం చాడు. "పెద్ద గవని (ద్వారం) వస్తూ పోతున్న ఏనుగులు, రథాలు, గుర్రాలు వగైరాలతో అతి సమ్మర్ధంగా ఉందని తన పాత్రతో చెప్పిస్తాడు. ఓరుగల్లులో పల్నాటి వీర పురుషుల సంస్మరణ చిహ్నంగా నిర్మించిన శివాలయం వీధి ఒకటుంది. అక్కడ పల్నాటి వీరచరిత్ర ద్విపద ప్రబంధాన్ని ద్రుత తాళంలో పాడుతూ, వీర గుంపి అని పిలిచే ఒక తాళవాయిద్యంపై "తక ధుం ధుం ధుం కిటాత్కర సంగతి" వాయిస్తూ ఉన్న గాయని ప్రస్తావన కనిపిస్తుంది. ఆమెకు వంతపాడుతూ గర్జిస్తూ, గంతులు వేస్తూ వీర రసానుగుణంగా అభినయిస్తున్న పురుషుల గురించి వర్ణన ఉంటుంది. అట్లాగే ఏకవీరాదేవి దేవాలయం గురించిన వివరణ ఉనిపిస్తుంది. ఏకవీర అంటే పరశురాముని తల్లి. ఆ గుడి ఎదురుగా నిలిచి ఏకతంత్రీ వాయిద్యం మీటుతూ వివిధ రాగాలలో పరశురాముని గాథలు పాడుతున్న బవనీడు, 'మద్వానద్ధ' ఘంటా వాయిద్యాలకు అనుగుణంగా కోకిల నాదంతో ఏకవీరాదేవిని స్తోత్రం చేస్తున్న ఒక మాలెత , ఏకవీరను కొలుస్తూ ఆడుతూ పాడుతూ ఉన్న మరెందరో పుస్తకంలో ప్రస్తావితమయ్యారు. ఈ ఏకాంకికలోఏడుగురు అక్కలు (యక్ష కన్యలు) చేసే ఆరాధనా నృత్య వర్ణన కనిపిస్తుంది. "సంతానార్థి అయిన ఆ ఇంటి యజమాని యక్ష కన్యల నృత్యం ఏర్పాటు చేశాడు కాబోలు! ఈ మణిభద్ర దేవతలూ, కామవల్లీ మహాలక్ష్మి మనకు ఇష్టకార్యసిద్ధి చేకూరుస్తారు" అనే మాటలు మంచన చేత అనిపించడం ద్వారా నాటి నమ్మకాలను తెలియజేస్తాడు వల్లభరాయడు.



మైలారు వీరభటులు

కాకతీయుల కాలంలో మైలారు వీరభటులకు ప్రత్యేక స్థానం ఉంది. మైలారు దేవత శివుని ప్రతి రూపం. ఈయన వేటాడేవారు ఆరాధించే దేవుడు. 'భైరవునితోడి జోడు'. ఓరుగల్లులో మైలారు దేవాలయం ఉంది. శైవావేశం గల వీరభటులు ఆ దేవాలయం ముందు కణ కణ మండే చంద్రమల్లెల (నిప్పుల) గుండాల లోంచి నడిచిపోవటం, వాడి అలుగులు పాతిన పెద్ద పాతరల్లో పైనుంచి ఉట్టి చేరులు పట్టుకొని వ్రేలాడుతూ ఉవ్వెత్తుగా దూకటం, గండ కత్తెరలు మింగటం, నారసాలు పొడుచుకోవటం, అరచేతులతోనే కర్పూర హారతు లివ్వటం వంటి సాహస కృత్యాలు చేస్తూ ఉంటారు. వారిని మైలార వీరభటులంటారని చెబుతాడు మంచన. మైలారుదేవుని ఉత్సవంలో సాగే నృత్యంలో మద్యం సేవించి నర్తకులు "ఆకరో! యమ్మకిరో! యమక్కరో! యదీ! యట్టట్టకో!" అంటూ గట్టిగా అరుస్తూ తప్పెట్లు, తళ్లె తాళాలు 'ఇంపుసొంపు రంపిల్లగా,' ఒక జుంజుం జత జంజు జుమ్మనుచున్" వాయిద్యాలు మ్రోగు తుండగా అత్యావేశంతో ఆడే దృశ్యం వర్ణితమయింది.

ఒక గొరగ పడుచు చేసే అద్భుత విన్యాసాలు కూడా ఈ పుస్తకంలో ఆవిష్కృత మయింది. ఒక గొరగ పడుచు అర్ధాభినయంతో కూడిన గొండ్లి (ఒక విధమైన మండలాకార నృత్యం)ఆడుతుంటుంది. ఆమె వెనక్కి మొగ్గవేసి, నీటి తొట్టిలో తల ముంచి, అడుగున ఉన్న ముంగర ముక్కున గుచ్చుకొని లేస్తుంది. నాలుక కొనతో అలవోకగా నల్లపూస పేరు గుచ్చుతుంది. ఇటువంటి అద్భుత విన్యాసాలు ఈ ఆధునిక కాలంలో సైతం అసాధ్యం అనిపిస్తుంది. అప్పట్లో మన తెలుగువారి నైపుణ్యానికి పైన పేర్కొన్న విన్యాసాలు మచ్చుకు కొన్ని మాత్రమే అని గ్రహించాలి.

(వినుకొండ వల్లభరాయ కృతం క్రీడాభిరామం ఆధారంగా...)

పంజాబ్‌కు అశ్విన్, రాయల్స్‌కు స్మిత్

- ఐపీఎల్11 సారథ్య బాధ్యతలు



ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మరికొన్ని వారాల్లో ఆరంభం కానున్న నేపథ్యంలో వివిధ ఫ్రాంఛైజీలు నాయకత్వాని సరితూగే క్రికెటర్లను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఎనిమిది ఫ్రాంఛైజీల్లో ధోని, కోహ్లి, వార్నర్, రోహిత్‌లు వరుసగా చెన్నై, బెంగళూర్, హైదరాబాద్, ముంబయి జట్లకు సారథ్యం వహించనుండగా... మిగిలిన నాల్గు ఫ్రాంఛైజీల కెప్టెన్లు ఎవరనే ఆసక్తి అభిమానుల్లో నెలకొన్నది. కింగ్స్ ఎలెవన్ పంజాబ్ స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను నాయకుడిగా ప్రకటించగా, ఆసీస్ సారథి స్టీవ్ స్మిత్‌ను కెప్టెన్‌గా రాజస్థాన్ రాయల్స్ ఎంచుకున్నది. ఆటగాళ్ల వేలంలో అశ్విన్‌ను రూ. 7.6 కోట్లకు కొనుగోలు చేసినప్పటి నుంచే పంజాబ్ సారథ్య పగ్గాలు అశ్విన్‌కు దక్కనున్నాయనే ఊహాగానాలు వినిపించాయి. అంచనాలను నిజం చేస్తూ అశ్విన్‌ను సారథిగా పంజాబ్ ప్రకటించింది. ఐపీఎల్‌లో,



అంతర్జాతీయ సర్క్యూట్‌లో కెప్టెన్సీ వహించిన అనుభవం అశ్విన్‌కు లేదు. కానీ దేశవాళీలో తమిళనాడు జట్టుకు పలు టోర్నీల్లో కెప్టెన్సీ వహించాడు. మైదానంలో ఊహకందని ఫీల్డింగ్ కూర్పు, తెలివైన మార్పులతో ప్రత్యర్థిని ఆశ్చర్యానికి గురిచేస్తాడని అశ్విన్‌కు పేరుంది. ఐపీఎల్‌లో ధోని సారథ్యంలో కాకుండా లేక ధోని లేని జట్టులో ఆడనుండటం అశ్విన్‌కు ఇదే ప్రథమం. దీంతో అశ్విన్ నాయకత్వ లక్షణాలకు రానున్న సీజన్ పరీక్ష పెట్టనున్నదని చెప్పవచ్చు. ఇక ధోని ఉండగా రైజింగ్ పుణె సూపర్‌జెయింట్స్‌కు సారథ్యం వహించే అదృష్టం దక్కించుకున్న ఆటగాడు స్టీవ్ స్మిత్. గత సీజన్‌లో పుణెను ఫైనల్లోకి నడిపించిన స్మిత్.. మళ్లీ రాజస్థాన్ రాయల్స్ గూటికి చేరుకున్నాడు. మాజీ విజయ సారథి, దిగ్గజ స్పిన్నర్ షేన్ వార్న్‌ను మెంటర్‌ను ఎంచుకున్న కొద్ది రోజుల్లోనే రాయల్స్ స్మిత్‌ను సారథిగా ప్రకటించటం విశేషం.



మోర్కెల్ వీడ్కోలు

- ఆస్ట్రేలియా టెస్టు సిరీసే ఆఖరు
- క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన సఫారీ పేసర్

నవతెలంగాణ-జొహనెస్‌బర్గ్

ఆ పేసర్ భారత్‌తో టెస్టు సిరీస్‌లో అదరగొట్టాడు. సఫారీసేన ఉపఖండానికి వచ్చినప్పుడు బౌలింగ్ బృందానికి నాయకత్వం వహించాడు. 2015 ప్రపంచకప్‌లో వికెట్ల వేటలో ముందున్న అతడు.. 2019 మిషన్‌లోనూ కీలక ఆటగాడే!. కానీ కుటుంబ బాధ్యతల కోసం అంతర్జాతీయ క్రికెట్‌ను వదులుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఆస్ట్రేలియాతో టెస్టు సిరీసే కెరీర్‌లో ఆఖరని మోర్నీ మోర్కెల్ ప్రకటించాడు. 33 ఏండ్ల వయసులో మోర్కెల్ గుడ్ బై చెప్పేశాడు. ఏప్రిల్ తర్వాత మైదానంలో మోర్కెల్ మెరుపులు ఇక చరిత్రే!.

'ఇది ఎంతో కఠినమైన నిర్ణయం. కొత్త ఇన్నింగ్స్ ఆరంభించేందుకు ఇది సరైన సమయం. నాకు విదేశీ భార్య, కుర్ర కుటుంబం ఉంది. ప్రస్తుత అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్ ఎంతో క్లిష్టమైనది. సానుకూలంగా ముందుకెళ్లేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని మోర్నీ మోర్కెల్ ప్రకటించాడు. మార్చి 1 నుంచి డర్బన్ వేదికగా ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ ఆరంభం కానున్నది. ఆఖరు టెస్టు జొహనెస్‌బర్గ్‌లో ఏప్రిల్ 3న ముగియనున్నది. కెరీర్‌లో 83 టెస్టులాడిన మోర్కెల్ 294 వికెట్లు కూల్చాడు. కంగారూలతో నాల్గు టెస్టుల్లోనూ పాల్గొనటం ఖాయమే కావటంతో 300 వికెట్ల క్లబ్‌లో చేరటం లాంఛనమే అని చెప్పవచ్చు. 117 వన్డేల్లో 188 వికెట్లు, 44 టీ20ల్లో 47 వికెట్లు మోర్కెల్ కూల్చాడు. 2006లో అరంగేట్రం చేసిన నాటి నుంచి దక్షిణాఫ్రికా జట్టులో మోర్కెల్ కీలక ఆటగాడు. ముఖ్యంగా 2009లో దిగ్గజ పేసర్ ఎన్తిని రిటైర్మెంట్ తర్వాత సఫారీ జట్టులో మోర్కెల్ ప్రాధాన్యత మరింత పెరిగింది. డెల్ స్టెయిన్, వెర్నన్ ఫిలాండర్ లేని వేళ సఫారీ బౌలింగ్ బృందానికి నాయకత్వం వహించిన మోర్కెల్.. 2019 ప్రపంచకప్‌కు ముందే వైదొలగటం కాస్త ఆశ్చర్యానికి గురి చేసినా, కుటుంబ ప్రాధాన్యతలు అతడిని అటు వైపు నడిపించింది.



హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాట్స్ జిమ్నాస్టిక్ కోచ్ ఎన్ బ్రిజ్ కిషోర్‌కు రూ.2లక్షల (చెక్కు)ఆర్థిక సహాయాన్ని సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం అందజేశారు.



ఎందరు చెప్పినా.. వినలేదే?

కోచ్‌గా గ్రెగ్ చాపెల్ ఎంపికపై గంగూలీ

భారత క్రికెట్‌లోనే కాదు ఆ కాలంలో ప్రపంచ క్రికెట్‌లోనే వారి జోడీ అత్యంత వివాదాస్పదం. అయితే, చాపెల్‌తో జట్టుకడితే జరగబోయేది అరాచకమేనని స్వయాన అతడి సోదరుడు చెప్పినా వినలేదని గంగూలీ తన పుస్తకంలో రాసుకున్నాడు. లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ సైతం గ్రెగ్ చాపెల్‌తో కలిసి జట్టును నడుపలేవని హెచ్చరించినా.. అతడినే తీసుకోవాలని నిర్ణయించుకున్నానని గంగూలీ పశ్చాత్తాపం చెందుతున్నాడు!

నవతెలంగాణ-కోల్‌కత

భారత క్రికెట్‌కు నిలకడగా విజయాలతో పాటు దూకుడు రక్తం ఎక్కించిన ఘనత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకే దక్కుతుంది. కెప్టెన్‌గా దేశానికి ప్రపంచకప్ అందించటంలో ఆఖరు అడుగులో తడబడినా దాదా దిగ్గజ హోదాకు ఎక్కడా ముప్పు రాలేదు. తర్వాత వచ్చిన సారథుల్లో ఎం.ఎస్ ధోని విజయాల నిలకడ పుణికిపుచ్చుకుంటే, ప్రస్తుత సారథి కోహ్లి విజయాలు.. దూకుడులను రెండు పట్టాలపై పరుగులు పెట్టిస్తున్నాడు. కోచ్ ఎంపికలో విరాట్ కోహ్లి సైతం వివాదానికి కేంద్ర బిందువుగా నిలిచినా.. అవతలి వ్యక్తి (అనిల్ కుంబ్లే) జెంటిల్‌మెన్ కావటంతో అది అక్కడితోనే ముగిసిపోయింది. కానీ 2005లో కెప్టెన్ గంగూలీ, కోచ్ గ్రెగ్ చాపెల్ కథ వేరు. ఏరి కోరి తెచ్చుకున్న విదేశీ కోచ్ ఆఖరుకు జట్టులో తన స్థానానికే ఎసరు పెట్టడంతో విస్తుపోవటం దాదా వంతైంది. ప్రపంచ క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టించిన గంగూలీ-చాపెల్ బంధంపై భారత మాజీ సారథి తన పుస్తకంలో తీరిగ్గా రాసుకున్నాడు. అప్పుడు తీసుకున్న అనాలోచిత నిర్ణయం పట్ల ఇప్పుడు పశ్చాత్తాపం వ్యక్తపరుస్తున్నాడు!.

రహస్య టూర్‌లో సహకరించాడని!

2003 ఆస్ట్రేలియా పర్యటనలో టీమ్ ఇండియా సక్సెస్ రుచి చూసింది. అయితే, ఆ పర్యటనకు ముందే కెప్టెన్ సౌరవ్ గంగూలీ కంగారు గడ్డపై రహస్య పర్యటనకు వెళ్లాడు. అక్కడి పిచ్‌లు, పరిస్థితులతో పాటు ఏ విధంగా సన్నద్ధం కావాలనే ఓ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయటంలో దాదాకు గ్రెగ్ చాపెల్ సహాయం చేశాడు. చాపెల్ క్రికెటింగ్ పరిజ్ఞానానికి గంగూలీ ముగ్ధుడయ్యాడు, చివరకు అదే అతడి కొంప ముంచుతుందని అప్పుడు తెలియలేదు. 'చాపెల్‌తో గత సంభాషణలు అతడి పట్ల సానుకూల దృక్పథాన్ని కల్పించాయి. అతడి క్రికెటింగ్ పరిజ్ఞానం అబ్బురపరిచింది. దీంతో 2004లో జాన్‌రైట్ వారసుడు ఎవరనే ఆలోచన రాగానే నాకు గుర్తొచ్చింది గ్రెగ్ చాపెల్. జీవితంలో అన్ని అనుకున్నట్టు జరుగవు. ఆస్ట్రేలియా పర్యటన వ్యూహం ప్రకారం విజయవంతం కాగా, గ్రెగ్ చాపెల్‌తో ప్రయాణం అట్టర్ ఫ్లాప్. నాయకుడిగా ఓ దేశాన్ని ఓడించిన నేను, ఆ దేశ పౌరుడిని మాత్రం జయించలేకపోయాను' అని ఏ సెంచరీ నాట్ ఎనాఫ్ అనే తన ఆత్మకథలో గంగూలీ పేర్కొన్నాడు.

ఇయాన్ చెప్పాడు

గ్రెగ్ చాపెల్ కోచ్‌గా నంబర్‌వన్ జట్టుగా భారత్ నిలుస్తుందని నేను విశ్వసించాను. అదే విషయాన్ని అప్పటి బోర్డు అధ్యక్షుడు జగన్మోహన్ దాల్మియాతో పంచుకున్నాను. కొంత మంది ఈ విషయమై నన్ను హెచ్చరించారు. నా అభిప్రాయానికి వ్యతిరేకంగా కొన్ని సూచనలు చేశారు. 'గంగూలీ ఓ సారి ఆలోచించు. అతడితో జట్టులో సమస్యలు తలెత్తుతాయి. జట్టును నడపటం కష్టమవుతుంది. అతడి గత కోచింగ్ చరిత్ర ఏమీ బాగాలేదు' అని సునీల్ గవాస్కర్ నాతో చెప్పాడు. ఇక ఓ రోజు దాల్మియా ఫోన్ చేసి అత్యవసరంగా ఇంటికి రమ్మని పిలిచాడు. అక్కడికెళితే.. గ్రెగ్ చాపెల్‌ను కోచ్‌గా తీసుకోవటం పట్ల అతడి సోదరుడు ఇయాన్ చాపెల్‌కు సైతం రెండో అభిప్రాయం ఉంది. భారత క్రికెట్‌కు గ్రెగ్ సరైన వ్యక్తి కాదని ఇయాన్ సూచించాడని విశ్వసనీయ సమాచారం దాల్మియా నాతో పంచుకున్నాడు. కానీ నేను వీటన్నింటిని లెక్క చేయలేదు. నా అభిప్రాయం ప్రకారమే ముందుకెళ్లాను. కోచ్‌గా గ్రెగ్ చాపెల్‌నే కోరుకున్నాను. తర్వాత జరిగింది అందరికీ తెలిసిన చరిత్రేనని దాదా రాసుకొచ్చాడు.

ఎవ్వరికీ జరుగలేదు

భారత క్రికెట్‌లో ఏ కెప్టెన్‌కూ జరుగని అవమానం నాకు ఎదురైంది. 2005 ఏడాది నా జీవితంలో అత్యంత కష్టమైన అధ్యాయం. కారణం లేకుండా సారథ్య బాధ్యతలు దూరం కావటమే కాదు ఆటగాడి జట్టులో స్థానం సైతం పోయింది. ఈ విషయాన్ని ఇప్పుడు రాస్తున్నప్పుడు కూడా ఆగ్రహం తన్నుకొస్తుంది. అప్పుడు జరిగినది ఆలోచనకు అందనిది, ఆమోదయోగ్యం కానిది, ఏమాత్రం క్షమించరానిది. విజయ సారథిని తప్పించటం చరిత్రలో ఎన్నడూ లేదు. అందునా, గత టెస్టు సిరీస్‌లో సెంచరీ సాధించినా కెప్టెన్సీ కోల్పోవటం మరీ ఆశ్చర్యకరం. ప్రత్యేకించి భారత క్రికెట్‌లో ఇటువంటి సందర్భం ఎన్నడూ లేదు. గ్రెగ్ చాపెల్, సెలక్షన్ కమిటీ ఛైర్మెన్ కిరణ్ మోరె కలిసి నన్ను అగాధంలోకి నెట్టేశారని గంగూలీ ఆత్మకథలో గోడు వెల్లబోసుకున్నాడు.

భూసేకరణ పై సుప్రీం ధర్మాసనం విచారణ

పరిహారం చెల్లింపులపై భిన్నమైన తీర్పులివ్వడంతో..

- ఉత్తర్వులు వచ్చే వరకూ ఇటువంటి కేసులను చేపట్టవద్దంటూ హైకోర్టులకు సుప్రీం సూచన

న్యూఢిల్లీ: భూసేకరణ విషయంలో వేర్వేరు ధర్మాసనాలు పరస్పర విరుద్ధమైన తీర్పులివ్వడంతో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టనున్నట్టు సుప్రీంకోర్టు వెల్లడించింది. చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం మార్చి 6 నుంచి విచారణ చేపట్టనున్నది. ఈ ధర్మాసనంలో న్యాయమూర్తులు ఎకె సిక్రి, ఎఎం ఖన్విల్కర్, డివై చంద్రచూడ్, ఆశోక్‌భూషణ్ సభ్యులుగా ఉంటారు. 2013,భూసేకరణ చట్టంలోని సెక్షన్ 24 ప్రకారం భూమిని కోల్పోయే బాధితులకు ప్రభుత్వం తగిన పరిహారం, పునరావాసం కల్పించాలి. అయితే, ఈ చట్టాన్ని ఏవిధంగా అమలు చేయాలనే విషయంలో సుప్రీంకోర్టుకు చెందిన ముగ్గురు సభ్యుల వేర్వేరు ధర్మాసనాలు వేర్వేరు తీర్పులివ్వడం గమనార్హం.

వివరాలు ఇలా ఉన్నాయి..ఈ నెల 21న జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ముందుకు ఈ అంశానికి సంబంధించి ఓ కేసు వచ్చింది. ఫిబ్రవరి



8న అదే అంశంపై ముగ్గురు సభ్యుల మరో ధర్మాసనం తీర్పు ఇచ్చింది. అది పుణె మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన కేసు. ఫిబ్రవరి 8 తీర్పు ప్రకారం నిర్ణీత ఐదేండ్ల గడువులోగా భూయజమానులు ఏవైనా కారణాలు చూపి పరిహారం తీసుకోనంత మాత్రాన భూసేకరణ రద్దు కాదు. ఇదే అంశంపై 2014లో సుప్రీంకోర్టుకు చెందిన ముగ్గురు సభ్యుల మరో ధర్మాసనం ఇందుకు విరుద్ధంగా తీర్పు ఇచ్చింది. భూయజమానులకు పరిహారం అందించని పక్షంలో భూసేకరణ భేషరతుగా రద్దవుతుందన్నది ఈ తీర్పు సారాంశం. దాంతో, ఈ రెండు తీర్పులు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని భావించిన జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి సిఫారసు చేసింది. అత్యున్నత న్యాయస్థానం న్యాయ క్రమశిక్షణ పాటించాలని, సాధికారతను కాపాడుకోవాలని, లేదంటే ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఈ సందర్భంగా జస్లిస్ లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని రాజ్యాంగ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు లేదా తుది తీర్పు ఇచ్చే వరకూ భూసేకరణ చట్టంలోని సెక్షన్ 24కు సంబంధించిన కేసులను హైకోర్టులు చేపట్టవద్దని సుప్రీం ధర్మాసనం సూచించింది. దీనిపై తుదపరి విచారణను జస్టిస్ లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం మార్చి 7కు వాయిదా వేయగా, ఈలోగానే(మార్చి 6న) రాజ్యాంగ ధర్మాసనం విచారణ ప్రారంభించనున్న విషయం గమనార్హం. ఫిబ్రవరి 22న ఇలాంటిదే మరో కేసు ఇద్దరు సభ్యుల సుప్రీం ధర్మాసనం ముందుకు రాగా, దానిని తగిన ధర్మాసనానికి బదలాయించాలంటూ చీఫ్ జస్టిస్‌కు మరో సిఫారసు కూడా అందింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelagna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.